ప్రభాతనవ

SINGIDI | తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

గురువారం 10 సెప్టెంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 85 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

బీజేపీ గెలుపును

## ఎవరూ ఆపలేరు


ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..

తెలంగాణలో అధికారంలోకి వస్తాం

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

2





2

ఝార్ఖండ్ ఓటర్ల జాబితాలో

## అఫ్ఘనీయులు

దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి..

## కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ



గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ

1000 రోజులు గడిచినా

కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ

తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు

దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత

రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై

ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ

2

## బీఆర్ఎస్ చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు

లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసిన పలువురు మంత్రులు



2

లోకభవన్‌లో గవర్నర్ శివ్‌కుమార్ శుక్లాను పలువురు మంత్రులు కలిశారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ తొలిరోజు లోపలికి ప్రవేశించే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు... స్పీకర్‌ను అవమానపర్చేవిధంగా మాట్లాడిన తీరును మంత్రులు గవర్నర్‌కు వివరించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సింగిడి)

# అషేమ్‌బ్లీ

ప్రజలను ఎగతాళి చేస్తున్న పాలకులు

వృధా అవుతున్న ప్రజాధనం

సభలో బూతుల పర్వం... అసెంబ్లీ నుంచి రోడ్డుపైకి రచ్చ

డీజీపీ సైతం రోడ్డుపైకి రావాల్సిన పరిస్థితి

అరెస్టులు.. సస్పెన్షన్లు.. ఇదేనా ప్రజాస్వామ్య సభ

మేధావుల ఆగ్రహం

ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీ లో పాలక పక్షం ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతున్నది. ప్రధాన ప్రతిపక్షంగా అది బయట పెట్టాల్సిన బీఆర్ఎస్ అనవసరపు రగడకు ఆజ్యం పోసింది.ఇక అసెంబ్లీ నిర్ణయాలతో తమకు ఏదో ఒరుగుతుందని భావిస్తున్న తెలంగాణ ప్రజలు.., అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరుకు ఖిన్నులై చూస్తుండిపోతున్నారు.

సమావేశాలు మొదలైన మూడు రోజుల్లోనే నిరసనలు.. పోలీసులతో ఉద్రిక్తతలు.. స్పీకర్‌పై వ్యాఖ్యల వివాదం.. అరెస్టులు.. సస్పెన్షన్ల వరకు పరిణామాలు వెళ్లాయి. ప్రతిపక్ష, పాలకవర్గాలు ప్రజలతో ఆటలాడుకుంటున్నాయి.

(హైదరాబాద్ - సింగిడి)



రైతులు.. నిరుద్యోగులు.. ఉద్యోగులు.. విద్య.. వైద్యం.. సంక్షేమం.. ఇలా ప్రజలను వెంటాడుతున్న ఎన్నో సమస్యలున్నాయి. వాటిపై చర్చించి పరిష్కార మార్గాలు చూపాల్సిన సభలో.. ఎవరు ఎవరిని ఎంత తీవ్రంగా విమర్శించారు.. ఎవరి వ్యాఖ్యలు ఎంత వైరల్ అయ్యాయి అన్నదే హైలైట్‌గా మారుతోంది. ప్రజాధనంతో జరిగే సమావేశాల్లో ప్రజా అంశాలకే ప్రాధాన్యం ఉండాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### సభ నుంచి రోడ్డుపైకి..

ఈ దఫా రచ్చకు తొలి ట్రిగ్గర్ బీఆర్ఎస్ నిరసనే. నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో గేటు వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. నేతలను అదుపులోకి తీసుకోవడం.. ఆ తర్వాత అదే అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగడంతో పరిస్థితి మరింత ముదిరింది.

### డీజీపీ సైతం రోడ్డుపైకి..

సాధారణంగా శాంతిభద్రతలను పర్యవేక్షించే అత్యున్నత పోలీస్ అధికారి డీజీపీ సైతం పరిస్థితిని అదుపులో ఉంచేందుకు రోడ్డుపైకి రావాల్సిన స్థాయికి వ్యవహారం చేరింది. అసెంబ్లీ చుట్టూ రాజకీయ వివాదం.. శాంతిభద్రతల సమస్యగా మారిన తీరుకు ఇది నిదర్శనంగా మారింది.

### రచ్చను పొడిగించింది ఎవరు..

బీఆర్ఎస్ నిరసనతో మొదలైన వ్యవహారం.. స్పీకర్‌పై వ్యాఖ్యల వివాదంతో మరో మలుపు తిరిగింది. కాంగ్రెస్ దీనిని తీవ్రంగా తీసుకుని చర్యలకు దిగింది. ఎమ్మెల్సీలపై కేసులు, అరెస్టులు.. కేసీఆర్ క్షమాపణకు అసెంబ్లీ తీర్మానం వరకు వెళ్లింది. మరోవైపు బీఆర్ఎస్ కూడా పోలీసుల తీరును ప్రశ్నిస్తూ అదే అంశాన్ని కొనసాగించింది. చివరకు సభలో నిరసనలు, వెల్‌లోకి వెళ్లడంతో 22 మంది ఎమ్మెల్యేల సస్పెన్షన్ వరకు పరిణామాలు చేరాయి.

### మూడు రోజులు.. ఇదే తీరు

మూడు రోజులు కావస్తున్నా.. రాజకీయ వేడి తగ్గలేదు. అధికార పక్షం బీఆర్ఎస్ సభ్యుల తీరును తప్పుబడుతుంటే.. ప్రతిపక్షం ప్రభుత్వం, పోలీసుల వ్యవహారాన్ని ప్రశ్నిస్తోంది. ఎవరి వాదనలో నిజం ఎంత అన్నది పక్కన పెడితే.. ఇరుపక్షాల కౌంటర్ రాజకీయాల్లో అసలు ప్రజా అంశాలే వెనక్కి వెళ్లిపోయాయి.

### అసెంబ్లీ గౌరవం ఎక్కడ..

*అధికార పక్షం ప్రభుత్వాన్ని సమర్థించుకోవడం.. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజమే. కానీ.. ఆ రాజకీయ పోరాటం వ్యక్తిగత విమర్శలు.. బూతులు.. సభాంతరాయాలు.. రోడ్డుపై ఉద్రిక్తతల వరకు వెళ్లినప్పుడు అసలు చర్చే దారి తప్పుతుంది. లక్షల ఉన్న రూపాయల ప్రజాధనంతో సమావేశాలు జరుగుతున్నాయి. ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం కోసం అసెంబ్లీ వైపు చూస్తున్నారు. కానీ మూడు రోజుల్లో వారికి ఎక్కువగా కనిపించింది కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ రాజకీయ పోరాటమే. ప్రజల గొంతుక వినిపించాల్సిన సభ.. నేతల రాజకీయ ఫైటింగ్ కు వేదికగా మారింది.*

ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో

# కుట్ర..

బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు


స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు

ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తాం

అందరినీ శిక్షించేలా పూర్తిస్థాయి విచారణ

కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు

2



అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సింగిడి)

శాసనసభ నుంచి

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

2

కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై వేటు

సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు

సస్పెన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం

సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్



## 22ఏపై చర్చకు నో

తెలంగాణ అసెంబ్లీ నుంచి బీజేపీ ఎమ్మెల్యేల వాకౌట్

తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఉద్రిక్తంగా మారాయి. సభా కార్యక్రమాలకు పదే పదే ఆటంకం కలిగిస్తున్నారనే కారణంతో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ శాసనసభ్యులపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర చర్యలు తీసుకున్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సింగిడి)

2

తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త..

## పీఆర్‌సీపై ప్రభుత్వం కీలక అడుగు

పీఆర్‌సీ ప్రక్రియను వేగవంతం చేసే దిశగా కీలక అడుగు

నివేదిక త్వరగా ఇవ్వాలని పీఆర్‌సీ ఛైర్మన్‌కు సీఎస్ లేఖ

రెండో పీఆర్‌సీ గడువు ముగుస్తున్న నేపథ్యంలో నిర్ణయం

బకాయి డీఏల విడుదలపై ఉద్యోగుల నుంచి డిమాండ్లు

ఈ20 వినియోగం...కేంద్రానికి

## తెలంగాణ సర్కారు మద్దతు

ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదు:మంత్రి పొన్నం ప్రభాకర్

తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి

ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు

2

ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సింగిడి)





## జగన్ పాదయాత్ర

2.0కు ముహూర్తం ఖరారు

మళ్లీ అదే సెంటిమెంట్‌తో...

మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమైన వైఎస్ జగన్

2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో యాత్ర ప్రారంభం

బాపట్ల జిల్లా పర్చూరు కార్యకర్తల సమావేశంలో ప్రకటన

2029 ఎన్నికలే లక్ష్యంగా రెండో విడత యాత్రకు వ్యూహరచన

'ప్రజా సంకల్ప యాత్ర' సెంటిమెంట్‌నే మళ్లీ ఫాలో అవుతున్న జగన్

2

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా తాను చేపట్టబోయే రెండో విడత పాదయాత్రకు ముహూర్తం ఖరారు చేశారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని స్పష్టత ఇచ్చారు. నేడు బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల సమావేశంలో జగన్ ఈ కీలక ప్రకటన చేశారు.

అమరావతి, సెప్టెంబర్ 9 (సింగిడి)

## కేంద్ర కేబినెట్ భేటీ

తెలుగు రాష్ట్రాలపై వరాల జల్లు

దేశవ్యాప్తంగా రైల్వే కారిడార్లలో

నాలుగు లేన్ల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

2



ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ భేటీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, అశ్వినీ వైష్ణవ్ తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా రైల్వే కారిడార్లలో నాలుగు లేన్ల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యంగా దక్షిణాదిలోని తెలంగాణ, ఏపీ తమిళనాడు, కర్ణాటక పరిధిలో 5, ఉత్తరాదిలో 3 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులను చేపట్టనున్నారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (సింగిడి)



తిరుమల భక్తులకు ఇకపై

## రూ.10 లక్షల బీమా

భక్తుల ప్రమాద బీమా రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు

సహజ మరణానికి రూ.2 లక్షల బీమా

బీమా పథకానికి ఎల్ఐసీకి రూ.2.12 కోట్ల ప్రీమియం చెల్లింపు

లడ్డూ తయారీకి 400 అదనపు పోస్టులకు ప్రతిపాదనలు

ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ తయారీకి ప్లాంట్

2

శ్రీవారి దర్శనానికి వచ్చి ప్రమాదవశాత్తూ మరణించే భక్తుల కుటుంబాలకు అందించే బీమా మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని 'తిరుమల తిరుపతి దేవస్థానం' (టీటీడీ) బోర్డు నిర్ణయించింది. తిరుమల (సింగిడి)

కేసీఆర్‌కు రాష్ట్రంలో

## అత్యధిక భద్రత ఉంది

కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకోలేదన్న మహేశ్ గౌడ్

కేసీఆర్ గతంలో గాయపడినప్పుడు సీఎం రేవంత్ వెంటనే స్పందించారని వెల్లడి

సిరిసిల్లలో సీఎం రేవంత్‌కు పిండ ప్రదానంపై మహేశ్ గౌడ్ ప్రశ్నలు



2

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సింగిడి)

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 10 సెప్టెంబర్ 2026

# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..

స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యల చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేపిందని ఆరోపించారో... అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రదారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో నిన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధీకరణ చేశారని, ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారని, దళితుడైన సభాపతి తల్లిని హేయమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని, కానీ తల్లిని అవమానిస్తారా నిలదీశారు. సభాపతికి క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయని గుర్తు చేశారు. అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయకుమార్‌ను నియమిస్తున్నాం. విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయకుమార్‌ను నియమిస్తున్నాం. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బంది పెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నాం. డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం. కుట్రదారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ జరుగుతుంది. క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని అన్నారు. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడ డప్పు మోగించి వాళ్ల నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదని స్పష్టం చేశారు. దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని మాత్రమే వారు కోరారని, వారికి కేసీఆర్ క్షమాపణలు చెప్పకుండా మరో కుట్రకు ఆదేశించారని వెల్లడించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే శుద్ధి చేశామని బీఆర్ఎస్ నేత సండ్ర వెంకటరావు పోస్టు చేశారని, పదేళ్లు సీఎంగా ఉండి విజ్ఞత కలిగిన నాయకుడు ఇలా చేస్తారా ప్రశ్నించారు. శుద్ధి చేయాల్సింది నేలను కాదని, అంటరానితనం ఆలోచనలను శుద్ధి చేయాలని, తరతరాలుగా వాళ్ల మనసుల్లో ఉన్న కుళ్లు, అంతరాలను శుద్ధి చేయాలని హితవు పలికారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలని, దళితులను అవమానించిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా కూడా శిక్షిస్తామని హెచ్చరించారు. మల్లికార్జున ఖర్గే, ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానాలు వ్యక్తులకు జరిగినవి కాదని, కులవివక్ష, అణిచివేత చర్యలను ప్రజా ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు.



## బీఆర్ఎస్ చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు

గవర్నర్‌ను కలిసిన వారిలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ దొర అహంకారంతో వ్యవహరిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. శాసనసభ స్పీకర్, ఆతని తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూషించారని... దీన్ని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్ హౌజ్ దగ్గర డప్పులతో దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం భట్టి నేత త్వంలో పలువురు మంత్రులు... గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా కు ఫిర్యాదు చేశారు. దళితులు ప్రజాస్వామ్యంగా నిరసన తెలిపితే కేసీఆర్ అవమానించారు, తన ఫామ్‌హౌస్ రోడ్డుపై దళితులు నడిచారని కేసీఆర్ శుద్ధి చేయించారు. కేసీఆర్ చూపించిన అంటరానితనంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. బీఆర్ఎస్ నేతలు స్పీకర్, స్పీకర్ తల్లిని కూడా దూషించారు. బీఆర్ఎస్ నేతలు చేసిన శుద్ధీకరణపై కేసీఆర్ ఇప్పటికైనా స్పందించాలి. దళితులను అవమానించటం కేసీఆర్ ఆదేశాలతోనే జరుగుతున్నదా, కేసీఆర్ ఆదేశించకపోతే ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదుపై స్పీకర్ స్పందించారని, ఘటనపై విచారణకు ఆదేశించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారని లక్ష్మణ్ తెలిపారు. ప్రజాపాలనలో అంటరానితనానికి తావు లేదని, ఇలాంటి కుల వివక్ష ఘటనలను సహించబోమని అడ్లూరి ప్రకటించారు. బీఆర్ఎస్ నేతల తీరును గవర్నర్‌కు వివరించడం కోసమే తాము లోక భవన్‌కు వెళ్లినట్లు ఆయన తెలిపారు. మరోవైపు ఉదయం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేటీఆర్ నేత త్వంలో గవర్నర్‌ను కలిసి అసెంబ్లీలో తొలిరోజు వివాదం, తమ సస్పెన్షన్ గురించి వివరించారు.

## కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సింగిడి)**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

## 22ఏపై చర్చకు నో

దాదాపు 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఈ వర్షాకాల సెషన్ ముగిసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ బుధవారం ప్రకటించారు. సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు పోడియం వద్దకు వెళ్లి నినాదాలతో సభను స్తంభింపజేసే ప్రయత్నం చేశారు. స్పీకర్ పదే పదే విజ్ఞప్తి చేసినప్పటికీ గందరగోళం కొనసాగడంతో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రతిపాదించిన సస్పెన్షన్ తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డి సహా 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సెషన్ ముగిసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

**22A అంశంపై బీజేపీ వాకౌట్..**

మరోవైపు నిషేధిత భూముల జాబితా (22A) అంశంపై అసెంబ్లీలో తక్షణమే చర్చ చేపట్టాలని బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. తమ వాయిదా తీర్మానంపై స్పందించకపోవడంతో పాటు 22Aపై చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ శాసనసభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ పరిణామాలతో తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

## కేసీఆర్‌కు రాష్ట్రంలో అత్యధిక భద్రత ఉంది

బీఆర్ఎస్ నేతలే సీఎం రేవంత్ రెడ్డి పట్ల అనుచితంగా ప్రవరిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కేసీఆర్ గతంలో బాత్‌రూమ్‌లో జారిపడినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారని చెప్పారు. అర్ధరాత్రి గ్రీన్ ఛానల్ ద్వారా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారని తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు సీఎం స్వయంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు. సీఎం తర్వాత రాష్ట్రంలో అత్యధిక భద్రత పొందుతున్న వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతలు పిండ ప్రదానం చేయడం ఎంతవరకు సమంజసమని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. స్పీకర్ పదవిపై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన వ్యాఖ్యలపైనా ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలను తెలంగాణ సమాజం ఖండిస్తోందన్నారు. కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన సొంత కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని చెప్పారు. కేసీఆర్‌పై కాంగ్రెస్‌కు గౌరవం ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. ఆయన త్వరగా కోలుకుని అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామని చెప్పారు. దళితులు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు

**రాష్ట్ర మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 09 (సింగిడి):**

తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా ఆమె మీడియాకు విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి లను వారి పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష ఎమ్మెల్యేలు ఇలా దురుసుగా ప్రవర్తించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. గత సోమవారం నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. తమ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేయి చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాజాగా మంత్రి సీతక్క చేసిన ఆరోపణల ఈ వివాదాన్ని మరో మలుపు తిప్పాయి. మరోవైపు, విధులకు ఆటంకం కలిగించడం, మహిళా పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి అభియోగాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై పోలీసులు ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు.

## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

**ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..**
**తెలంగాణలో అధికారంలోకి వస్తాం**
**కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్**

**హైదారాబాద్, సెప్టెంబర్ 09 (సింగిడి):**

తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజరు ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం ద ష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్త త స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజరు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజరు వ్యాఖ్యానించారు.

## కేంద్ర కేబినెట్ భేటీ

గత పన్నెండేళ్లుగా కొనసాగుతున్న రైల్వే ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఈ కీలక ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. ప్రధాని మోడీ నేతృత్వంలో రైల్వే శాఖను పూర్తిగా ప్రక్షాళన చేసి ఆధునీకరిస్తున్నట్లుగా కేబినెట్ భేటీ అనంతరం కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. భవిష్యత్తులో అత్యధిక రద్దీని తట్టుకునేలా ఏడు హై-డెన్సిటీ రైల్వే కారిడార్లతో పాటు మరికొన్ని మార్గాల్లో నాలుగు లేన్లు, క్వాడ్రుప్లింగ్ పనులను చేపట్టనున్నట్లుగా ఆయన తెలిపారు.

**ఏపీలో రూపుదిద్దుకోనున్న ప్రాజెక్టులు**

కేంద్ర కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయాలతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రైల్వే మార్గాలకు ఊతం లభించనుంది. ఇందులో భాగంగా హౌరా-చెన్నై కారిడార్‌లో విశాఖపట్నం, విజయవాడ మీదుగా నాలుగు లేన్ల రైల్వే నెట్‌వర్క్ పనులకు కేంద్రం ఓకే చెప్పింది. అదేవిధంగా ముంబై-చెన్నై రైల్వే కారిడార్‌లో భాగంగా గుంతకల్లు, రేణిగుంట మీదుగా నాలుగు లేన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాకపోకలు సాగించే రైళ్లకు మెరుగైన సౌకర్యం కలగనుంది. అయితే, దేశవ్యాప్తంగా రద్దీగా ఉండే కీలక మార్గాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ప్రయాణికుల రద్దీకి తగినట్లుగా మౌలిక వసతులను కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాబోయే కాలంలో రద్దీ విపరీతంగా పెరిగే కారిడార్లను ముందే గుర్తించి ఈ నాలుగు లేన్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

**తెలంగాణలోనూ..**

తెలంగాణలోని ఘట్‌కేసర్-కాజీపేట్ మధ్య నాలుగో లేన్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ. 2,419 కోట్లతో ఘట్‌కేసర్-కాజీపేట్ మధ్య 110 కిలోమీటర్ల మేర ఈ నాలుగో లేన్ నిర్మాణం జరగనుంది. అదేవిధంగా అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 3, 4 లేన్ల నిర్మాణానికి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మొత్తం 77 కిలోమీటర్ల పొడవుతో ఈ పనులను చేపట్టనున్నారు.

## జగన్ పాదయాత్ర

గతంలో అధికారం కోసం జగన్ ఇదే ఫార్ములాను అనుసరించిన విషయం తెలిసిందే. 2017 నవంబర్ 6న కడప జిల్లా ఇడుపులపాయలో 'ప్రజా సంకల్ప యాత్ర' పేరుతో ఆయన తన తొలి పాదయాత్రను ప్రారంభించారు. ఆ యాత్ర 341 రోజుల పాటు ఏకధాటిగా సాగి, 3,648 కిలోమీటర్ల దూరం కొనసాగింది. 2019 జనవరి 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో యాత్ర ముగిసింది. ఈ యాత్రలో భాగంగానే ఆయన 'నవరత్నాలు' పథకాలను ప్రకటించారు. ప్రజల నుంచి వచ్చిన అపూర్వ స్పందన, యాత్రలో తెలుసుకున్న సమస్యల ఆధారంగా రూపొందించిన ఈ హామీలు 2019 ఎన్నికల్లో వైసీపీకి చారిత్రాత్మక విజయాన్ని అందించాయి. మళ్లీ అదే సెంటిమెంట్‌తో 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జగన్ ఈ రెండో పాదయాత్రకు సిద్ధమయ్యారు. 2027లో యాత్ర ప్రారంభించి, ఎన్నికల వరకు దాదాపు రెండేళ్ల పాటు ప్రజల మధ్యే ఉండాలని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ వ్యూహరచన చేస్తున్నారు. త్వరలోనే ఈ పాదయాత్రకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, రూట్‌మ్యాప్‌పై స్పష్టత రానుంది. మొత్తం మీద 2029 ఎన్నికల సమరానికి జగన్ ఇప్పటినుంచే 'పాదయాత్ర 2.O'తో సిద్ధమవుతున్న సంకేతాలు పంపారు.

## తిరుమల భక్తులకు ఇకపై రూ.10 లక్షల బీమా

తిరుమలలో జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరాలను వెల్లడించారు. భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పలు నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. బీమా పథకం అమలుకు టీటీడీ నిధుల నుంచి ఎల్ఐసీకి రూ.2.12 కోట్లు చెల్లించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. సీపీఎస్, ఎన్‌పీఎస్ పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఈహెచ్‌ఎఫ్ సౌకర్యం కల్పించేందుకు రూ.2 కోట్ల యాజమాన్య వాటాకు ఆమోదం తెలిపారు. టీటీడీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 48 మంది ఉద్యోగుల వేతనాలు పెంచాలని నిర్ణయించారు. శ్రీవారి పోటులో లడ్డూల తయారీ వేగం పెంచేందుకు 400 అదనపు అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపనున్నారు. తిరుమలలోని అన్నప్రసాద కేంద్రం, క్యాంటీన్లు, హోటళ్ల నుంచి వచ్చే ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ తయారు చేయనున్నారు. ఇందుకోసం ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను రూ.2.80 కోట్లతో జీపీఎస్ రెన్యువబుల్స్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికి రవాణా ఛార్జీల కోసం మూడేళ్లకు రూ.1.60 కోట్లు కేటాయించారు. నారాయణవనం ఆలయంలో అమ్మవారి పద్మపీఠానికి బంగారు తాపడం చేయాలని నిర్ణయించారు. చెన్నైలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం, బలిపీఠానికి బంగారు తాపడం కోసం రూ.17.05 కోట్లకు ఆమోదం తెలిపారు. తిరుపతిలోని తెలుగు, సంస్కృత అకాడమీకి కేటాయించిన టీటీడీ భవనం లైసెన్స్ గడువును మరో మూడేళ్లు పొడిగించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆమోదించిన రూ.49 కోట్ల ఆర్థిక సహాయంలో రెండో విడతగా రూ.7.56 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించారు.

## ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!

**కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ**


**హైదరాబాద్, సెప్టెంబర్ 09 (సింగిడి):**


బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు వసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిందు రాహుల్ గాంధీ" అంటూ 3 రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.


## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

**కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై వేటు**
**సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు**
**సస్పెన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం**
**సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 09 (సింగిడి):**







బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశికరెడ్డి, మాధవరం క ష్ణారావు, కోవా లక్ష్మి, మాణికరావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కే.సంజరు, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. వడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. భాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు.



**తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త..**

## పీఆర్‌సీపై ప్రభుత్వం కీలక అడుగు

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కీలక చర్య చేపట్టింది. 2వ వేతన సవరణ కమిషన్ (పీఆర్‌సీ) నివేదికను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోరారు. ఈ మేరకు రెండో పీఆర్సీ ఛైర్మన్ ఎన్. శివశంకర్‌కు లేఖ రాశారు. గతంలో నియమించిన రెండో వేతన సవరణ కమిషన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పీఆర్‌సీ అమలుపై ఉద్యోగ సంఘాల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. బకాయి ఉన్న డీఏలు విడుదల చేయాలని, పీఆర్‌సీ నివేదిక ఆధారంగా ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాలపై ఉద్యోగులు ఆందోళన బాట పట్టడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. పీఆర్‌సీ కమిషన్ వేగంగా నివేదిక సమర్పిస్తే.. దాని ఆధారంగా ఉద్యోగుల వేతన సవరణపై తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. కమిషన్ నివేదిక అందిన తర్వాత ఫిట్‌మెంట్, వేతన సవరణకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో పీఆర్‌సీపై ఉద్యోగుల్లో మరోసారి ఆశలు నెలకొన్నాయి.

## ఝార్ఖండ్ ఓటర్ల జాబితాలో ఆఫ్ఘనీయులు

**దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి..**

**జమ్‌షెడ్‌పూర్, సెప్టెంబర్ 09 (సింగిడి):**

ఝార్ఖండ్‌లో నిర్వహించిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో తీవ్ర దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి వచ్చింది. జమ్‌షెడ్‌పూర్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓటర్ల ముసాయిదా జాబితాలో ఏకంగా ముగ్గురు ఆఫ్ఘనిస్థాన్ పౌరుల పేర్లు నమోదైనట్లు అధికారులు గుర్తించారు. ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన, పత్రాల ధ వీకరణ సమయంలో అధికారులు ఈ వ్యత్యాసాన్ని కనిపెట్టారు. నోటీసులు జారీ చేసినప్పటికీ, వారు సరైన భారతీయ పౌరసత్వ పత్రాలను సమర్పించలేకపోయారు. అనంతరం నిర్వహించిన తనిఖీల్లో వారి వద్ద ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్టులు లభించడంతో వారు విదేశీయులని నిర్ధారణ అయింది. ఝార్ఖండ్ సీఈవో కేజీ రవికుమార్ ఈ అంశాన్ని ధ్రువీకరిస్తూ, విదేశీ పౌరుల పేర్లను ఓటర్ల జాబితా నుండి తక్షణమే తొలగించినట్లు వెల్లడించారు. విదేశీ పౌరులకు భారతీయ ఓటరు కార్డులు లభించేలా వెనుకుండి సహకరించిన వ్యక్తులు, అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురి కుటుంబ సభ్యుల పత్రాలపై కూడా తనిఖీలు జరుపుతున్నామని... రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి విదేశీయుల పేర్లు నమోదయ్యాయా అన్న కోణంలో దర్యాప్తు వేగవంతం చేసినట్లు వెల్లడించారు.

**ఈ20 వినియోగం...కేంద్రానికి**

## తెలంగాణ సర్కారు మద్దతు

ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 10-9-2026

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి



- గండిపేట మండలంలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 9 (సింగిడి):** పాఠశాలల్లో విద్యార్థులు ప్రాథమిక చదువు, సంఖ్యా పరిజ్ఞానంలో మెరుగైన నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం గండి పేట మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బండ్లగూడలోని యూపీఎస్, హిమాయత్‌సాగర్‌లోని యూపీఎస్ పాఠశాలలను పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు తీరును, దానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడి, వారి చదువుల స్థాయిని పరీక్షించారు. పిల్లల చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. తరగతి గది బోధనపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల అభ్యసన ఫలితాలు మెరుగుపరిచేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ? ఈ తనిఖీ కార్యక్రమంలో గండిపేట మండల విద్యాశాఖాధికారి , సీఆర్‌పీలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ యంగ్ లీడర్స్... డైలాగ్ 2027లోయువతకు పెద్దపీట




### మేడ్చల్--మల్కాజిగిరి యువతకు ఆహ్వానం

**మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 9 (సింగిడి):** కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ మేడ్చల్--మల్కాజిగిరి, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి తమ ఆలోచనలను అందించేందుకు జాతీయ వేదికగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027లో పాల్గొనాలని జిల్లా యువతకు ఆహ్వానం పలికింది. ఎంపికైన యువతకు భారత ప్రధానమంత్రి గారి సమక్షంలో తమ ఆలోచనలను ప్రదర్శించే అవకాశం లభిస్తుంది. హైదరాబాద్‌లోని పీఐబీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మై భారత్ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ అన్షిక్ చింతల కార్యక్రమ వివరాలను వెల్లడిస్తూ, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. జాయింట్ డైరెక్టర్, యువజన సేవల వేణుగోపాల్ రావు కూడా సమావేశంలో ప్రసంగించారు. ఆగస్టు నాటికి 15--29 సంవత్సరాల వయస్సు ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. ఇందులో ఆరు విభాగాలు ఉన్నాయని అవినీతి భారత్ ఛాలెంజ్, కల్చరల్ ట్రాక్, డిజైన్ ఫర్ భారత్, హ్యాక్ ఫర్ సోషల్ కాజ్, యూత్ ఎంట్ర ప్రెన్యూర్ ఛాలెంజ్ మరియు యూత్ పార్లమెంట్. తెలంగాణ ప్రాంతీయ థీమ్ "టెక్నాలజీ, ఇన్నోవేషన్ & ఫ్యూచర్ రెడీనెస్". వికసిత్ భారత్ ఛాలెంజ్‌లో డిజిటల్ క్విజ్, వ్యాసరచన, జిల్లా స్థాయి ప్రజెంటేషన్లు, రాష్ట్ర స్థాయి ఎంపిక ఉంటాయి. జాతీయ స్థాయి తుది పోటీ 2027 జనవరి 10 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించబడతాయని తెలిపారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ విచారణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్ (ప్రతినిధి, సెప్టెంబర్ 9 (సింగిడి):** వికారాబాద్ మునిసిపల్ పరిధిలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ విచారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆలంపల్లి ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐఆర్ విచారణకు వచ్చిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలని అధికారులను సూచించారు. ఆనామలీస్, మ్యాపింగ్ కానీ, ఓటర్ జాబితాలో పుట్టిన తేదీల మార్పుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇప్పటివరకు కూడా నోటీసులు జారీ చేయని వారిని గుర్తించి విచారణకు హాజరు అయ్యేవిధంగా బిఎల్ఓ లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, వీఆర్వో సన్నలత, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి లు ఉన్నారు.

## దళిత స్పీకర్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ పటాన్‌చెరులో కాంగ్రెస్ నిరసన

బీఆర్ఎస్ ఎమ్మెల్సీని తక్షణమే సస్పెండ్ చేయాలి

కాటా సుధా శ్రీనివాస్ గౌడ్



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 9 (సింగిడి):** దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన అహంకారపూరిత, అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. పటాన్‌చెరు డివిజన్‌లోని గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు. కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రజాప్రతినిధులు హుందాతనంతో వ్యవహరిస్తూ రాజ్యాంగ విలువలను గౌరవించాలని సూచించారు. దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పదవులకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు గౌరవం ఉండేలా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఘనాపూర్, పార్టీ, కర్దనూర్ , నందిగామ, భానూరు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# పటాన్చెరులో కదం తొక్కిన గులాబీ మహిళా దండు..

- శాంతియుత నిరసనను అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు.. తిరగబడిన బిఆర్ఎస్ కార్యకర్తలు..
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి యాదమ్మ మహిపాల్ రెడ్డి నేతృత్వంలో భారీ నిరసన





**పటాన్చెరు, సెప్టెంబర్ 9 (సింగిడి):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ పటాన్చెరు పట్టణ వేదికగా బిఆర్ఎస్ మహిళా శ్రేణులు భారీ ఆందోళన చేపట్టాయి. పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదేశాల మేరకు..ఆయన సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు, బిఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై మహిళా నాయకులు, కార్యకర్తలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమను కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకునేందుకు ప్రయత్నించాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ మహిళా శాసన సభ్యురాళ్లపై దాడి సిగ్గుచేటు" అంటూ మహిళా శ్రేణులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. మహిళల పట్ల దురుసుగా వ్యవహరించిన ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ఎవరూ అడ్డుకోలేరని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య బద్ధంగా..రాజ్యాంగం ఇచ్చిన హక్కుకు అనుగుణంగా తమ పార్టీ కార్యకర్తలు నాయకులతో కలిసి శాంతియుత నిరసన కార్యక్రమం చేపడుతుంటే.. అధికార కాంగ్రెస్ పార్టీ అడ్డుకునేందుకు ప్రయత్నం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిఒక్కరికి ఉంటుందని.. దానిని సైతం అనగదొక్కేందుకు ప్రయత్నిస్తే తరిమికొడతామని ఆమె హెచ్చరించారు. శాసన సభ సమావేశాలకు వెళ్తున్న బిఆర్ఎస్ పార్టీ మహిళా శాసనసభ్యులపై పోలీసులు దాడి చేయడం ప్రజాస్వామ్యానికే మచ్చ అని అన్నారు. ఈ అంశంపై చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. తిరిగి బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధి పై కేసులు నమోదు చేయడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు పోరాటాలు కొత్త కాదని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడేంతవరకు నిరంతర పోరాటాలు చేస్తూనే ఉంటామని వారు హెచ్చరించారు..పటాన్చెరు గడ్డపై గులాబీ మహిళా దండు భారీగా కదలడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు మార్మోగాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, నిరంతరం పోరాటం చేస్తామని బీఆర్ఎస్ శ్రేణులు స్పష్టం చేశాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటం.. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడే పోరాటం. దురహంకార ప్రభుత్వానికి త్వరలోనే చరమగీతం పాడుతాం" అని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

# నిరసనలతో హోరెత్తిన వికారాబాద్ జిల్లా

గృహనిర్బంధంలో బిఆర్ఎస్ నాయకులు
స్పీకర్ కూతురు అనన్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**వికారాబాద్ (ప్రతినిధి, సెప్టెంబర్ 9 (సింగిడి):** ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకున్న ఆయా ఘటనలతో అధికార, ప్రతిపక్ష నాయకుల నిరసనలు కూడా కొనసాగాయి. తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యే గా ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కేంద్రంలో పాటు ఆయా పట్టణాల్లో నిరసనలతో దద్దరిల్లాయి. స్పీకర్ పై నిండు సభలో జరిగిన పరాభావానికి నిరసనగా కాంగ్రెస్ నాయకులు రోడ్డెక్కి వచ్చి తీవ్ర స్థాయిలో గొంతెత్తి నినదించారు. బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్, ప్రెసిడెంట్ కే టీ ఆర్ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్సీ తక మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మధుపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా అసెంబ్లీ ముందు బి ఆర్ ఎస్ నేతలు సృష్టించిన విధ్వంసం ఉద్దేశపూర్వకంగా చేసిన పన్నాగమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ నేపథ్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో స్థానిక మున్సిపల్ చైర్పర్సన్, స్పీకర్ కూతురు అనన్య, వైస్ చైర్మన్ అర్ల సుధాకర్, సీనియర్ నాయకుడు రమేష్ కుమార్ తదితరుల ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించి బి ఆర్ ఎస్ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ నాయకుల గృహనిర్బంధం**

కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిర్వహిస్తున్న నిరసనల్లో భాగంగా బి ఆర్ ఎస్ నాయకుల నిరసనలో భాగంగా సోమవారం అసెంబ్లీ ముందు చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నదని, అధికార, ప్రతిపక్షం నేతలు జరిగిన పరిణామాల పట్ల భావోద్వేగంగా ఉన్న నేపథ్యంలో మంగళవారం బి ఆర్ ఎస్ నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. వికారాబాద్ లో పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ను ఆయా నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలను, జిల్లా, మండల స్థాయి నాయకులను గృహనిర్బంధం చేశారు. పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి ని రోడ్డుపై పోలీసులు అడ్డుకున్నారు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా ఈ విధానం కొనసాగింది. ఎట్టకేలకు వికారాబాద్ లో సీ ఎం దిష్టిబొమ్మను బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో దహనం చేసి తీరారు. నేపథ్యంలో అధికార, ప్రతిపక్షం నిరసనల్లో ఏలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఇ పై ఎస్ ఆధ్వర్యంలో శాంతి భద్రతలను పర్యవేక్షించారు. దీంతో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.

## వ్యర్థాలనుండి సంపదపై వర్క్‌షాప్



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 9 (సింగిడి):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వ్యవస్థాపకత్వ అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో రోజున కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవన్ కుమార్ అధ్యక్షతన వ్యర్థాల నుండి సంపద అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నిత్యజీవితంలో మనం వాడే వస్తువుల నుండి ఎన్నో వ్యర్థాలు వెలువడుతున్నాయన్నారు. ఏర్పడే వ్యర్థాలు గాలి,నీరు, పర్యావరణం,ప్రజల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. వ్యర్థాల ప్రతికూల ప్రభావం తగ్గిస్తూ వీటిని ఉపయోగించి సంపదను సృష్టించవచ్చనే వినూత్న ఆలోచనలను విద్యార్థుల్లో ఐనింప చేయడానికి ఇలాంటి వర్క్ షాపులు దోహదపడతాయని పేర్కొన్నారు . నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ నిఖిల్ రెడ్డి,మెప్మా కార్పొరేట్ క్రైమ్ అగ్రి ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు మరియు ముఖ్య కార్య నిర్వహణ అధికారి భార్గవి మందాడి, ట్రైనర్ ధనుంజయ్, జిల్లా వ్యవస్థాపకత్వ అభివృద్ధి మేనేజర్ మన్నె శిరీష, అసిస్టెంట్ మేనేజర్ రాజు వారు ప్రసంగిస్తూ వ్యర్థ పదార్థాలను ఉపయోగించి సంపద సృష్టించే అవకాశాలను వాటి ద్వారా ఏ ఏ ఉత్పత్తులను చేయవచ్చు చేసిన ఉత్పత్తులను ఎలా మార్కెట్ చేయాలి వ్యాపార స్థాపనకు అవకాశాలను అవసరమైన సౌకర్యాల గురించి విద్యార్థులకు చక్కని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు పాల్గొని సర్టిఫికెట్లు పొందినారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్వేత, డాక్టర్ ప్రవంతి, డాక్టర్ సువర్ణాదేవి, వ్యవస్థాపకత్వ అభివృద్ధి విభాగాధిపతి హరిప్రసాద్, అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.


## మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించలేని రేవంత్ సర్కార్ వెంటనే గద్దె దిగాలి

- కుత్బుల్లాపూర్ మహిళా నాయకురాల్ల డిమాండ్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 9 (సింగిడి):** అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం అసెంబ్లీకి వస్తున్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీలపై ప్రభుత్వం, పోలీసులు ప్రవర్తించిన తీరును నిరసిస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు చింతల్ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు విలువలను ఇస్తున్నామని చెప్పే రేవంత్ రెడ్డి ప్రభుత్వం సోమవారం ఉదయం అసెంబ్లీ గేటు వద్ద మహిళ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్సీల పట్ల వ్యవహరించిన తీరును చూస్తేనే మహిళలకు ఇచ్చేగౌరవం ఏంటో అర్థమవుతుందన్నారు. రాజ్యాంగబద్దంగా ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై కనీసం సీఎం రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించకపోవడం మహిళలను కించపరచడమేనన్నారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్ల అమలు ప్రభుత్వాన్ని అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రశ్నిస్తారనే భయంతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సభకు రానివ్వడని దురుద్దేశంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలపై ప్రభుత్వం దాడులకు పాల్పడింది. అసెంబ్లీ సభను కౌరవ సభగా మార్చి దుశ్శాసన పర్వానికి తెరలేపిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో మహిళలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల చీర లాగడం, జుట్టు పట్టి లాగడం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడులకు పాల్పడేందుకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించడం చూస్తుంటే ఇందిరమ్మ రాజ్యంలో రాజ్యాంగానికి, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును తెలంగాణ ప్రజలు గమనిస్తూ ఉన్నారని హెచ్చరించారు. నిరంకుశ ధోరణితో, కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన మహిళా విభాగం అధ్యక్షురాలు, నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్ఏ, సీనియర్ నాయకులకు కొలను హనుమంత రెడ్డి సన్మానం



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 9 (సింగిడి):** ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్ఐఆర్ --2026 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 277 డివిజన్ మహాదేవపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిద్దార్థ సంజీవరెడ్డి, 278 డివిజన్ -- దేగల సతీష్ బాబు, 291 డివిజన్ -- బట్ట పాలక్ష్మ 293 డివిజన్ అధ్యక్షులు సంతోష్ ముదిరాజ్, వివిధ డివిజన్లకు చెందిన అధ్యక్షులు, ఇంచార్జులు, కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, డిసిసి కమిటీ సభ్యులు పాల్గొని ఎస్ ఐ ఆర్ -2026 కార్యక్రమంలో అంకితభావంతో పనిచేసిన బి ఎల్ ఏ లు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ -2026 కార్యక్రమంలో కృషి చేసిన ప్రతి బి ఎల్ ఏ , సీనియర్ నాయకుడు, డివిజన్ అధ్యక్షుడికి శుభాభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో ఇదే నిబద్ధతతో పనిచేస్తూ కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలు, నాయకుల సమన్వయంతో ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ఎస్ ఐ ఆర్ -2026లో పార్టీ నాయకులు, బి ఎల్ ఏ లు, కార్యకర్తల సమన్వయంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని వివరించారు.


## పరీక్షా నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 9 (సింగిడి):** ఈ నెల 9 , 10 తేదీలలో నిర్వహించే జాతీయ అర్హత పరీక్షను సజావుగా నిర్వహించేందుకు బి ఎన్ ఎస్ ఎస్, 2023లోని సెక్షన్ 163 కింద ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని హిందూ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ నెల 9, 10 తేదీలలో నిర్వహించనున్న యూ జీ సి – ఎన్ ఈ టీ పరీక్షకు భద్రతా ఏర్పాట్లు మరియు ఇతర అవసరమైన ఏర్పాట్లను చేయడం జరిగిందని అన్నారు. పరీక్ష సజావుగా, ప్రశాంతంగా మరియు క్రమబద్ధంగా నిర్వహించేందుకు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించేందుకు, ప్రజలు పరీక్ష నిర్వహణలో ఉద్దేశపూర్వకంగా జోక్యం చేసుకోకుండా ఉండేందుకు బి ఎన్ ఎస్ ఎస్ 2023లోని సెక్షన్ 163 నిబంధనలను అమలు చేయడం జరిగిందని అన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారం.. ఇంధూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, పొన్నాల గ్రామం, సిద్దిపేట (అర్బన్) మండలం.

**పరీక్షా కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో:**

ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒకచోట గుమికూడడం నిషేధం విధించినట్లు తెలిపారు. కర్రలు, కత్తులు, ఆయుధాలు, లాఠీలు లేదా ఇతర హానికరమైన ఆయుధాలు/పరికరాలు తీసుకురావడం నిషేధం అన్నారు. పరీక్షా కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, సైబర్ కేఫ్‌లు మొదలైనవి పరీక్ష జరిగే తేదీల లో మూసివేయాలని తెలిపారు. అక్టోబరు 09 , 10 తేదీలలో ఉదయం 6:00 గంటల నుంచి సాయంత్రం 7:30 గంటల వరకు లేదా పరీక్ష పూర్తయ్యే వరకు అమల్లో ఉంటాయని ప్రజలు ప్రజలు ఈ ఆంక్షల ప్రకారం సహకరించాలని ఆ ప్రకటనలో తెలిపారు.




## టిపిడిఎమ్ఏ పిలుపుకు మద్దతుగా..

# భాగ్యరథి డిగ్రీ కళాశాల బంద్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 9 (సింగిడి):** తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు గత నాలుగు విద్యా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ (ఆర్టీఎఫ్ ) బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టిపిడిఎంఏ చేపట్టిన ఒకరోజు డిగ్రీ కళాశాలల బంద్‌కు మద్దతుగా చింతల్‌లోని భాగ్యరథి డిగ్రీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ రాజ్, డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్ బంద్ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వానికి తమ డిమాండ్లను తెలిపారు. డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ, గత నాలుగు విద్యా సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. కళాశాలల నిర్వహణ, అధ్యాపకులు, సిబ్బంది జీతాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం వంటి అంశాలపై ఈ ఆలస్యం తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. గత నాలుగు విద్యా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. అకడే రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేసేలా శాశ్వత పరిష్కారం చూపాలి" అని నల్ల జై శంకర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు ఆలస్యం కావడం వల్ల కళాశాలలు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని టిపిడిఎంఏ ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. "నాలుగు విద్యా సంవత్సరాల పెండింగ్ ఆర్ టి ఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి, కళాశాలలను కాపాడాలి, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి" అనే డిమాండ్లతో ప్రభుత్వానికి విన్నవించారు.

# ఎడిటోరియల్

Editorial

## వడ్డాది పాపయ్య: కుంచెలో విరిసిన తెలుగుదనం

వడ్డాది పాపయ్య (సెప్టెంబరు 10, 1921 -- డిసెంబర్ 30, 1992) తెలుగు చిత్రకళా ప్రపంచంలో ఒక అపూర్వ చిత్ర కారుడు. “వ. పా.” అనే పొడి అక్షరాల సంతకం చూసిన వెంటనే ఆ బొమ్మ ఎవరిదో చెప్పకుండానే అర్థమయ్యేది. తెలుగు పత్రికలు, పుస్తకాలు, బాలల కథలు, పురాణ చిత్రాలు, పల్లె దృశ్యాలు ఆయన కుంచె తాకిడితో జీవం పోసు కున్నాయి. కేవలం ఒక చిత్రకారుడిగా కాకుండా రచయితగా, దృశ్య కవిగా, సృజనాత్మక తపస్విగా ఆయన నిలిచారు.

శ్రీకాకుళం పట్టణంలో రామమూర్తి, మహాలక్ష్మి దంపతులకు జన్మించిన పాపయ్య తండ్రి చిత్రకళా ఉపాధ్యాయుడు కావడం వలన చిన్ననాటి నుంచే రంగుల లోకంలో మునిగి పోయాడు. ఐదేళ్ల వయసులోనే హనుమంతుని చిత్రాన్ని గీసి తన ప్రతిభను చాటుకున్నాడు. రాజా రవివర్మ, దామెర్ల రామారావు వంటి దిగ్గజాల ప్రభావం ఆయనపై బలంగా పడింది. కానీ ఆయన వారిని అనుకరించకుండా తనకంటూ ఒక ప్రత్యేక శైలిని రూపు దిద్దుకున్నారు. బొమ్మలపై మక్కువ వయసు పెరిగేకొద్దీ సాధనగా మారి, సాధన తపస్సుగా పరిణమించి, ఆ తపస్సే ఆయన చిత్ర జీవితమైంది. ఆయన శైలిలో సంప్రదాయం, ఆధునికత, జానపదం, పల్లెపాటల సౌందర్యం అంతర్లీనంగా కలిసి పోయేవి. మహిళా రూప చిత్రణలో ఆయనకున్న ప్రతిభ అసామాన్యం. స్త్రీ రూపం ఆయన చిత్రాల్లో దివ్యమైన సౌందర్యానికి ప్రతీకగా నిలిచింది. “వడ్డాది బ్యూటీ” అన్న పదం తెలుగు పాఠక లోకంలో ఒక ప్రత్యేక ముద్ర వేసింది. ఆయన గీసిన సీతారాములు, రాధాకృష్ణులు, శివపార్వతులు లాంటి దైవ రూపాలు పుస్తకాల్లో చూడగానే ఆ పాత్రలపై మరింత భక్తి, మమకారం కలుగుతాయి. అదే విధంగా ఆయన సృష్టించిన పల్లె ఆడపిల్లల రూపాలు, మత్స్యగంధి, ఊర్మిళ నిద్ర వంటి చిత్రాలు పల్లెటూరి అందాలను సజీవం చేస్తాయి.

వడ్డాది పాపయ్య చిత్రాలు తెలుగు పత్రికా ప్రపంచంలో ఒక విప్లవం. “చందమామ” పత్రికలో మూడు దశాబ్దాలకు పైగా ఆయన చిత్రాలు వెలువడ్డాయి. కథ చదివే ముందే పాఠకుని మనసును గెలుచు కునేది ఆయన వేసిన బొమ్మే. “భారతి”, “చంద్రిక”, “ఆంధ్రపత్రిక”, “ఆంధ్రజ్యోతి”, “స్వాతి”, “అభిసారిక”, “యువ” వంటి పత్రికల్లో ఆయన బొమ్మలు ప్రత్యేక ఆకర్షణ. ఆయన చిత్రాలు కోసం పత్రికలు అమ్ముడయ్యేవి అనడం అతిశయోక్తి కాదు.

గుడిపాటి వెంకట చలం, మల్లాది వెంకట కృష్ణమూర్తి, యద్దనపూడి సులోచనా రాణి నవలలకు ఆయన వేసిన కవర్ ఆర్ట్ ఆ పుస్తకాల ప్రాచుర్యాన్ని రెట్టింపు చేసింది. ఒక చిన్న చిత్రం కూడా సాహిత్యానికి ఎంత జీవం పోసుకోగలదో ఆయన చూపించారు. ఆయన చిత్రాల్లో రంగుల వినియోగం అపూర్వం. నీలి రంగుపై ఆయనకున్న మక్కువ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. తైల వర్ణాల కంటే నీటి రంగుల్లోనే తాను కోరుకున్న సున్నితత్వం సాధ్యమవుతుందని భావించేవారు. నలుపు-తెలుపు చిత్రాల్లోనూ ఆయన ప్రతిభ తక్కువేమీ కాదు. వెలుగు-నీడల సమన్వయం ఆయన చిత్రాలకు అద్భుతమైన ఆహ్లాదాన్ని, కవితాత్మకతను తెచ్చింది. జీవంతో కూడిన రేఖలు, మృదువైన స్పర్శ, అలంకరణలోని నైపుణ్యం ఆయన చిత్రాలకు ప్రత్యేకతను ఇచ్చాయి. చిత్రకళ మాత్రమే కాకుండా రచనలోనూ ఆయన ప్రతిభను ప్రదర్శించారు. “చందమామ”లో కొడవటిగంటి కుటుంబరావు మొదలు పెట్టిన “దేవీ భాగవతం” కథలను పూర్తి చేయడంతో పాటు “విష్ణుకథ” అనే పౌరాణిక సీరియల్‌ను రచించారు. చిన్నపిల్లల ఊహా ప్రపంచాన్ని విస్తరించేలా ఆయన చిత్రాలు, రచనలు ఒకేసారి ఆకర్షించేవి. పంచతంత్రం కథల్లోని జంతు పాత్రలకు ఆయన గీసిన చిత్రాలు ఇప్పటికీ పాఠకుల మదిలో నిలిచిపోయాయి.

**1992 డిసెంబర్ 30న ఆయన మరణం** సంభవించినా ఆయన కుంచె సృష్టించిన రూపాలు, ఆయన వేసిన పుస్తక కవర్‌లు, ఆయన అలంకరించిన పత్రికా పుటలు నేటికీ జీవంగా ఉంటూ తెలుగు సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి. వడ్డాది పాపయ్య తెలుగు చిత్రకళకు కేవలం ఒక పేరు కాదు, ఒక యుగం. ఆయన కుంచెలో సౌందర్యం విరిసింది, ఆయన బొమ్మల్లో తెలుగుదనం మిగిలింది, ఆయన కృషిలో ఒక సంస్కృతికి చిరస్మృతి సొంతమైంది.

తెలుగు చిత్రకళకు వడ్డాది పాపయ్య ఒక దీపస్తంభం. ఆయన కళలో శిల్ప సౌందర్యం, సాహిత్యానికి జీవం, పాఠకుల హృదయాల్లో అజరామరమైన స్థానం ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## షార్ట్‌ఫిలిం హబ్‌గా జగిత్యాల.. యూట్యూబర్ల ఐక్య అడుగులు



సినిమా తీయాలంటే హైదరాబాద్ వెళ్లాల్సిందేనన్న భావనకు జగిత్యాల యువత కొత్త నిర్వచనం చెబుతోంది. స్మార్ట్‌ఫోన్ కెమెరా నుంచి చిన్న డిజిటల్ కెమెరాలు, అత్యాధునిక పరికరాలు, ప్రొఫెషనల్ ఫిల్మ్ షూటింగ్ కెమెరాల వరకు అందిపుచ్చుకుని లఘుచిత్రాలు రూపొందిస్తున్నారు. స్థానిక కథలు, జీవన విధానం, చరిత్ర, ప్రకృతి, గ్రామీణ నేపథ్యాలను తెరపై ఆవిష్కరిస్తూ యూట్యూబ్, డిజిటల్ వేదికల్లో ప్రతిభ చాటుతున్నారు. ఇప్పటివరకు వ్యక్తిగతంగా సాగిన ఈ ప్రయాణానికి ఇప్పుడు ఐక్యత బలం తోడైంది. జగిత్యాలలోని ఏఆర్ ఫంక్షన్ హాల్‌లో సీనియర్ యూట్యూబ్ దర్శకుడు గడ్డం రాజారాం మోహన్‌రెడ్డి, కళాశ్రీ గుండేటి రాజు ల ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి సుమారు 50 మంది షార్ట్‌ఫిలిం దర్శకులు, నటులు, రచయితలు, ఛాయాగ్రాహకులు, కూర్పుదారులు హాజరయ్యారు. 'జగిత్యాల షార్ట్‌ఫిలిం ఇండస్ట్రీ' పేరుతో ఐక్య వేదిక ఏర్పాటు చేయడం కొత్త అధ్యాయానికి నాంది.

జిల్లాలో ప్రతిభకు కొదవలేదు. కొరత ఉన్నది సాంకేతిక వసతులు, శిక్షణ, పరికరాల అందుబాటులోనే. కెమెరాలు, లైటింగ్, ధ్వని, ఎడిటింగ్, డబ్బింగ్ సదుపాయాలు జిల్లాలోనే ఉంటే చిన్న బడ్జెట్‌తోనూ నాణ్యమైన చిత్రాలు తీయవచ్చు. పరికరాల బ్యాంక్, అద్దె కేంద్రాలు, శిక్షణా శిబిరాలు, ఎడిటింగ్--డబ్బింగ్ కేంద్రాలు, నటీనటులు--సాంకేతిక నిపుణుల సమాచార భాండాగారం ఏర్పాటు చేస్తే రంగానికి సంస్థాగత బలం వస్తుంది. కొత్తవారికి కథ, దర్శకత్వం, నటన, కెమెరా, లైటింగ్, ధ్వని, కూర్పులో శిక్షణ అందితే మరింత ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

సారంగాపూర్ అటవీ ప్రాంతం, కోటిలింగాల, జగిత్యాల కోట, ధర్మపురి, కొండగట్టు, పోలాస వంటి లొకేషన్లు ఈ ప్రయత్నానికి మరో బలం. అయితే అటవీ, చారిత్రక, దేవాలయ లేదా ఇతర నియంత్రిత ప్రాంతాల్లో చిత్రీకరణకు సంబంధిత అనుమతులు తప్పనిసరి. పర్యావరణ నిబంధనలు, ప్రజల గోప్యత, కాపీరైట్, పరువునష్టం, పిల్లల చిత్రీకరణ, సంగీతం--పాటల వినియోగం వంటి అంశాల్లో అప్రమత్తత అవసరం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) భావవ్యక్తీకరణ స్వేచ్ఛను హామీ ఇస్తుంది. అయితే 19(2)లోని సముచిత పరిమితులు, సినిమాటోగ్రాఫ్ చట్టం, ఇతర వర్తించే చట్టాలు పాటించాలి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇప్పటికే షార్ట్‌ఫిలిం ఉత్పత్తి, ఉత్సవాలు, ప్రివ్యూ థియేటర్, మౌలిక వసతుల నమోదు, ఆన్‌లైన్ షూటింగ్ అనుమతుల వంటి వ్యవస్థలను కలిగి ఉన్నాయి. ప్రతి చిత్రానికీ ఆటోమేటిక్ నగదు సబ్సిడీ ఉందని చెప్పడం సరికాదు. కానీ ఈ అవకాశాలను జగిత్యాల కళాకారులకు చేరువ చేయడంతో పాటు ప్రత్యేక షార్ట్‌ఫిలిం హబ్ కోసం ప్రభుత్వం విధానపరమైన ప్రోత్సాహం ఇవ్వాలి. జగిత్యాల ఫిలిం సొసైటీ స్థానిక కళాకారులకు వారధిగా నిలిచి శిక్షణ, మార్గదర్శకత్వం, చిత్రోత్సవాలు, రాష్ట్రస్థాయి అవకాశాలకు అనుసంధానం చేయాలి.

ఇందుకోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక సమన్వయ వ్యవస్థ ఏర్పాటు చేయడం అవసరం. షూటింగ్ అనుమతులు, లొకేషన్ల వివరాలు, పరికరాల లభ్యత, శిక్షణా కార్యక్రమాలు, కళాకారుల వివరాలను ఒకే వేదికపై అందిస్తే కొత్తవారికి మార్గం సులభమవుతుంది. విద్యాసంస్థలు, యువజన సంఘాలు, సాంస్కృతిక సంస్థలను అనుసంధానించి కథారచన నుంచి పోస్టు ప్రొడక్షన్ వరకు వర్క్‌షాపులు నిర్వహించాలి. ఉత్తమ లఘుచిత్రాలకు జిల్లా స్థాయిలో పురస్కారాలు అందించి, ఎంపికైన చిత్రాలను రాష్ట్ర, జాతీయ చిత్రోత్సవాలకు పంపే విధానం రూపొందించాలి. స్థానిక ప్రతిభను వెలికితీసి, నిర్మాణ ఖర్చులు తగ్గించి, కొత్త కథలకు అవకాశాలు కల్పించడమే ఈ ఐక్యత అసలు లక్ష్యం కావాలి. అప్పుడే జగిత్యాల పేరు తెరపై కొత్త వెలుగుగా నిలుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా సగర్వంగా మార్మోగాలి. 'జగిత్యాల షార్ట్‌ఫిలిం ఇండస్ట్రీ' ఒక సమావేశంతో ఆగకుండా కార్యాచరణగా మారాలి. ప్రభుత్వం చేయూత, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సాంకేతిక సహకారం, ఫిలిం సొసైటీ చొరవ, కళాకారుల ఐక్యత కలిస్తే జిల్లాలో కొత్త సృజనాత్మక వాతావరణం ఏర్పడుతుంది. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంది.. కథలు ఉన్నాయి.. లొకేషన్లు ఉన్నాయి. ఇప్పుడు అవసరమైంది సరైన వేదిక. ప్రతిభకు ప్రోత్సాహం, సృజనకు స్వేచ్ఛ, స్వేచ్ఛకు చట్టబద్ధమైన బాధ్యత కలిస్తే జగిత్యాల తెలంగాణ షార్ట్‌ఫిలిం హబ్‌గా ఎదగడం దూరం కాదు.



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9133947176

## తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ"


తెలుగువారికి తొలి జ్ఞానపీఠాన్ని అందించిన బహుముఖ ప్రజ్ఞులు కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ. విశ్వనాథ వారి ఏ రచన అయినా సరే భారతీయ ఆత్మను, జీవుని వేదనను ప్రతిబింబించేదే. ప్రతీ అక్షరంలోను అసాధారణ ఊహాశక్తిని, అద్భుత రచనాశైలిని నింపి పాఠకుల హృదయాలలోకి పరుగులెత్తించ గలిగిన శక్తి ఆయన సొంతం. తెలుగు



సాహిత్య ప్రక్రియల్లో విశ్వనాథ వారు స్పృశించని ప్రక్రియ లేదు. తన రచనల ద్వారా కులాతీత, మతాతీత విధానాలను ఎండగట్టారు. ఆధునిక తెలుగు రచయితల్లో ఆయన పేరు లేకుండా తెలుగు సాహిత్య చరిత్ర గురించి వివరించడం అసాధ్యం. విశ్వనాథ 1895, సెప్టెంబరు 10న కృష్ణా జిల్లా నందమూరు గ్రామంలో జన్మించాడు. తండ్రి శోభనాద్రి, తల్లి పార్వతమ్మ. ఈయన భార్య వరలక్ష్మమ్మ. విద్యాభ్యాసము నందమూరు, ఇందుపల్లి, మరియు పెదపాడు గ్రామాల్లోను, పై చదువులు బందరు పట్టణంలోను సాగాయి. బందరు హైస్కూలులో తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి తెలుగు ఉపాధ్యాయునిగా లభించడం ఆయన అదృష్టం. బి.ఎ. తరువాత విశ్వనాథ బందరు హైస్కూలులోనే ఉపాధ్యాయునిగా చేరాడు.

ఉద్యోగం చేస్తూనే మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఎ. పట్టా సాధించాడు. తరువాతి కాలంలో ఈయన వివిధ కళాశాలల్లో అధ్యాపక పదవులు నిర్వహించాడు. బందరు నేషనల్ కాలేజి (1928), గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలేజి (ఏసీ కాలేజీ) (1938 వరకు), విజయవాడ లో ఎస్.ఆర్.ఆర్.ఽ? సి.వి.ఆర్. కాలేజి (1938-1959), కరీంనగర్ ప్రభుత్వ ఆర్ట్స్ ఽ సైన్స్ కాలేజి (1959) మొదలైన కళాశాలల్లో ఆయన పని చేసాడు. 1957 లో విశ్వనాథ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షుడుగానూ, 1958లో విధానమండలికి నామినేటెడ్ సభ్యుడుగానూ పని చేశాడు. మహాత్మా గాంధీ నడుపుతున్న సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనడం కోసం ఉద్యోగాన్ని వదులు కున్నాడు. 1916 లో “విశ్వేశ్వర శతకము” తో విశ్వనాథ రచనా ప్రస్థానము ప్రారంభ మైనది. అప్పటి జాతీయోద్యమ ప్రభావంతో ఆ సమయంలోనే “ఆంధ్ర పౌరుషము” రచించాడు. 1920 నాటికే తెలుగులో ప్రసిద్ధ కవిగా గుర్తింపు తెచ్చు కొన్నాడు. 1961 లో కరీంనగర్ ప్రభుత్వ కళాశాలలో ప్రాచార్యునిగా పదవీ విరమణ చేసిన తరువాత పూర్తి స్థాయిలో తన సమయాన్ని సాహితీ వ్యాసాంగానికే కేటాయించాడు. తరువాత విశ్వనాథ రచనా పరంపర పుంఖానుపుంఖాలుగా కొనసాగింది. 25 పైచిలుకు కావ్యాలు, 6 శతకాలు, 13 గేయ కావ్యాలు, 15 నాటకాలు, 88 నవలలు, 10 సంస్కృత నాటకాలు, 10 విమర్శన గ్రంథాలు, మరెన్నో వ్యాసాలు, ఉపన్యాసాలు... తెలుగుభాషకు విశ్వనాథ ఎనలేని సేవలు అందించాడు. ఆయన రచనలను కొన్ని ఇతర భాషలలోకి అనువదించారు. రేడియో కోసం నాటకాలు, ప్రసంగాలు రూపొందించాడు.విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సినవి... ఆంధ్ర పౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కఱలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి ఆయన మొదటి రచనల లోనివి. విశ్వనాథ రచనలలో ఆయన పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన, వ్యక్తిత్వం అద్భుతంగా కనిపిస్తుంటాయి. తన రచనలలో శ్రీమద్రామాయణ కల్పవృక్షం (జ్ఞానపీఠ అవార్డు లభించినది) తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిందని అంటుండే వాడు. ఎందరో కవులు వ్రాసినా మళ్ళీ ఎందుకు వ్రాయాలంటే రోజూ తింటున్నామని అన్నం తినడం మానివేయడం లేదుగదా అన్నాడు.

వేయిపడగలు నవలను మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు “సహస్రఫణ్” పేరుతో హిందీ లోకి



అనువదించాడు. భారతీయ సంస్కృతి, ఆచారం, విశేషాలు, మధ్య తరగతి జీవన విధానాలు ఈ నవలలో విశేషంగా చూప బడ్డాయి. తమిళనాడులోని మదురై ప్రాంతం నేపథ్యంలో వచ్చిన నవల “ఏకవీర”ను పుట్టపర్తి నారాయణాచార్యులు మళయాళంలోనికి, అంబటిపూటి హనుమయ్య తమిళంలోనికి అనువదించారు. ఏకవీర సినిమా కూడా వచ్చింది.

***ఆ సినిమాకు సి.నారాయణరెడ్డి మాటలు, పాటలు సమకూర్చాడు. విశ్వనాథ వ్యక్తిత్వం ప్రాచీన విధానాలకు, ఆచారాలకు కట్టుబడ్డది. భారతీయత మీద, తెలుగుదనం మీద అభిమానం కలిగింది. తన అభిప్రాయాలను, ఇష్టాయిష్టాలను నిక్కచ్చిగా తెలిపేవాడు. ఈ కారణంగా విశ్వనాథను వ్యతిరేకించిన వారు చాలామంది ఉన్నారు. ఛాందసుడు అనీ, “గతకాలమె మేలు వచ్చుకాలము కంటెన్” అనేవాడు అనీ (శ్రీశ్రీ విమర్శ) విమర్శించాడు.***

విశ్వనాథకు పాశ్చాత్య సాహిత్యం అంటే పడదని అనుకొంటారు. కాని ఆయన పాశ్చాత్య సాహిత్యం పట్ల గౌరవం కలిగి ఉండేవాడు. షేక్స్‌పియర్, మిల్టన్, షెల్లీ వంటి కవుల రచనలను ఆసాంతం పరిశీలించాడు. 1964లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ “కళాప్రపూర్ణ” తో సన్మానించింది.

1942లో గుడివాడ లో “గజారోహణం” సన్మానం జరిగింది. 1956 లో షష్టి పూర్తి వేడుకలు కూడా గుడివాడలో ఘనంగా జరిగాయి. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం డి.లిట్ పట్టాతో సన్మానించింది. 1962 లో “విశ్వనాథ మధ్యాక్కఱలు” రచనకు కేంద్రసాహిత్య అకాడెమీ వారి బహుమతి లభించింది. 1970 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం “ఆస్థాన కవి”గా గౌరవించింది. 1970 లో భారత ప్రభుత్వము “పద్మభూషణ పురస్కారం”తో గౌరవించింది. జ్ఞానపీఠ అవార్డు పొందిన తొలి రచయిత. కొన్ని రచనలను రేడియో నాటికలుగా మలిచారు. ఆయన రచనలను ఇతర భాషల్లో కూడా అనువదించారు. విశ్వనాథ చేపట్టని ప్రక్రియ కాని, ప్రయోగం కానీ లేదు. నవల, కథ , నాటిక, పాట, ఏదైనా తగిన పరిష్కారాన్ని అందించే విధంగా ఉండటం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన పద్య రచన అపూర్వం. సంస్కృత నాటకాల్లో గుప్త పాశుపతం, అమృత శర్మిష తెలుగు నాటకాల్లో కనకరాజు, అనార్కలి ప్రసిద్ధమైనవి. ఆయన కొన్ని పత్రికలకు సంపాదకులుగా కూడా పని చేశాడు. కొంతకాలం ఆయన ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమికి ఉపాధ్యక్షుడుగా ఉన్నాడు.

విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా ఆంధ్రపౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కఱలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి ఆయన మొదటి రచనల లోనివి. విశ్వనాథ రచనలలో అతని పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన అద్భుతంగా కనిపిస్తుంటాయి. ఆయన చేసిన “రామాయణ కల్పవృక్షము” అనే పుస్తక రచనకు గాను జ్ఞాన పీఠ అవార్డు అందు కున్నారు. కోల్‌కతా, ముంబయి ఢిల్లీ, మద్రాసు, బెంగుళూరు వంటి పట్టణాల్లో ఆయన పొందిన సత్కారాలు అపూర్వమైనవి. 1964లోఆంధ్ర విశ్వ కలా పరిషత్ విశ్వనాథను “కళా ప్రపూర్ణ” బిరుదుతో సత్కరించారు. భారత ప్రభుత్వం “పద్మభూషణ్” బిరుదుతో గౌరవించింది. ఇతర ప్రభావాలు, ప్రలోభాలు లేని విశ్వనాథ స్వాతంత్ర్య రచనా శైలిని స్పృశిస్తూ గురువు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి తన శిష్యుని గురించి ఇలా అన్నాడు...”నా మార్గమ్మును కాదు, వీని దరయన్ నా తాత ముత్తాతలందే మార్గమ్మును కాదు; మార్గమది యింకేదో యనంగా వలెన్ సామాన్యుండన రాదు వీని కవితా సమ్రాట్ వవుత మా హేతువై,యీ మచ్ఛిష్యుని దా వరించినది, నేనెంతే ముదంబందెదన్”.

కవిగా పండితునిగా, నవలా రచయితగా, నాటక కర్తగా, విమర్శకుడుగా, గాయకుడిగా రాణించిన విశ్వనాథ 1976 అక్టోబరు 18న తనువు చాలించారు. ఆ అద్భుత ప్రతిభాశాలి నడిచిన సాహితీసేవా మార్గంలో నేటి యువత చిత్తశుద్ధితో అడుగులు వేయాలని ఆశిద్దాం. సూర్యుని కాంతి, చంద్రుని వెన్నెల, కృష్ణమ్మ పరవళ్ళు, గోదారి చల్లదనం ఉన్నంతవరకు తెలుగు సాహిత్య అభిమానుల గుండెల్లో విశ్వనాథ మరియు ఆయన రచనలు చిరస్మరణీయం.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

ప్రభాతనవ సింగిడి
SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi గురువారం 10-9-2026

# దళిత ద్రోహి.. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

- దళితుల అకౌంట్లోనే దళితబంధు నిధులు
- దళితబంధు ఆత్మగౌరవ సభలో యువనేత ప్రణవ్



**జమ్మికుంట,సెప్టెంబర్ 9 (సింగిడి):** దళిత బంధు నిధుల విషయంలో దళితులను మోసం చేసి వారికి నిధులు రాకుండా అడ్డుకున్న దళిత ద్రోహి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు ధ్వజమెత్తారు. జమ్మికుంట పట్టణంలో దళిత బంధు ఆత్మ గౌరవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడే ప్రతి మాట అబద్ధమని సోషల్ మీడియా వేదికగా కొత్త డ్రామాకు తెరతీస్తూ లబ్ధిదారుల అకౌంట్లో ఉన్న డబ్బులు 50 కోట్ల రూపాయలు వెనుకకు తీసుకున్నారని చెప్పడంలో నిజం లేదని మండిపడ్డారు. అసత్యపు మాటలతో దళితులను మోసం చేస్తూ నిధులు వెనుకకు వెళ్లాలని నిరూపించాలని లేకపోతే ముక్కు నేలకు రాసి దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత సామాజిక వర్గాన్ని ఎన్నికల సమయంలో వాడుకోవడమే తప్ప వారి సంక్షేమం కోసం ఆలోచించిన వాడైతే ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. మొదటినుండి దళిత సమాజానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యతిరేకమని దళితులు ఆయన మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని నిధులు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ మండలాధ్యక్షుడు పరశురామారావు కాంగ్రెస్ నాయకులు సాయిని రవి పర్లపల్లి నాగరాజు రాచపల్లి సాగర్ మొలుగూరి సదయ్య గూడెపు సారంగపాణి దొడ్డే సదానందం కౌన్సిలర్లు చందా రాజు పాతకాల అనిల్ యాట్ల అశోక్ పొనగంటి విష్ణు దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్‌లో పాలకవర్గ సాధారణ సమావేశం



- అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపిన పాలకవర్గం

**జమ్మికుంట, సెప్టెంబర్ 9 (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ఆధ్వర్యంలో బుధవారం పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సమావేశం చైర్పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా సమావేశానికి జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభానికి ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం సమావేశంలో ఆదాయ వ్యయం గురించి చర్చించడంతోపాటు ఈ సంవత్సరం సీజన్లో పత్తి ధాన్యం మక్కలకు సంబంధించిన కొనుగోలు కేంద్రాల గురించి చర్చించడం తోపాటు మద్దతు ధరల గురించి మాట్లాడారు. ట్రాక్టర్ ట్రాలీ హమాలీ లైసెన్స్ ల గురించి చర్చించి ఆమోదించడం జరిగింది. అదేవిధంగా చేయవలసిన నిర్వహణ పనులను గురించి కమిటీ పాలకవర్గం సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో మార్కెట్ కార్యదర్శి మల్లేశం, ద్వితీయ శ్రేణి కార్యదర్శి రాజా వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ తో పాటు పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వోకేషనల్ కాలేజీలో షీ టీమ్ అవగాహన సదస్సు...!

### సోషల్ మీడియాలోఅమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలి

### షీ టీమ్ మెంబర్ స్వప్న



**జమ్మికుంట, సెప్టెంబర్ 9 (సింగిడి):** కరీంనగర్ సిపి ఆదేశాల మేరకు షీ టీమ్ మెంబర్ స్వప్న బుధవారం జమ్మికుంట ఒకేషనల్ కాలేజీ నందు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో మాట్లాడుతూ కాలేజ్ అమ్మాయిలు సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల తోటి జాగ్రత్తగా ఉండాలని ఎవరిని కూడా నమ్మి ఫోటోలు పంపకూడదని, ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే షీ టీమ్ సెల్ నెంబర్ కు 8712670759 ఫిర్యాదు చేయాలని ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అన్నబోయిన రాజేందర్,అధ్యాపకులు సమ్మయ్య, అనిల్, రాజ్ కుమార్, శ్రీవాణి, మౌనిక, సతీష్, కిషన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాచనపల్లి వాసుకి దక్కిన అరుదైన గౌరవం

### గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా పొందిన లింగారెడ్డి




**జమ్మికుంట, సెప్టెంబర్ 9 (సింగిడి)** :జమ్మికుంట మండలం మాచనపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ కాటిపల్లి లింగారెడ్డి, ఉస్మానియా విశ్వ విద్యాలయం కామర్స్ విభాగం లో కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార సంస్థలలో ఆర్థిక సాంకేతిక సేవలు అనే అంశం పై ఆచార్య కనుకుంట్ల శంకరయ్య ఆధ్వర్యంలో చేసిన పరిశోధనకు గాను విశ్వ విద్యాలయం ప్రకటించిన డాక్టరేట్ పట్టా ను హైదరాబాదులో జరిగిన85 వ స్నాతకోత్సవం లో విద్యాలయం ఛాన్సలర్ రాష్ట్ర గవర్నర్ శివప్రసాద్ శుక్ల చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ కార్య క్రమంలో, భారత్ బయోటెక్ డైరెక్టర్ప్ శాస్త్ర వేత్త డాక్టర్ కృష్ణా ఎల్లా, ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి , ప్రొఫెసర్ పాట్రిక్ అంటోని, ప్రొఫెసర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

### పర్యావరణహిత గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, సెప్టెంబర్9(సింగిడి):** ప్రజలు మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రామగుండం ప్రాంతీయ కార్యాలయం రూపొందించిన 'మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' పోస్టర్‌ను బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించి, గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా నిర్వహించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హుజూరాబాద్ ఆర్డీఓ జలకుమారికి మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ బిక్షపతితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పాతబజార్‌లో గోల్డెన్ యూత్ వినాయకుడి జన జాతర

### 29వ ఏడాదిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు..

### ఈసారి మహాదేవ అవతారంలో భారీ గణనాథుడు



**కరీంనగర్, సెప్టెంబర్9(సింగిడి):** వినాయక చవితి వచ్చిందంటే కరీంనగర్ పాతబజార్ భక్తజన సందోహంతో కళకళలాడుతుంది. గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో గత 29 ఏళ్లుగా నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు కరీంనగర్‌లోనే కాకుండా తెలంగాణవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయి. ప్రతి ఏడాది వినూత్న రూపంలో భారీ గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తూ భక్తులను ఆకట్టుకుంటున్న నిర్వాహకులు.. ఈసారి మహాదేవ అవతారంలో గణనాథుడిని కొలువుదీర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఏటా వినూత్న అవతారం...**

గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా 2024లో నవరస గణనాథులను, 2025లో సప్త చిరంజీవుల రూపాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మహాదేవ అవతారంలో భారీ గణపతి విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన నమూనా ఆధారంగా కళాకారులు సుమారు 60 రోజుల పాటు శ్రమించి విగ్రహానికి తుది రూపం తీసుకొచ్చారు. విగ్రహ నిర్మాణానికి సుమారు రూ. 5.5 లక్షల నుంచి రూ. 6.5 లక్షల వరకు ఖర్చు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

**తెలంగాణ నలుమూలల నుంచి భక్తుల రాక,**

వినూత్న రూపాల్లో ఏర్పాటు చేసే భారీ గణపతి విగ్రహాలను దర్శించేందుకు కరీంనగర్‌తో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ప్రత్యేక అలంకరణలు, విద్యుత్ దీపాలంకరణలు, ఆకర్షణీయమైన మండపంతో పాతబజార్ ప్రాంతం నవరాత్రుల్లో భక్తులతో కిటకిటలాడుతుంది. ఈసారి మహాదేవ అవతారంలోని గణనాథుడు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాడు.

**రూ. 22 లక్షల వరకు ఉత్సవాల వ్యయం..**

విగ్రహం, అలంకరణలు, ఇతర ఏర్పాట్లతో కలిపి ఈ ఏడాది ఉత్సవాలకు సుమారు రూ. 22 లక్షల వరకు ఖర్చవుతున్నట్లు గోల్డెన్ యూత్ నిర్వాహకుడు కోదూరి అంబరీష్ గౌడ్ తెలిపారు. నవరాత్రుల తొమ్మిది రోజుల పాటు భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణ, ప్రసాద వితరణ, భక్తుల సౌకర్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఎంత ఘనంగా నిర్వహిస్తామో, నిమజ్జన కార్యక్రమాన్ని కూడా అదే స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అంబరీష్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజలు, భక్తుల సహకారంతో ఈసారి ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించి కరీంనగర్‌తో పాటు తెలంగాణవ్యాప్తంగా గుర్తుండిపోయేలా చేయడమే తమ లక్ష్యమని ఆయన తెలిపారు.

## మహిళ సంఘ భవనాన్ని ప్రారంభించిన సర్పంచ్ శ్రీకాంత్



**జమ్మికుంట, సెప్టెంబర్ 9 (సింగిడి):** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామంలో కేంద్రం నిధులతో ఏర్పాటు చేసిన మహిళా సంఘ భవనాన్ని గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీకాంత్ బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ, కేంద్రం నుండి వచ్చిన పది లక్షల రూపాయల నిధులతో మహిళల సంక్షేమం కోసం మహిళా సంఘ భవనాన్ని నిర్మించడం జరిగిందని ఈ భవనం నిర్మించడం ద్వారా మహిళలకు వారు నిర్వహించుకునే సమావేశలకు పూర్తి సౌలభ్యంగా ఉంటుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి సంక్షేమానికి కేంద్ర నిధులు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని ఈ భవన నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు శ్రీధర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ విష్ణు ఉపసర్పంచ్ దివ్య భాస్కర్ తోపాటు వార్డు సభ్యులు వెంకటేష్ రమేష్ శంకర్ సిఏ గరిగంటి స్వాతి మహిళా సంఘాల అధ్యక్షులు మాజీ సర్పంచులు తిప్పారపు బాబురావు రాచపల్లి సంపత్ రైతు సంఘం అధ్యక్షులు పోతరవేన సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందకుంట మండల ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ఓదేలు



**జమ్మికుంట, సెప్టెంబర్ 9 (సింగిడి):** ఇల్లంతకుంట మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మల్యాల గ్రామానికి చెందిన గూడెపు ఓదెలు ను రాష్ట్ర చైర్మన్ మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియమించారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఈ విషయంపై ఓదెలు మాట్లాడుతూ టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు గూడెపు ఓదేలు కు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ నియామక పత్రం అందించడం జరిగిందని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ అవకాశాన్ని కల్పించిన టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణకి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిత్యం కృషి చేస్తానని గూడెపు ఓదెలు తెలిపారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

### జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

### ప్రభుత్వ పాఠశాలలో క్రీడా పోటీలను ప్రారంభించిన చైర్మన్



**జమ్మికుంట, సెప్టెంబర్ 9 (సింగిడి):** జమ్మికుంట ప్రభుత్వ బాలుర పాఠశాలలో క్రీడా పోటీలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ జమ్మికుంట పట్టణ పరిధిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను మండల విద్యాధికారి హేమలత పట్టణ ఎస్సై రమేష్ తో కలిసి ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని క్రీడలతో మానసిక శారీరక ప్రశాంతత లభిస్తుందని చాలామంది పిల్లలు ఈ రోజుల్లో మైదానంలో ఆడకుండా కేవలం మొబైల్ ఫోన్తో ఎక్కువసేపు గడుపుతున్నారని అది మంచి అలవాటు కాదని కచ్చితంగా క్రీడా మైదానంలో ఆటలు ఆడుకోవాలని సూచించారు. క్రీడలలో పాల్గొనబోతున్న విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ విద్యార్థిని విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో పాల్గొని గెలుపొందిన తర్వాత వచ్చే సర్టిఫికెట్ తో భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు లభిస్తాయని మెరుగైన విద్యా కు అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు సంపాదించి వివిధ శాఖల్లో స్థిరపడ్డారని భవిష్యత్తులో మీరు కూడా ఆటల పోటీల్లో గెలిచి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హేమలత అతను ఎస్సై రమేశ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్ బాబు ఉపాధ్యాయులు. ప్రేమలత,శ్రీలత, రేణుకా,ప్రవీణ్,శ్రీను,భగత్,తదితరులు పాల్గొన్నారు.

## పంట మార్పిడిపై రైతులకు క్షేత్ర ప్రదర్శన

- ఆరుతడి పంటల సాగు వైపు రైతులు దృష్టి సారించాలి
- మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్




**జమ్మికుంట, సెప్టెంబర్ 9 (సింగిడి):** అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ సంస్థ కరీంనగర్ వారి సౌజన్యంతో జమ్మికుంట మండలంలోని మడిపల్లి, తనుగుల, వావిలాల గ్రామాలలో క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ తెలిపారు. మడిపల్లి గ్రామంలో పంట మార్పిడి పై క్షేత్ర ప్రదర్శన నిర్వహించి ప్రస్తుత ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల్లో పంటల మార్పిడి, ఆరుతడి పంటల సాగు చేయాలని సూచించారు. వావిలాల గ్రామంలో వరి పంటలో జీవ ఎరువుల వాడకం పై క్షేత్ర ప్రదర్శన నిర్వహించి భూమిలో అందుబాటులో లేని రూపంలో ఉన్న భాస్వరం, పొటాష్ ఎరువులను మొక్కలకు అందే విధంగా చేస్తాయని తెలిపారు. తనుగుల గ్రామంలో వరి పంటలో నానో ఎరువుల వాడకం పై క్షేత్ర ప్రదర్శన నిర్వహించి రసాయన ఎరువుల వాడకాన్ని పంట అవసరం మేరకే వాడుకుంటూ నానో ఎరువులను స్ప్రే రూపంలో ఉపయోగించుకోవడం వలన నేల ఆరోగ్యం, పంట ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. పంటల సాగు లో ఎదురయ్యే సమస్యలపై సలహాలు కొరకు స్థానిక కెవికె శాస్త్రవేత్తలను కానీ, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు

**జమ్మికుంట, సెప్టెంబర్ 9 (సింగిడి):** జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ .బీ రమేష్ అధ్యక్షతన ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. అధ్యాపకఅధ్యాపకేతర సిబ్బంది కలసి కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాళోజీ మహోన్నత వ్యక్తిత్వం కలవాడని, తెలంగాణ భాష, యాస, సంస్కృతి కోసం నిరంతరం పాటు పడ్డారని అన్నారు. తెలంగాణ వాడుక భాష పదాల ప్రత్యేకత గురించి వివరించారు. కాళోజీ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని దేశ అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ మురాడి శ్యామల మాట్లాడుతూ తెలంగాణ భాషా, సాహిత్యం ప్రాముఖ్యతను గురించి వివరించారు. కాళోజీ కవితలను ఉదహరిస్తూ కాళోజీ వ్యక్తిత్వాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఓదెలు కుమార్, అకడమిక్ కో-ఆర్డినేటర్ డా, కే. రాజేంద్రం ,స్టాఫ్ క్లబ్ సెక్రెటరి డా, కే. గణేష్ , ఉమా కిరణ్ , డాక్టర్ కే. మాధవి , డాక్టర్ రాజ కుమార్ , కిరణ్ కుమార్ , డాక్టర్ పీ. స్వప్న , డాక్టర్ ఎంబాడి రవి, పీ. శ్రీనివాస్ రెడ్డి , ఎల్ . రవీందర్ , డాక్టర్ ఎన్ శ్రీనివాస్ , డాక్టర్ సుష్మ, డా. రవిప్రకాష్ అరుణ్ కుమార్ రమేష్ , విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభాతవం
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం
10-9-2026

# ఆధునిక సాంకేతికతతో మెరుగైన మౌలిక వసతులు

- ముంబైలో అంతర్జాతీయ పర్యావరణ సాంకేతిక ప్రదర్శనను పరిశీలించిన, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

**కరీంనగర్, సెప్టెంబర్9(సింగిడి):** నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ముంబైలో జరుగుతున్న అంతర్జాతీయ పర్యావరణ సాంకేతిక ప్రదర్శనలో పాల్గొన్నారు. బొంబాయి ప్రదర్శన కేంద్రంలో సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు నిర్వహిస్తున్న 13వ 'ఐఎఫ్ఏటీ ఇండియా--2026' ప్రదర్శనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి నిర్వహణ, వ్యర్థాల పునర్వినియోగం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కమిషనర్ పరిశీలించారు. కరీంనగర్‌ను మరింత పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలపై వివిధ దేశాల నిపుణులతో చర్చించారు. తాగునీటి సరఫరా వ్యవస్థ ఆధునికీకరణ, మురుగునీటి శుద్ధి, జల వనరుల పునరుద్ధరణకు సంబంధించిన పద్ధతులను పరిశీలించారు. అలాగే నగరంలో సేకరించే చెత్తను శాస్త్రీయంగా వేరు చేయడం, ప్లాస్టిక్, పొడి వ్యర్థాల పునర్వినియోగం, పారిశుధ్య పనులను వేగవంతం చేసే ఆధునిక యంత్రాలు, కాలుష్య నియంత్రణ పరికరాల పనితీరును ప్రత్యక్షంగా వీక్షించారు. ప్రపంచంలోని పలు నగరాల్లో విజయవంతంగా అమలవుతున్న పర్యావరణహిత విధానాలు, సాంకేతిక పరిష్కారాలు, వివిధ ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి.. వాటిని కరీంనగర్‌లో అమలు చేసే అవకాశాలపై అవగాహన పొందారు.



## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



**మహాదేవపూర్ సెప్టెంబర్ 9 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్రనాథ్, ఎంపీఓ ప్రకాష్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సన్నవరి విత్తనాల నమోదు నేటితో ముగియనున్న ఆన్ లైన్ ప్రక్రియ



**కమలాపూర్, సెప్టెంబర్ 9 (సింగిడి):** సన్న రకాల వరి విత్తనాలు సాగు చేస్తున్నటువంటి రైతులు విత్తన నమోదు ప్రక్రియ నేటితో ముగుస్తుందని రైతులు తప్పనిసరిగా ఆన్ లైన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి వేణు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వానకాలం సీజన్లో రైతులు కొనుగోలు చేసినటువంటి సన్న రకాలు అయిన ,ఆర్. ఎన్. ఆర్ 1548 ,బిపిటి5204, ఖరీవీ 168 ,కే. ఎన్. ఎం 1638, హెచ్. ఎం. టి సోనా, జైశ్రీరామ్, డబ్ల్యూ జి ఎల్ 44, కె. ఎన్. ఎం 7715. విత్తన డీలర్ల వద్ద కొనుగోలు చేసిన విత్తనం సంబంధిత డీలర్ల వద్ద ఆన్లైన్ చేయించుకోవాలన్నారు. సొంత విత్తనం తయారు చేసుకున్నటువంటి రైతులు , ఇతర రైతుల వద్ద నుండి కొనుగోలు చేసినటువంటి విత్తనములను వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి కనుగోలు చేసిన విత్తనమును ఆన్లైన్ నమోదు చేయడానికి కోసం సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారికి రైతు ధృవీకరణ పత్రము నేడు అందచేసి ఆన్ లైన్ లోనమోదు చేసుకోవాలన్నారు. ఆన్ లైన్ లో నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించేటువంటి ఐదు బోనస్ అందుతాయని తెలిపారు. రైతులు సకాలంలో విత్తన నమోదు ప్రక్రియను చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి వేణు కోరారు.

## గణేష్ నవరాత్రుల్లో హద్దులు దాటితే చర్యలు తప్పవు

నాంపల్లి సీఐ దూదిరాజు హెచ్చరిక



**చింతపల్లి, సెప్టెంబర్ 9 (సింగిడి):** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా హద్దులు దాటితే కఠిన చర్యలు తప్పవని నాంపల్లి సీఐ దూదిరాజు హెచ్చరించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ రాంమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి సమావేశంలో గణేష్ మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన అనంతరం ప్రభుత్వం, పోలీసుశాఖ సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సి ఐ. రాజు తెలిపారు. 11 రోజుల్లోపే గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా ర్యాలీలు, ఊరేగింపుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని కోరారు. గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే అనుమతి ఇవ్వబోమని హెచ్చరించారు. మండపాల వద్ద డీజేలు, మైక్‌లు, విద్యుత్ వినియోగం తదితర అంశాల్లో ప్రభుత్వ నిబంధనలను పాటించాలని సూచించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఇతరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వహించాలని ఆయన కోరారు. సామాజిక మాధ్యమాల్లో వివాదాస్పద పోస్టులు పెట్టడం, వదంతులు వ్యాప్తి చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా ప్రజలు, నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని సీఐ దూదిరాజు, ఎస్ఐ రాంమూర్తి, లు కోరారు.

# మహిళా ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్



**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 9 (సింగిడి):** మహిళా ఎమ్మెల్యేలను అవమానించిన రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడాలని మహిళల చేత అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయమని అడిగితే అక్రమంగా అరెస్టులు చేయడం ఎంతవరకు న్యాయమని, అసెంబ్లీ సాక్షిగా నిన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ అని, ప్రజాస్వామ్యంలో చీకటి రోజని ఆయన నిప్పులు చెరిగారు. అక్రమంగా అరెస్టు చేసిన ఎం.ఎల్. సిలు తాత మధు, నవీన్ రెడ్డిని బేషరతుగా విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలు 100 రోజులలో అమలు చేస్తామని మాట తప్పినందుకు నల్ల దుస్తులతో నిరసన వ్యక్తం చేయడానికి అసెంబ్లీకి వెళుతున్న ఎమ్మెల్యేలపై, మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి లపై దాడి చేసి గాయపరచడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని దుయ్యబట్టారు. రాజ్యాంగం పుస్తాకాన్ని చేతపట్టుకొని రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ పార్లమెంట్ లో నిరసన తెలియజేయవచ్చు కానీ మేము చేస్తే తప్పా అని నిలదీశారు. ఎమ్మెల్యేలను సభలోకి రానీయకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతిపక్షం సభలో ప్రభుత్వ బండారం బయట పెడుతుందని జడిసి సభ బయటనే అడ్డుకోవడం ఈ ప్రభుత్వానికి చెల్లిందని అన్నారు. మహిళా ఎమ్మెల్యేలను, రెండు సార్లు మంత్రులుగా చేసిన అనుభవం ఉన్నా అవమానించిన తీరు దుశ్శాసన పర్వాన్ని తలపిస్తోందని, వెంటనే రేవంత్ ప్రభుత్వం మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని నిరంజన్ రెడ్డి కోరారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఇంతియాజ్ ఇసాక్ మాట్లాడుతూ నిత్యం మహిళా పక్షపాతి అని చెప్పుకునే రేవంత్ రెడ్డి మహిళల ఉసురు తగిలి పతనం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. ప్రజల నుండి వస్తున్న నిరసనలు తట్టుకోలేక రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్య ఖూనికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. క్షమాపణ చెప్పే వరకు ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంపై అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం



**నల్లగొండ, సెప్టెంబర్ 9 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన విఫలం చెందినదాని జిల్లా పార్టీ అధ్యక్షులు రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో మర్రిగూడ బైపాస్ రోడ్డులోని భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిలిపి వేస్తోందని ఆరోపించారు. రైతుబీమా, దళితబంధు, మిషన్ భగీరథ, రైతుబంధు వంటి పథకాల పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని, కొత్తగా లబ్ధిదారులకు ప్రయోజనాలు అందడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రకటించిన హామీలు వంద రోజుల్లో కాదు, వెయ్యి రోజుల్లోనూ పూర్తికాలేదని అన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల జరిగిన వ్యవహారశైలిని కూడా తప్పుబట్టారు. మహిళా ఎమ్మెల్యేలతో సహా ప్రతిపక్ష సభ్యులపై దాడులు జరిగాయని ఆరోపించారు. ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిల అరెస్టులను కూడా ఆయన ప్రస్తావించారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఫామ్‌హౌస్ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వారం రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు మినహా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని ఆరోపించారు. అసెంబ్లీలో జరిగిన ఘటనపై న్యాయస్థానం కూడా ప్రభుత్వ తీరును ప్రశ్నించిందని పేర్కొన్నారు. ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ పోరుబాట పట్టిందన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రభుత్వం రాజకీయ అంశాలను తెరపైకి తెస్తోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలదీస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌దేనని, రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఉద్యోగాల కల్పనతో పాటు గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను పక్కన పెట్టి కాంగ్రెస్ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అసెంబ్లీలో తమ పార్టీ ఎమ్మెల్యేలను ప్రశ్నించకుండా అడ్డుకుంటున్నారని, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఇతర అంశాలను తెరపైకి తెస్తున్నారని భూపాల్‌రెడ్డి విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలు, అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో చెరుకు సుధాకర్, కంచర్ల కృష్ణారెడ్డి, పల్లె రవికుమార్‌గౌడ్, రాంచందర్‌నాయక్, కటికం సత్తయ్యగౌడ్, మాలే శరణ్యరెడ్డి, రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, సింగం రామ్మోహన్, అభిమన్యు శ్రీనివాస్, భువనగిరి దేవేందర్, పలువురు నాయకులు, మహిళా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..

మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు



**మిర్యాలగూడ సెప్టెంబర్ 9 (సింగిడి):** తెలంగాణ అసెంబ్లీలో బిఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పాటు శాసన మండలి సభ్యులను అవమానించేలా వ్యవహరించిన తీరును నిరసిస్తూ మిర్యాలగూడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మహిళా విభాగం ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. మిర్యాలగూడ రెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయంలో మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమావేశమై అసెంబ్లీలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి సాగర్ రోడ్డులోని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రస్తావించేందుకు అసెంబ్లీకి వెళ్లిన మహిళా ప్రజాప్రతినిధులను అవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. మహిళలను గౌరవిస్తామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం, తన చర్యల ద్వారా మహిళా ప్రజాప్రతినిధుల పట్ల తన వైఖరిని బయటపెట్టిందని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జరిగిన అవమానంపై ప్రభుత్వం వెంటనే స్పందించి క్షమాపణ చెప్పాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడే వరకు పార్టీ మహిళా విభాగం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తిప్పన విజయసింహారెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దుర్గంపూడి నారాయణరెడ్డి, ధనావత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి , అన్నభీమోజు నాగార్జున చారి, పాలుట్ల బాబయ్య, మట్టపల్లి సైదయ్య యాదవ్, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ఎండి ఇలియాస్ ఖాన్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, ఎండి మగ్దూం భాష ,చౌగని బిక్షం గౌడ్, ఎండి. మాజిద్ , మాలావాత్ రవీందర్ నాయక్, పోకల రాజు, విక్టర్, గుడిసె దుర్గ ప్రసాద్, ప్రసాద్, జాని, భీమ్లా నాయక్, రాబర్ట్, మారుతి వెంకట్ రెడ్డి, పెండ్యాల పద్మావతి ,ధూళిపాల కళావతి ,కుర్ర చైతన్య, సహనాజ్ బేగం, రుక్షాన, పెరుమాళ్ళ ధనమ్మ, చిత్ర0 ఉమా, కోదాటి రమ, బాణావత లలితా నాయక్, దీపిక, గుడిశ జానకమ్మ, సందేశ్ రజిని, లావుడి అరుణ, జలపాల సునీత, ఆంగోతు హాతీరాం నాయక్ ,బారెడ్డి అశోక్ రెడ్డి ,జెరిపోతుల రాములు గౌడ్, ధనావత వెంకటేశ్వర్లు నాయక్, కట్ట మల్లేష్ గౌడ్, సైదా నాయక్, రమేష్ నాయక్, మండల్ సైదాచారి, ఎర్రమళ్ళ దినేష్, సిరసనగండ్ల ఈశ్వర చారి, ఎలుగుబెల్లి నాగరాజు, వినోద్ నాయక్, కొండాలరావు నాగేశ్వరరావు, దైవ సత్యం, దైద వెంకటేష్, ఎండి. గయాస్, మరి అంజిబాబు, భూక్య రాంబాబు, మాలి రేణుక, బంటు కాత్యాయని, గంటా శ్రావణ్ రెడ్డి ,బెడదూరి శ్రీనివాస్ రెడ్డి, బంటు నాగయ్య, శంకర్ నాయక్, చలికంటి యాదగిరి, కొర్ర చిన్న నాయక్, నూనె మమత మంగ నాయక్ పాల్గొన్నారు.

# పారదర్శక ఓటరు జాబితా తయారు చేయడమే ఎన్నికల సంఘం ఉద్దేశం

ఓటర్ జాబితా, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

**నల్గొండ ప్రతినిధి, సెప్టెంబర్ 9 (సింగిడి):** పారదర్శక ఓటరు జాబితా రూపొందించడమే ఎన్నికల సంఘం ముఖ్య ఉద్దేశమని ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) నల్గొండ జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు మరియు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఏ. శ్రీదేవసేన అన్నారు. ఆమె నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్), ఓటరు జాబితా పై రాజకీయ పార్టీల ప్రతినిధుల తో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. సర్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ పై ముందుగా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ జాబితా పరిశీలకు రాలకు వివరిస్తూ నల్గొండ జిల్లాలో జిల్లా యంత్రాంగం, సర్ ప్రక్రియను సవ్యంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నారని ,ఎలాంటి ఇబ్బంది లేదని, సర్ లో భాగస్వాములైన జిల్లా కలెక్టర్ మొదలుకొని కిందిస్థాయి బిఎల్ఓ వరకు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. అయితే మ్యాపింగ్ కానీ, పేర్లు, చిరునామా, తదితర విషయాలలో తేడాలున్న ఓటర్లకు జారీచేసిన నోటీసుల విషయంలో బిఎల్ఓ లకు సరైన అవగాహన లేనందువల్లా ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నోటీసులకు సమర్పించే ధ్రువపత్రాలు అలాగే ఓటర్లకు ఉన్న అపోహలను తొలగించడం, తదితర విషయాల్లో వార్తాపత్రికలు, స్థానిక ఛానల్స్ ద్వారా అవగాహన కల్పిస్తే బాగుంటుందని, 80 సంవత్సరాలకు పైబడి నోటీసు అందుకున్న ఓటర్లకు వారి ఇంటి దగ్గరే విచారణ నిర్వహిస్తే బాగుంటుందని ,రెండు ఓట్లు ఉన్న వారిని తొలగించి ఒకే చోట ఓటు హక్కు కల్పించాలని, ఓటరు జాబితా పరిశీలకు రాలి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఓటరు జాబితా పరిశీలకురాలు




దేవసేన మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాను పూర్తి పారదర్శకంగా తయారు చేయాలన్నదే ఎన్నికల సంఘం ఉద్దేశమని, ఇందులో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో ఉండాలని, అలాగే అర్హత లేని వారు జాబితాలో ఉండకూడదని, ఈ విషయంలో అధికారులతో పాటు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కలిసి పని చేస్తే సాధ్యమవుతుందని అన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు వారికి సంబంధించిన దృవపత్రాలను బిఎల్ఓ లకు సమర్పించే విషయంలో బిఎల్ఓ, బిఎల్ఏ ఇద్దరు కలిసి నోటీసు జారీ చేసిన వారి వద్దకు వెళ్లి ఎలాంటి ధ్రువపత్రాలు కావాలో ముందే తెలియజేయాలని, మ్యాపింగ్ కాని , జాబితాలో పేరు ఉండి చిరునామా దొరకనీ , సరైన ధృవపత్రాలు లేని వారి విషయంలో పేరు పేరును జాగ్రత్తగా పరిశీలించి వారితో సంబంధం ఏర్పరచుకొని వారి సమస్యను పరిష్కరించేలా ఈఆర్వో,ఏ ఈ ఆర్ ఓ లు చర్యలు తీసుకోవాలన్నారు . నోటీసులకు జారీ చేసిన వారి కి నిర్వహించే హియరింగ్ కేంద్రాల వద్ద బిఎల్వోలు, అలాగే రాజకీయ పార్టీల తరఫున వారి ప్రతినిధులు ఉంటే అర్హులైన ఏ ఒక్కరి పేరు జాబితా నుండి తొలగిపోవడానికి అవకాశం లేదని చెప్పారు. ఈఆర్వో, ఏఈఆర్వోలు ప్రతి బిఎల్ ఓ తో వారి పరిధిలో జారీ చేసిన నోటీసులు ,అందుకున్న వారి వివరాలు, అలాగే నోటీసులకు సమాధానం ఇస్తూ ధ్రువపత్రాలు సమర్పించిన వారు, నోటీసులకు సమాధానం లేని రాని వారి విషయంలో తీసుకుంటున్న చర్యలు, నోటీస్ అందుకున్న ఓటర్లు ఎలాంటి ధ్రువపత్రాలు సమర్పిస్తున్నారు అన్న విషయాల పై క్షుణ్ణంగా సమీక్షించాలన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైతే ఒకటికి రెండుసార్లు అవగాహన కల్పించాలని ,బిఎల్ఓ స్థాయిలో ఎవరు నిర్లక్ష్యంగా ఉండవద్దని, అలా ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఒక ఓటర్ కు రెండు చోట్ల ఓటు హక్కు లేకుండా నోటీసు జారీ చేసి ఒక చోటే ఓటు హక్కు ఉండేలా చూడాలని, సర్ ప్రక్రియలు ఎక్కడైనా సమస్యలు ఉంటే అలాంటి వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి కూడా తీసుకువెళ్లి పరిష్కరించాలని చెప్పారు. ఎన్నికల జాబితా తయారీ అనుమానాస్పద కార్యక్రమం కాదని,పూర్తి పారదర్శకంగా, అందరికీ తెలియజేసి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని, సర్ ప్రక్రియ పూర్తి ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతుందన్నారు . జాబితా తయారీలో ఈ ఆర్వోలు, ఏ ఈ ఆర్ వో లు పూర్తి జాగ్రత్తగా ఉండాలని, అలాగే పార్టీల ప్రతినిధుకలిసి పని చేస్తే తప్పులు లేని జాబితా తయారవుతుందని చెప్పారు.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు, నియోజకవర్గాలు, ఈఆర్వోలు,ఏ ఈ ఆర్ ఓ లు, బిఎల్ఓ,బి ఎల్ ఏ నియామకం, సర్ లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని వివరాలన్నింటినీ వివరించారు. జిల్లాలో రేషనలైజేషన్ తర్వాత 1861 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్ కేంద్రానికి బిఎల్ఓ ను నియమించడం జరిగిందని, అలాగే 5889 మంది బిఎల్ఏలు ఉన్నారని ,15,16,253 మంది ఓటర్లు ఉండగా, 13 లక్షల, పదహారువేల, 860 మంది ఓటర్ల మ్యాపింగ్ జరిగిందని, 13,57,618 ఎన్యుమరేషన్ ఫామ్స్ ను డిజిటలైజేషన్ చేశామని, జిల్లాలో మహిళా పురుష ఓటర్ల నిష్పత్తి 1017గా ఉందని, 762 మంది సీనియర్ సిటిజన్లు, 28,718 దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, మ్యాపింగ్ కానీ, ఓటరు జాబితాలో చిరునామా, వయసు తదితర విషయాలలో తేడాలున్న 2,28,939 మంది ఓటర్లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేశామని, విచారణ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. నోటీసుల జారీ , హియరింగ్ పై ఈనెల 5,6 తేదీలలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ,దేవరకొండ సబ్ కలెక్టర్, ఐఏఎస్ అధికారి కరోలిన్ చింగ్ థియాన్ మావి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఈఆర్వోలు,ఏ ఈ ఆర్ ఓ లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎం ఐ ఎం గౌస్ మోహియుద్దీన్, బిజెపి నుండి పి. లింగస్వామి, బిఆర్ఎస్ నుండి పిచ్చయ్య, కాంగ్రెస్ నుండి ఎండి ముంతాజ్ అలీ, సిపిఎం నుండి సైదులు, ఆమ్ ఆద్మీ పార్టీ నుండి రవి, బీఎస్పీ నుండి రవిశంకర్, ఈ సమావేశానికి హాజరయ్యారు.

## వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



- పీస్ కమిటీ సమావేశంలో రూరల్ సీఐ పులి వెంకట్

**జమ్మికుంట, సెప్టెంబర్ 9 (సింగిడి):** ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పులి వెంకట్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ వర్గాల ప్రతినిధులు, మత పెద్దలు,స్థానిక ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాబోయే వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడంపై చర్చించారు. సమాజంలో మత సామరస్యాన్ని, శాంతిభద్రతలను కాపాడటంలో పీస్ కమిటీ సభ్యుల పాత్ర ఎంతో కీలకమని సీఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభ్యులకు సిఐ కొన్ని సూచనలు చేశారు. సామాజిక మాధ్యమాలపై నిఘా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, రెచ్చగొట్టే సందేశాలు వదంతులను ఎవరూ నమ్మవద్దని, ఇతరులకు ఫార్వర్డ్ చేయవద్దని స్పష్టం చేశారు. ఏ ప్రాంతంలోనైనా చిన్నపాటి వివాదాలు లేదా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సామరస్య పూర్వక అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో, సంప్రదాయబద్ధంగా పండుగలను జరుపుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పీస్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# చంద్రబాబు అరెస్ట్ కుట్ర వైసీపీ పతనానికి నాంది

'నిజం గెలిచింది' కార్యక్రమంలో 53 కొవ్వొత్తులతో నిరసన తెలిపిన టీడీపీ నాయకులు



**కరీంనగర్, సెప్టెంబర్9(సింగిడి):** టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపిన ఘటనకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా కరీంనగర్‌లో తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ నియోజకవర్గం ఆధ్వర్యంలో 'నిజం గెలిచింది' కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంట్ పార్టీ కార్యాలయం వద్ద 53 కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని అవమానించేలా చంద్రబాబు నాయుడును 53 రోజులు జైలులో ఉంచడం వెనుక అప్పటి వైసీపీ ప్రభుత్వం, జగన్‌రెడ్డి చేసిన కుట్రే ఆ పార్టీ పతనానికి నాంది పలికిందని విమర్శించారు. ఈ ఘటన ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజుగా నిలిచి పోయిందన్నారు. కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నాగుల బాలగౌడ్, రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దామెర సత్యం, తాత్కాలిక కమిటీ సభ్యులు రొడ్డ శ్రీనివాస్, బీసీ సెల్ మాజీ అధ్యక్షులు ఇట్టా మల్లేశం, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఎర్రవెల్లి వినిత్, నగర మాజీ అధ్యక్షులు రొడ్డ శ్రీధర్, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు బోలుమల్ల సదానందం, దేశ్ నరేందర్ దత్తు, ఎన్నం రమేష్, బుర్ర రాంచంద్రం, వాడ్కాపురం లక్ష్మిరాజ్యం, కళ్యాడపు నరేష్, నూనె రజిత, కీర్తి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.


# కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ




**కరీంనగర్, సెప్టెంబర్9(సింగిడి):** కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, స్వీకరణ కేంద్రం, ప్రజల అభిప్రాయాల వివరాలను పరిశీలించారు. నేర పరిశోధన, రోజువారీ పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించు కోవాలని సూచించారు. నేరాల నమోదు, దర్యాప్తు కోసం వినియోగిస్తున్న సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష్య, సమన్వయ వంటి సాంకేతిక వ్యవస్థల పనితీరును సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, వారికి సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తనిఖీలో ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఎస్సై సాంబమూర్తి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్యంగా ఉండాలంటే..

నేటి బిజీ జీవితంలో శారీరక కదలికలు తగ్గిపోవడంతో ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అయితే, ప్రతిరోజూ కేవలం 10-15 నిమిషాలు కేటాయించి, సులభమైన యోగాసనాలు వేయడం ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా, చురుకుగా ఉంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.





ఆరోగ్యంగా ఉండాలంటే.. ఈ 5 సింపుల్ యోగాసనాలు చేయడం బెస్ట్

ఇంటర్నెట్ డెస్క్: శరీరంలోని అవయవాలు సరిగా పనిచేయాలంటే రక్త ప్రసరణ సక్రమంగా ఉండాలి. అయితే నేటి బిజీ జీవనశైలిలో చాలా మంది శారీరక కదలికలు తగ్గించడంతో రక్త ప్రసరణ మందగిస్తుంది. దీని వల్ల గుండె సమస్యలు సహా అనేక ఆరోగ్య సమస్యలు రావచ్చు. కానీ కొన్ని యోగాసనాలను ప్రతిరోజూ చేస్తే రక్త ప్రసరణను మెరుగుపరచవచ్చు.



**సర్వాంగాసనం**

సర్వాంగాసనం (భుజాల మీద నిలబడే ఆసనం) అనేది మొత్తం శరీరానికి ప్రయోజనం చేకూర్చే ఒక శక్తివంతమైన విలోమ యోగాసనం. ఇది థైరాయిడ్ గ్రంథిని ఉత్తేజపరచడం, రక్త ప్రసరణను, జీర్ణక్రియను మెరుగుపరచడం, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది.

**ఉష్ట్రాసనం**

ఈ ఆసనం రక్త ప్రసరణను పెంచి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. వెన్నునొప్పి, ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. మోకాళ్లపై కూర్చుని వెనక్కి వాలి చేతులతో చీలమండలను పట్టుకోవాలి. ఛాతిని పైకి ఎత్తి 10--20 సెకన్లు ఉండాలి. తర్వాత మెల్లగా కూర్చోవాలి.

**అధో ముఖ శ్వానాసనం**

ఈ ఆసనం తలకు రక్త ప్రసరణను పెంచుతుంది. అలసట తగ్గించి వెన్నెముకను బలపరుస్తుంది. మోకాళ్లపై నిలబడి, చేతులు నేలపై ఉంచి తుంటిని పైకి ఎత్తాలి. శరీరం 'ఎ' ఆకారంలో ఉండాలి.

**త్రికోణాసనం**

ఈ ఆసనం శరీరానికి సమతుల్యత ఇస్తుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది, శరీర భంగిమ కూడా సరిగా ఉంటుంది. పాదాలను దూరంగా ఉంచి నిలబడి, ఒక వైపు వంగి ఒక చేతిని కాలి వద్ద ఉంచి, మరో చేతిని పైకి ఎత్తాలి.

**విపరీత కరణి**

ఇది చాలా సులభమైన ఆసనం. కాళ్లను గోడకు ఆనించి పైకి ఎత్తి పడుకోవాలి. రక్త ప్రసరణ మెరుగుపడటంతో పాటు ఒత్తిడి తగ్గుతుంది. నిద్రలేమికి కూడా ఉపయోగపడుతుంది.


**జాగ్రత్తలు**

అధిక రక్తపోటు, గుండె సమస్యలు ఉన్నవారు ముందుగా వైద్యుడిని సంప్రదించాలి. గర్భిణీలు ఈ ఆసనాలు చేయకూడదు. మెడ లేదా కంటి సమస్యలు ఉన్నవారు నిపుణుల సలహా తీసుకోవాలి.

ఈ యోగాసనాలను క్రమం తప్పకుండా చేస్తే రక్త ప్రసరణ మెరుగై శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.







## జస్ట్ రూ.210తో ప్రతి నెలా 5వేలు అకౌంట్‌లోకి..

### కేంద్రం తెచ్చిన ఈ సూపర్ స్కీమ్ గురించి తెలుసా..?

ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత పెన్షన్ రూపంలో ఆర్థిక భద్రత ఉంటుంది. కానీ దేశంలో మెజారిటీ ప్రజలు ప్రైవేట్ ఉద్యోగాలు, స్వయం ఉపాధి లేదా రోజువారీ కూలీలుగా అసంఘటిత రంగంలో జీవనం సాగిస్తున్నారు.

ఇలాంటి వారికి వృద్ధాప్యంలో స్థిరమైన ఆదాయాన్ని అందించి, ఆర్థిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అటల్ పింఛను యోజన అనే అద్భుతమైన పథకాన్ని అమలు చేస్తుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఈ స్కీమ్‌లో నిర్దిష్ట కాలం పాటు చిన్న మొత్తాల్లో పెట్టుబడి పెడితే.. 60 ఏళ్లు నిండిన తర్వాత నెలకు గరిష్టంగా రూ. 5000 వరకు ఖచ్చితమైన పెన్షన్ పొందవచ్చు.



**అర్హతలు ఎవరికి ఉన్నాయి?**

- అటల్ పెన్షన్ యోజనలో చేరాలనుకునే దరఖాస్తుదారులు
  ఈ అర్హతలను కలిగి ఉండాలి.
- దరఖాస్తుదారు తప్పనిసరిగా భారతీయ పౌరుడై ఉండాలి.
- కనీస వయస్సు 18 సంవత్సరాల నుండి గరిష్టంగా 40 సంవత్సరాల లోపు ఉండాలి.
- దరఖాస్తుదారుడికి ఏదైనా బ్యాంకు లేదా పోస్టాఫీసులో యాక్టివ్ సేవింగ్స్ ఖాతా ఉండాలి.
- సదరు బ్యాంక్ ఖాతాకు ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ తప్పనిసరిగా లింక్ అయి ఉండాలి.
- వీరికి ఈ పథకం వర్తించదు..

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. అక్టోబర్ 1, 2022న లేదా ఆ తర్వాత ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లించి ఉంటే, వారు ఈ అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరడానికి అర్హులు కారు. ఈ పథకం పూర్తిగా పన్ను పరిధిలోకి రాని, తక్కువ ఆదాయ వర్గాల అసంఘటిత రంగ కార్మికుల కోసం ఉద్దేశించబడింది.

**నెలకు ఎంత పెట్టుబడి పెట్టాలి?**

- ఈ పథకంలో ప్రీమియం మొత్తం.. మీరు చేరే వయస్సు, రిటైర్మెంట్ తర్వాత మీకు కావాల్సిన పెన్షన్ మొత్తంపై ఆధారపడి ఉంటుంది. ఈ స్కీమ్‌లో కనీసం 20 సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.


**18 ఏళ్ల వయస్సులో చేరితే:** 60 ఏళ్ల తర్వాత నెలకు రూ. 5,000 పెన్షన్ కావాలనుకుంటే.. వారు నెలకు కేవలం రూ. 210 మాత్రమే ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

**30 ఏళ్ల వయస్సులో చేరితే:** అదే నెలకు రూ. 5,000 పెన్షన్ కోసం, కాస్త వయస్సు పెరిగింది కాబట్టి నెలవారీ ప్రీమియం రూ. 577 గా ఉంటుంది.

**అప్లై చేయడం ఎలా?**

- అటల్ పెన్షన్ యోజనలో నమోదు చేసుకోవడం చాలా సులభం.
- ముందుగా మీ సేవింగ్స్ ఖాతా ఉన్న బ్యాంకు శాఖను లేదా పోస్టాఫీసును సందర్శించి సంబంధిత అధికారిని సంప్రదించాలి.
- అక్కడున్నా దరఖాస్తు ఫారమ్ నింపి, మీ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి.
- మీరు ఎంచుకున్న పెన్షన్ మొత్తాన్ని బట్టి నెలవారీ ప్రీమియం వివరాలను బ్యాంక్ వారు ఖరారు చేస్తారు.
- ఆ తర్వాత మీ బ్యాంక్ ఖాతా నుండి ఆటో-డెబిట్ సదుపాయాన్ని యాక్టివేట్ చేస్తారు. దీనివల్ల ప్రతి నెలా మీ ఖాతా నుండి ప్రీమియం అమౌంట్ ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది.
- యువ వయస్సులోనే చిన్న మొత్తంలో పొదుపు చేయడం ద్వారా వృద్ధాప్యంలో ఎవరిపైనా ఆధారపడకుండా గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అటల్ పెన్షన్ యోజన ఒక అద్భుతమైన మార్గం. మీ భవిష్యత్తుకు ఆర్థిక రక్షణ కల్పించుకోవడానికి ఈ ప్రభుత్వ పథకం ఎంతో ఉత్తమమైనది.

స్టాక్ మార్కెట్
Stock Market



## భారీగా పెరుగుతున్న కోడి గుడ్డు ధర..

### కారణం ఏంటో తెలుసా..?

మీరు రోజూ గుడ్లు తినే వారైతే ఈ వార్త మీకు ముఖ్యమైనది. దేశవ్యాప్తంగా గుడ్ల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. చాలా చోట్ల ఒక గుడ్డు ఇప్పుడు 8.5 నుండి 9 రూపాయలకు అమ్ముడవుతోంది. దీనికి ప్రధాన కారణం కోళ్ల మేత ధరలు పెరగడమేనని పౌల్ట్రీ పరిశ్రమ చెబుతోంది. అయితే జూలై నెలాఖరు నాటికి ధరలు తగ్గుముఖం పట్టవచ్చని ఈ పరిశ్రమ ఆశిస్తోంది. కోళ్ల మేతలో ఉపయోగించే మొక్కజొన్న, సోయాబీన్ మీల్, ఇతర ముఖ్యమైన మేత పదార్థాలు విదేశాల నుండి దిగుమతుల కార ణంగా మరింత ఖరీదైనవిగా మారాయని పౌల్ట్రీ కంపె నీలు చెబుతున్నాయి. పశ్చిమ ఆసియాలో కొనసా గుతున్న సంఘర్షణ దిగుమతులు, సరఫరాలను ప్రభావితం చేయడం దీనికి పాక్షికంగా కారణం.



**మొక్కజొన్న, సోయాబీన్ ఖర్చులు పెరిగాయి:**
జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ (ఎన్ఈసీసీ) గణాంకాల ప్రకారం, హైదరాబాద్‌లో గుడ్ల ఎక్స్-ఫార్మ్ ధర ఒక నెలలో 15%, గత ఏడాదితో పోలిస్తే దాదాపు 40% పెరిగింది. వెంకటేశ్వర హేచరీస్ అనే పౌల్ట్రీ కంపెనీ ప్రకారం, మార్చి నుండి కోళ్ల దాణాలో ఉపయోగించే దాదాపు ప్రతి వస్తువు ధర పెరిగింది. కోళ్ల దాణాలో సుమారు 55% వాటా ఉన్న మొక్క జొన్న ధర, మార్చి నుండి ఇక్కడ 35% పైగా పెరి గింది. దాణాలో సుమారు 22% వాటా ఉన్న సోయా బీన్ మీల్ ధర 64% పైగా పెరిగింది. అంతేకాకుండా దాణాలో ఉపయోగించే ఆవశ్యక అమైనో ఆమ్లాల ధర మార్చి నుండి 3.5 రెట్లు పెరిగింది.

**ధరలు పెరగడానికి కారణం ఏమిటి?**
మొక్కజొన్నకు డిమాండ్ ఇకపై కేవలం పౌల్ట్రీ పరిశ్రమకే పరిమితం కాలేదు. ఇథనాల్ కంపెనీలు కూడా మొక్కజొన్నను పెద్ద పరిమాణంలో కొనుగోలు చేస్తుండటంతో, దాని ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు, ఈ ఏడాది అస్తవ్యస్తంగా ఉన్న రుతుపవ నాలు రైతులు, పరిశ్రమ వర్గాల్లో ఆందోళనలను పెంచాయి. సకాలంలో, ఏకరీతిగా వర్షాలు కురవకపో వడం ఖరీఫ్, రబీ పంటల ఉత్పత్తిపై ప్రభావం చూపు తుందని అంచనా. సోయాబీన్ ధరలు పెరగడానికి మరో కారణం గతేడాది ఉత్పత్తి తక్కువగా ఉండటం. పరిశ్రమ వర్గాల అంచనాల ప్రకారం, గతేడాది భారతదేశంలో సోయాబీన్ ఉత్పత్తి సుమారు 20% తక్కువగా ఉంది. ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగానే కొనసాగితే, ఉత్పత్తి మరింత క్షీణించి, ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

**తీవ్రమైన వేడి కారణంగా చికెన్ కూడా ఖరీదైపోయింది:**
ఈ ఏడాది జూన్ వరకు కొనసాగిన తీవ్రమైన వేడి గుడ్లనే కాకుండా కోడి మాంసాన్ని కూడా ప్రభావితం చేసింది. ఈ తీవ్రమైన వేడి బ్రాయిలర్ కోళ్ల ఉత్పత్తిని తగ్గించడంతో మార్కెట్లో ధరలు పెరిగాయి. పరిశ్రమ గణాంకాల ప్రకారం, అనేక నగరాల్లో చిల్లర కోడి మాంసం ధరలు కిలోకు 260 నుంచి 300కు చేరుకున్నాయి. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కిలో చికెన్ ధర రూ. 300పైగానే అమ్ముడవుతోంది.

**ఎప్పుడు ఉపశమనం లభిస్తుంది?**
జులై నెలాఖరు నుండి గుడ్ల ధరలు స్వల్పంగా తగ్గుతాయని పౌల్ట్రీ పరిశ్రమ అంచనా వేస్తోంది. దీనికి కారణం ఉత్తర భారతదేశంలో అధిక సంఖ్యలో ప్రజలు శ్రావణ మాసంలో మతపరమైన కారణాల వల్ల గుడ్లు, మాంసం వినియోగాన్ని తగ్గించుకోవ డమే. డిమాండ్ తగ్గడంతో ధరలు తగ్గే అవకాశం ఉంది. అయితే, రుతుపవనాలు సాధారణంగా కురవకపోయినా, మొక్కజొన్న, సోయాబీన్ ధరలు అధికంగా ఉన్నా, రాబోయే నెలల్లో గుడ్లు, కోడి మాంసం ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

ప్రభాతనవ SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం
10-9-2026

సీఎం రేవంత్‌రెడ్డితో ప్రభుత్వ విప్

## బీర్ల అయిలయ్య భేటీ

ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి,
ప్రజా సమస్యలపై చర్చ



**హైదరా బాద్, ఆలేరు, (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బుధవారం హైదరా బాద్‌లో మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పలు అంశాలతో పాటు ఆలేరు నియోజక వర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి బీర్ల అయిలయ్య తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆలేరు నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అభివృద్ధి పనులు, ప్రజల అవసరాలు, పెండింగ్ సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు పేర్కొ న్నారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన మరిన్ని అభివృద్ధి కార్యక్ర మాలకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించా లని ఎమ్మెల్యే కోరారు. ప్రజల అవసరా లకు అనుగుణంగా అభి వృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆయా అంశాలపై సానుకూ లంగా స్పందించినట్లు బీర్ల అయిలయ్య తెలిపారు. ప్రజా సంక్షేమం, ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ప్రారంభం

– వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి అల్దాస్ జానయ్య

**నారాయణపేట ప్రతినిధి, (సింగిడి):** రాష్ట్రంలోని నూతన జిల్లాల్లో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ వ్యాప్తంగా కొత్త రైతు విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి జానయ్య వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో భాగంగా నారాయణపేటలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం స్థాపనకు భూమి పూజ నిర్వహించడమే కాకుండా, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ యార్డ్ లోని ఓ భవనంలో తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించారు. ఉపకులపతి మాట్లాడుతూ... హైదరాబాదులోని రాజేంద్ర నగర్ లో 1963 లో నాటి ప్రధాని లాల్ బహ దూర్ శాస్త్రి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయ భవనాలు, ప్రాంగణాలను ఆ తర్వాత మూడవ ప్రధాని ఇందిరా గాంధీ ప్రారంభించారు. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, వి.వి. గిరి వంటి ప్రముఖులు వర్సిటీని సందర్శించారని, తొలి హైదరాబాద్ రాష్ట్ర వ్యవసాయ మంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి దాదాపు 3000 ఎకరాల భూమిని దీనికి కేటాయించారని గుర్తుచేశారు. నారాయణపేటలో కొత్తగా 20 ఎకరాల స్థలంలో నూతన రైతు విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే 10 నెలల్లో పక్కా భవనం, శిక్షణ గదులు, డాక్యుమెంటరీలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రస్తుతం సైంటిస్ట్ డాక్టర్ సత్యనారాయణను కోఆర్డినేటర్ హెడ్ గా నియమించినట్ల వెల్లడించారు. సాయిల్ టెస్టింగ్ ల్యాబ్స్ (నేల పరీక్షా కేంద్రాలు) రాబోయే దసరా లోపు నారాయణపేటతో పాటు మరో 5 జిల్లాల్లో నేల పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారని కూడ తెలిపారు. ఇఫ్కో (ఐఎఫ్ఎఫ్ సి ఓ) సంస్థ తమ సిఎస్ఆర్ గ్రాంట్ల కింద రాష్ట్రవ్యాప్తంగా 12 సాయిల్ టెస్టింగ్ ల్యాబ్స్ మంజూరు చేసిందని వర్సిటీ ఉపకులపతి వెల్లడించారు.

**వ్యవసాయ కూలీల పిల్లలకు 15% సీట్లు**

తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు పిల్లలకు ఉన్న 25% ఫార్మర్స్ కోటాతో




పాటు, భూమి లేని నిరుపేద వ్యవసాయ కూలీల పిల్లలకు ప్రత్యేకంగా 15% సీట్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు.

**వ్యవసాయాన్ని వాణిజ్యంగా మార్చాలి**

కేవలం వరి, సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా కందులు, నూనెగింజలు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కొడంగల్‌లో అతిపెద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వస్తున్నందున, రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ సదాశివరెడ్డి, శివకుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ మంజుల, కౌన్సిలర్ల రాజేష్ ఘాట్, రవి కుమార్ యాదవ్, భరత్, తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి బీసీ కాలేజ్ బాలుర హాస్టల్ వార్డెన్ నరేందర్ రెడ్డి సస్పెన్షన్

సన్నబియ్యం సరఫరా, స్టాక్ రిజిస్టర్లలో
అక్రమాలపై కలెక్టర్ చర్యలు
హాస్టల్ ఎంఎల్ఎస్ కేంద్రాల బియ్యం పక్కదారి
ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి

**వనపర్తి ప్రతినిధి (సింగిడి):** వనపర్తి ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర హాస్టల్‌లో సన్నబియ్యం సరఫరా, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ, బియ్యం స్వీకరణకు సంబంధించిన అంశాల్లో తీవ్రమైన అవకతవకలు ఉన్నట్లు అధికారిక విచారణలో గుర్తించి హాస్టల్ వార్డెన్ ఎస్. నరేందర్ రెడ్డిని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయడం స్వాగతించదగ్గ విషయమని బంజారా విద్యార్థి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్, పీడిఎస్యు రాష్ట్ర అధ్యక్షుడు కే. పవన్ కుమార్, బీసీ పొలిటికల్ ఫోరం స్టేట్ చైర్మన్ రాచాల యుగేందర్ గౌడ్ అన్నారు. ఈ నెల 8న కలెక్టర్ హాస్టల్‌లో రిజిస్టర్ల నిర్వహణ, ప్రభుత్వ బియ్యం స్వీకరణకు సంబంధించిన అవకతవకలపై విచారణ వివరాలు నమోదు అయ్యాయని చెప్పారు. అధికారిక విచారణలో పలు కీలక అంశాలు బయటపడ్డాయని చెప్పారు. హాస్టల్ స్టాక్ రిజిస్టర్ 17-08-2026 వరకు మాత్రమే నమోదు చేయబడి ఉన్నట్లు గుర్తించారని, స్టాక్ రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్ లను సక్రమంగా నిర్వహించకపోవడం, అప్‌డేట్ చేయకపోవడం గుర్తించారని వారు పేర్కొన్నారు. హాస్టల్ స్టోర్ రూమ్‌ను భౌతికంగా తనిఖీ చేయగా కేవలం 5.50 క్వింటాళ్ల బియ్యం మాత్రమే అందుబాటులో ఉన్నట్లు నమోదు చేశారన్నారు. టీఎస్ 33 టీ 4074 ట్రక్ చలాన్ ప్రకారం 25 క్వింటాళ్ల బియ్యం రవాణా చేసినట్లు రికార్డు ఉన్నప్పటికీ హాస్టల్ ఇండెంట్‌లో 46.34 క్వింటాళ్ల బియ్యం అవసరంగా చూపించారని చెప్పారు. ఇండెంట్‌లో పేర్కొన్న మొత్తం బియ్యం ఒకే లాట్‌లో హాస్టల్‌కు అందలేదని విచారణలో నమోదు చేశారని తెలిపారు. 13-08-2026న 15 క్వింటాళ్ల బియ్యం అందుకున్నట్లు పేర్కొన్నప్పటికీ విచారణ సమయంలో సంబంధిత రిసిప్ట్, రికార్డ్స్ సమర్పించలేక పోయారని వారు చెప్పారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఇచ్చిన వివరణను పరిశీలించిన అనంతరం స్టాక్, ఇష్యూ రిజిస్టర్లతో పోల్చగా వ్యత్యాసాలు ఉన్నాయని, వివరణ సంతృప్తికరంగా లేదని అధికారులు పేర్కొన్నారని వివరించారు. ఈ అంశాల నేపథ్యంలోనే వార్డెన్ ఎస్. నరేందర్ రెడ్డిని సస్పెండ్ చేసి తదుపరి శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్‌లో ఉంచాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ఇది కేవలం ఒక హాస్టల్‌కు పరిమితం కాకూడదని, ఒక హాస్టల్‌లోనే ఇలాంటి తీవ్రమైన రికార్డు వ్యత్యాసాలు బయటపడితే వనపర్తి జిల్లాలోని మిగతా బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో కూడా బియ్యం ఇండెంట్లు, ఎం.ఎల్.ఎస్ నుంచి డెలివరీలు, ట్రాక్ షీట్లు, చలాన్లు, స్టాక్ రిజిస్టర్లు, ఇష్యూ రిజిస్టర్లు, హాజరు రిజిస్టర్లు, మెస్ రికార్డులను సమగ్రంగా తనిఖీ చేయాలని శివ నాయక్, కే. పవన్ కుమార్, రాచాల యుగేందర్ గౌడ్ డిమాండ్ చేశారు

## ఎంఆర్‌జే సొంత నిధులతో రెండు బస్ షెల్టర్ల నిర్మాణానికి భూమిపూజ

ఊర్కొండలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ల నిర్మాణానికి శ్రీకారం

**జడ్చర్ల, (సింగిడి):** ప్రయాణికుల సౌకర్యార్థం జడ్చర్ల నియోజవర్గం ఉర్కొండ మండల కేంద్రంలో రెండు బస్ షెల్టర్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు, నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, కరాటే అసోసి యేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి (ఎంఆర్‌జే) తన సొంత నిధులతో ఈ రెండు బస్ షెల్టర్లను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. కోదాడ--రాయచూర్ 167వ జాతీయ రహదారిపై ఊర్కొండ మండల కేంద్రంలోని బస్ స్టేజీకి ఇరువైపులా సుమారు 150 అడుగుల దూరంలో ఈ బస్ షెల్టర్లను నిర్మించనున్నారు. ప్రయాణికులకు ఎండ, వర్షాల నుంచి రక్షణ కల్పించడంతో పాటు బస్సుల కోసం



వేచి ఉండే ప్రజలకు సౌకర్యంగా ఉండేలా వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తన సొంత నిధులతో బస్ షెల్టర్ల నిర్మాణాన్ని చేపడుతు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఊర్కొండ సర్పంచ్



మ్యాకల మంజుల శ్రీనివాసులు, లక్ష్మయ్య, లక్ష్మణ్ కుమార్ గౌడ్, కొమ్ము శ్రీను, సందీప్ కుమార్, రామకృష్ణ, శ్రీశైలం, కొండం సురేష్, ఆంజనేయులు, కిట్టు, అరుణ్, కృష్ణయ్య, హరీష్, నవీన్, తేజ, మాధవులు, చంద్రయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల పోరాటంపై

## ప్రభుత్వ నిర్బంధం ఆపాలి

ఆశా వర్కర్ల ఫిక్స్డ్ వేతనం పై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలోనే తీర్మానం చేయాలి.




**గద్వాల బ్యూరో (సింగిడి):** ప్రజాస్వామ్యంగా పోరాటం చేస్తున్న ఆశా వర్కర్స్ పై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలు ఆపాలని జ×ుఖ జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల పై రాష్ట్ర ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి, పాత బస్టాండ్ లో నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను అమలు చేయమని చలో అసెంబ్లీకి వెళ్లిన ఆశా కార్యకర్తలపై ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం ప్రకటించిన నిర్బంధాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళనకు పూనుకుంటే మహిళలను అని చూడకుండా, పోలీసులు ఇండ్ల దగ్గరికి వచ్చి ఆశా కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేశారని విమర్శించారు. చలో అసెంబ్లీ కి వెళ్లిన ఆశాలను మార్గ మధ్యలో బస్సులు, రైలు లో నుండి బలవంతంగా బయటకు దింపారని విమర్శించారు. అడ్డంకులను చేధిస్తూ వెళ్ళిన ఆశా కార్యకర్తలను సైతం అక్రమంగా అరెస్టు చేసి రాత్రి వరకు హైద్రాబాద్ లోని వివిధ పోలీస్ స్టేషన్ లలో మహిళలను నిర్బంధించారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలనే అమలు చేయాలని తాము కోరుతున్నామని కొత్త డిమాండ్లు ఏమి కోరడం లేదని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామిక హక్కులను ఉల్లంఘించి ఇబ్బందులకు గురి చేస్తూ అణచివేత విధానాలకు పాల్పడటం సరికాదన్నారు. తక్షణమే ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలోనే ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీ ప్రకారం ఫిక్స్డ్ వేతనం రూ. 18000 అమలు చేసి, అదనపు పని భారాలను తగ్గించాలని, ఆశాలకు పదోన్నతులు కల్పించాలని, లేని పక్షంలో మరో ఉద్యమానికి సిద్ధం అవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మ, సునీత, ఉపాధ్యక్షులు నర్సింగమ్మ, పద్మ, జయలక్ష్మి, ఆశాలు నాగ ప్రమీల, జయమ్మ, శ్రీదేవి, నాగమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్లలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై రాజకీయ పార్టీలతో సమావేశం

క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు అక్టోబర్ 7 వరకు.. తుది ఓటర్ల జాబితా నవంబర్ 9న

**జడ్చర్ల, (సింగిడి):** 75-జడ్చర్ల శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, అభ్యంతరాల స్వీకరణ, విచారణలు, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా దావాలు, అభ్యంతరాల స్వీకరణ గడువును 2026 అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. జారీ చేసిన నోటీసుల పరిష్కారం, దావాలు మరియు అభ్యంతరాలపై విచారణను నవంబర్ 5, 2026 వరకు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. తుది ఓటర్ల జాబితాను నవంబర్ 9, 2026న ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక సవరణ కార్యక్రమాల నిర్వహణ కోసం మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు అదనపు సహాయ ఓటరు నమోదు అధికారుల బాధ్యతలను అప్పగించినట్లు



తెలిపారు. ఇప్పటికే జారీ చేసిన నోటీసులు, పరిష్కరించిన దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న నోటీసులతో పాటు విచారణల పురోగతిని ఓటరు నమోదు అధికారి సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసులను సకాలంలో అందజేసి, నిర్ణీత గడువులోపు సంబంధిత కేసులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

**సెప్టెంబర్ 12, 13న ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా సెప్టెంబర్ 12, 13, 2026 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో రెండో విడత ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఓటర్లు తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవచ్చు. అవసరమైతే కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తు, ఓటరు పేరు తొలగింపుకు దరఖాస్తు, ఓటరు వివరాల్లో మార్పులు లేదా సవరణలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం సంబంధిత ప్రాంతీయ స్థాయి ఓటరు నమోదు సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ఏవైనా పొరపాట్లు, మార్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత దరఖాస్తుల ద్వారా సమర్పించాలని అధికారులు సూచించారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులను అధికారులు కోరారు.

జడ్చర్ల తహసీల్ కార్యాలయంలో

## కాళోజీ జయంతి


కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అధికారులు



**జడ్చర్ల, (సింగిడి):** ప్రముఖ కవి, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని జడ్చర్ల తహసీల్ కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జడ్చర్ల మండల తహసీల్దార్, జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాళోజీ నారాయణరావు తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించారని, తెలంగాణ భాషకు, సాహిత్యానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా అధికారులు కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్ కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పొందిన కొమ్ము శేఖర్ మాదిగ

**ఎల్బీ నగర్, (సింగిడి):** సామాజిక ఉద్యమంతో పాటు ఉన్నత విద్యలోనూ రాణించిన కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ నెల 8న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో యూనివర్సిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షతన, ముఖ్య అతిథిగా భారత్ బయోటెక్ ఫౌండర్, చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ కృష్ణ ఎల్లా హాజరయ్యారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం సమక్షంలో శేఖర్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్ వై. పార్థసారథి పర్యవేక్షణలో "కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ మునిసిపల్ కార్పొరేటర్స్ అండ్ కౌన్సిలర్స్ టువర్డ్స్ అర్బన్ గుడ్ గవర్నెన్స్; ఎ స్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై శేఖర్ పరిశోధన చేశారు. పట్టణ సుపరిపాలన దిశగా మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్ల సామర్థ్య నిర్మాణంపై ఆయన చేసిన విశ్లేషణాత్మక పరిశోధనకు డాక్టరేట్ లభించింది. సామాజిక న్యాయం కోసం మూడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్)లో శేఖర్ నాయకుడిగా ఎదిగారు. ఓయూ అధ్యక్షుడిగా, పలు జిల్లాల ఇన్‌చార్జిగా సేవలందిం చిన ఆయన ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం యర్కారం గ్రామానికి చెందిన కొమ్ము శేఖర్ మాదిగ, కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించిన కొమ్ము సరోజ-అంజయ్య దంపతుల కుమారుడు. చిన్నతనం నుంచే విద్యపై ఆసక్తి పెంచుకున్న ఆయన స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివారు. అనంతరం ఎల్బీనగర్‌లో పదో తరగతి, ఇబ్రహీంపట్నంలోని సోషల్ వెల్ఫేర్




రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేశారు. నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతున్న సమయంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్ర పోషించారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేసి, సామాజిక న్యాయ ఉద్యమంలో కొనసాగుతూనే పీహెచ్‌డీ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేశారు. డాక్టరేట్ పట్టా అందుకున్న సందర్భంగా తనకు స్ఫూర్తినిచ్చిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగతో పాటు తన పరిశోధనకు మార్గనిర్దేశం చేసిన ప్రొఫెసర్ వై. పార్థసారథి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధ్యాపకులు, సిబ్బందికి శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యను ఆయుధంగా చేసుకుని సామాజిక న్యాయ ఉద్యమంలో కొనసాగుతూ ఉన్నత విద్యలో డాక్టరేట్ సాధించిన కొమ్ము శేఖర్ మాదిగను ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

### మండల క్రీడల్లో అల్లీపురం జడ్పీహెచ్ఎస్ సత్తా

అండర్--17లో ప్రథమ స్థానం

**హుజూర్నగర్ (మఠంపల్లి) (సింగిడి):** మఠంపల్లి జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో జడ్పీ హెచ్ఎస్ అల్లీపురం బాలుర జట్టు అండర్--17 విభాగంలో ప్రథమ బహుమతి సాధించి సత్తా చాటింది. ఫైనల్ పోటీ ఏకపక్షంగా సాగగా, జడ్పీ హెచ్ఎస్ బీల్యానాయక్ తండ విద్యార్థులపై అల్లీపురం జట్టు ఈ ఏడాది క్రీడల్లోనే అత్యధిక పాయింట్లు సాధించి ఘన విజయం నమోదు చేసింది. ప్రారంభం నుంచి అద్భుతమైన ఆటతీరుతో ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించిన అల్లీపురం విద్యార్థులు చివరి వరకు అదే జోరును కొనసాగించారు. అల్లీపురం బాలుర క్రీడా ప్రదర్శనను వీక్షించిన క్రీడాభిమానులు ఆసక్తిగా తిలకిస్తూ విద్యార్థులను అభినందించారు. అండర్--17 విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## అన్యాయాన్ని ఎదిరించిన కాళోజీ కవిత్వం

ప్రజల భాషలో సాహిత్యం.. సామాజిక చైతన్యానికి కాళోజీ రచనలు స్ఫూర్తి: ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య





**జడ్చర్ల, (సింగిడి):** ప్రముఖ కవి, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని డా. బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), జడ్చర్లలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ జీవితం, సాహిత్యం, సామాజిక చైతన్యంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. సుకన్య మాట్లాడుతూ.. "అన్యాయాన్ని ఎదిరించినవాడు నాకు ఆరాధ్యుడు. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి" అని కాళోజీ పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలు మాట్లాడే సహజమైన భాషలోనే సాహిత్యం ఉండాలని కాళోజీ ఆకాంక్షించారని, అందుకే ప్రజల భాషలో తన కవిత్వాన్ని రచించి సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం కలిగించారని తెలిపారు.

**సామాజిక న్యాయం, మానవత్వం కాళోజీ కవిత్వానికి ప్రతిబింబం**

కార్యక్రమంలో ప్రధాన ప్రసంగం చేసిన డా. అగ్రహారం ఛందోజీ మాట్లాడుతూ.. కాళోజీ కవిత్వంలో సామాజిక న్యాయం, ప్రాంతీయ చైతన్యం, మానవత్వం ప్రధానంగా కనిపిస్తాయని అన్నారు. సమాజంలోని ధనిక--పేద అంతరా లను చూసి కాళోజీ ఆవేదన చెందారని, తన కవిత్వం ద్వారా సామాజిక వాస్తవాలను ప్రజల ముందుంచారని తెలిపారు. "సాగిపోవుటే బ్రతుకు.. ఆగిపోవుటే చావు" అనే కాళోజీ సందే శాన్ని గుర్తుచేస్తూ, మనిషి నిర్జీవంగా ఉండకుండా నిరంతరం చైతన్యంతో ముందుకు సాగాలని ఆయన సూచించారని వివ రించారు. "అక్షర రూపం దాల్చిన ఒక సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక" అనే భావాన్ని కాళోజీ తన రచనల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారని అన్నారు. ఆయన రచనలు సామాజిక చైతన్యా నికి, ప్రశ్నించే తత్వానికి ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు. కాళో జీ కవిత్వంలోని సామాజిక, మానవతా దృక్పథాలను విశ్లేషిం చిన డా. అగ్రహారం ఛందోజీ, కాళోజీపై తాను రచించిన కవితను విద్యార్థుల సమక్షంలో వినిపించారు. కాళోజీ కవిత్వం సమాజాన్ని మేల్కొలిపే శక్తిని కలిగి ఉందని, యువత ఆయన రచనల నుంచి సామాజిక బాధ్యత, మానవ త్వం, చైతన్య స్ఫూర్తిని పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మానికి డా. నర్సింహులు అధ్యక్షత వహించగా, డా. వెంకట య్య వ్యాఖ్యా తగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపా ల్ డా. శ్రీనివాసులు, అధ్యాపకులు నర్మద, రాఘవేంద్ర రెడ్డి, సదాశివయ్య, నర్సింగరావు, ఆంజనేయులు, మాధురి, ఇస్రత్ సుల్తానా, సులేమాన్, వెంకట్ రెడ్డి, శివుడు, నరసింహ, జ్యోతి నిర్మలా, సౌమ్య, నియాజుద్దీన్, రాజు తదితరులు పాల్గొన్నారు. సుమారు 200 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతులు సమీకృత వ్యవసాయ పద్ధతులను పాటించాలి

నాణ్యమైన విత్తనాలు, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులు సాధించాలి వ్యవసాయ అధికారి బి నాగజ్యోతి

**కోడేరు (సింగిడి):** సమీకృత వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ పంటల సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని కోడేరు మండల వ్యవసా య అధికారిబి నాగ జ్యోతి సూచించారు. కోడేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) వారి సౌజన్యంతో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో పలు వ్యవసాయ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పంటలలో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. వరి సాగులో ప్రభుత్వం సూచిం చిన 7 సన్న రకాల వరి వంగడాలను ప్రోత్సహిస్తూ, ఆయా రకాల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలు తీసుకున్న డీలర్ల వద్దనే ఆన్లైన్లో తీసుకున్నట్లు నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. అలాగే ఖీఖీా యాప్ వినియోగం, సమతుల్య ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షల



ఆధారంగా అవసరమైన ఎరువులను సరైన మోతాదులో వినియోగించాలని, అధికంగా ఎరువులు వాడటం వల్ల కలిగే నష్టాలను నివారించాలని తెలిపారు సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు వ్యవసాయం తో పాడి పశువుల పెంపకం, ఉద్యానవన పంటలు, కూరగా యల సాగు వంటి అనుబంధ కార్యకలాపాలను సమన్వయం చేసుకుని రైతులు అదనపు ఆదాయం పొందాలని ఆమె అన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మరియు ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో, అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకోవాలని, పంటల వైవిధ్యీకరణపై దృష్టి పెట్టాలని రైతులకు తెలియజేశారు. పంట కోత అనంతరం మిగిలే పంట వ్యర్థాలను కాల్చకుండా, వాటిని పొలంలోనే కుళ్లిపోయేలా చేసి సేంద్రియ పదార్థంగా మార్చుకోవాలని తెలిపారు. దీనివల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరగడంతో పాటు భూసారం మెరుగుపడు తుందని వివరించారు. అదేవిధంగా పంటలను పురుగులు మరియు తెగుళ్ల నుంచి రక్షించేందుకు సమగ్ర పురుగు మరియు తెగుళ్ల యాజమాన్య పద్ధతులు (ఖ్రావీ) పాటించాలని, పురుగు ఉధృతి మరియు ఆర్థిక నష్టం స్థాయిని పరిశీలించిన తరువాత మాత్రమే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సాంకేతిక సూచనలు పాటిస్తూ, ఆధునిక మరియు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## సులోచన పార్థివ దేహానికి కూన శ్రీశైలం గౌడ్ నివాళులు

**కుత్బుల్లాపూర్, (సింగిడి):** కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి మాతృమూర్తి సులోచన బుధవారం స్వర్గస్తులయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ బాచుపల్లిలోని వారి నివాసానికి చేరుకుని సులోచన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోలన్ హనుమంత్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. సులోచన మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.





## పవర్ బోర్ కు మరమ్మతులు చేయించాలని వినతి
### మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్



**మల్కాజిగిరి, (సింగిడి):** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఓల్డ్ మల్కాజిగిరి, హనుమాన్ వ్యాయామశాల వద్ద గత వారం రోజులు గా పవర్ బోర్ పనిచేయకపోవడం వల్ల వాటర్ వర్క్స్ డీ.జీ.ఎం బ్రహ్మ రెడ్డి కి తెలపడం తో వారి సిబ్బంది తో మరమత్తులు చేయిస్తుండగా బోర్ మోటార్ మధ్యలో ఇరుకపోవడం జరిగింది. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సూచనల మేరకు మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో సైనిక్ పురి లోని జీ ఎం సునీల్ ని కలిసి బోర్ మోటార్ ని త్వరగా మరమ్మతులు చేయించి కాలనీవాసులకు నీటి బోరును అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ వినతి పత్రం ను అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ గౌడ్ మాట్లాడుతూ బోరు సమస్యని జీ ఎం ద్రుష్టి కి తీసుకెళ్లగా, జీ ఎం సానుకూలంగా స్పందించి అతి త్వరలో బోరు ను అందుబాటు లోకి తెస్తామని తెలపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాలనీ వాసులు బాబయ్య గౌడ్, పండు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి బి బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా రొట్టెల ధరణ్ కుమార్



**మల్కాజిగిరి, (సింగిడి):** కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి బి బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రొట్టెల ధరణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చెన్నయ్య ల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ధరణ్ మాట్లాడుతూ తననునమ్మి అధ్యక్షుడుగా నియమించడానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్సీ, సామాజిక వర్గాల బలోపేతం కోసం పార్టీ పిలుపు ఆదేశాల మేరకు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి సూచనలతో ముందుకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గం ఇంచార్జి లక్ష్మీకాంత్ రెడ్డి, కాం గ్రెస్ మల్కాజిగిరి బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి బ్లాక్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.కె. శ్రీనివాస్, కాంగ్రెస్ మల్కాజిగిరి మీడియా కన్వీనర్ గుండె నిరంజన్, సత్యనారాయణ, జివిఎస్ సతీష్ కుమార్, పిట్టల శ్రీని వాస్, పిట్టల నాగరాజు, కపిలేశ్వర్, యూసుఫ్ బాయ్, తదితరులు పాల్గొన్నారు.

## జూపల్లిలో పోచమ్మ బోనాల వేడుకలు



**కల్వకుర్తి (సింగిడి):** చారకొండ మండలం జూపల్లి గ్రామంలో పోచమ్మ బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో జూపల్లి గ్రామ సర్పంచ్ అనూష జగపతి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు రాములు యాదవ్, జూపల్లి భాస్కర్ రావు, యువసేన అధ్యక్షుడు ఎండి సిరాజ్ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బోనాల వేడుకలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

### బోనాల పండుగ పోస్టర్ ఆవిష్కరణ చేసిన
## సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి




**కల్వకుర్తి (సింగిడి):** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో గురువారం, శుక్రవారం నిర్వహించనున్న బోనాల పండుగకు సంబంధించిన పోస్టర్లను గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలోని పోచమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించు కోవాలని కోరారు. బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు, యువకులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నూతన డిఈని సన్మానించిన
## 1104 యూనియన్ నాయకులు



**నారాయణపేట ప్రతినిధి, (సింగిడి):** నారాయణపేట జిల్లాలో నూతన డిఈ గా శ్రీనివాస్ బుధవారం భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక విద్యుత్ శాఖ 1104 యూనియన్ సర్కిల్, డివిజన్ నాయకులు శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో డిఈ శ్రీనివాస్ మాట్లాడుతూ నారాయణపేట ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, అలాగే అంతరాయం లేకుండా విద్యుత్ అందించటం లో సిబ్బంది తో కలిసి పని చేస్తానని చెప్పారు. ఈ కార్యక్ర మంలో 1104 సర్కిల్ అధ్యక్షుడు అధ్యక్షుడు పోలెమోని గోవింద్ రాజు, సెక్రటరీ మొగులప్ప, డివిజన్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, సర్కిల్ వర్కింగ్ ప్రెసి డెంట్ నూనె రఘు , అడిషనల్ సెక్రటరీ రవీంద్ర చారి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్ నాయాక్ , డివిజన్ అడిషనల్ సెక్రటరీ మహేష్ గౌడ్, నజీర్ అహ్మద్, యాసిన్ పాషా, హర్షద్, జంగిటి మల్లేష్, ప్రవీణ్ ,భీమప్ప, మన్యం ,రమేష్, ఆర్టిజన్ జె. వెంకటేష్, మైనోద్దిన్ పాల్గొన్నారు.

# తక్కువ ధరలకే వైద్య పరీక్షలు అందించాలి : ఎమ్మెల్యే
### ఆమనగల్లులో కార్తికేయ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం..

**ఆమనగల్లు, (సింగిడి):** ఆమనగల్లు పట్టణంలో అత్యాధునిక పరికరాలతో మాజీ ఎంపిపి అన్నేపాక జంగయ్య కుమారుడు అన్నేపాక శేఖర్ ఏర్పాటు చేసిన కార్తికేయ డయాగ్నస్టిక్ సెంటర్ను బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ సూదిని రాంరెడ్డి, నిర్వాహకులు తో కలిసి ప్రారంభించారు. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరలకే ఆరోగ్య పరీక్షలు చేయాలని నిర్వాహకులను కోరారు. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే అన్ని



రకాల పరీక్షలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామని శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో



మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# కిషోర బాలికల ఆరోగ్య పోషణపై ప్రత్యేక దృష్టి
### జిల్లా కలెక్టరేట్లో 9వ పోషణ్ మహా పోస్టర్ ఆవిష్కరణ. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్ కలెక్టరేట్, (సింగిడి):** పోషకాహారం... ఆరోగ్యకరమైన భవిష్యత్తే పోషకాహార లక్ష్యమని గర్భిణీలు బాలింతలు, చిన్నారులు కిశోర బాలికల ఆరోగ్య పోషణకై ప్రత్యేక దృష్టి సారించామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపా రు. ప్రజల్లో పోషకాహారం ఆరోగ్యం పరిశుభ్రత ఆరోగ్య కరమైన జీవన విధానంపై విస్తృతమైన అవగాహన కల్పించాలని ఉద్దేశంతో 9వ పోషణ్ మహా కార్యక్రమాలను సెప్టెంబర్ 9వ తేదీ నుండి అక్టోబర్ 8వ తేదీ వరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవా రం ఐడిఓసి కాంప్లెక్స్ లో జిల్లా కలెక్టర్ తొమ్మిదవ పోషణ్ మహా పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ నెల రోజులపాటు జిల్లాలోని 793 అంగన్వాడీ కేంద్రాల పరిధిలో వివిధ అవగాహన సామాజిక భాగస్వామ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ముఖ్యంగా బాలింతలు చిన్నారులు కిశోర బాలికలు, గర్భిణీ స్త్రీలు మహిళల ఆరోగ్య పోషణ పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పోషకా హార లోపం రక్తహీనత నివారణ బాలింతల ఆరోగ్యం చిన్నారుల ఎదుగుదల శిశువులకు సరైన పోషణ అనుబంధ ఆహారం వ్యక్తిగత పరిశుభ్రత పారిశుద్ధ్యం ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై ప్రజలలో విస్తృతమైన అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పోషకాహారం ఆరోగ్యం ఆరోగ్యకరమైన భవిష్యత్తు అనే సందేశాన్ని ప్రతి కుటుంబానికి చేరవేసే విధంగా సంబంధిత శాఖల సమన్వయంతో తొమ్మిదవ పోషణ మహా కార్యక్రమం విజయవంతంగా నిర్వహిం చనున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## డిజేల శబ్దాన్ని అడ్డుకోవాలి
### నిబంధనలు ఉల్లంఘించే సౌండ్ సిస్టంలను జప్తు చేయాలి
### –టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా

**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** ఉత్సవాలు, ఊరేగింపుల పేరుతో మితిమీరిన శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న డీజే సౌండ్ సిస్టమ్‌లపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జన సమితి వనపర్తి జిల్లా అధ్యక్షుడు యంఏ. ఖాదర్ పాషా డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో డీజేల వినియోగం వల్ల శబ్ద కాలుష్యం పెరిగిపోతోం దని, ముఖ్యంగా రాత్రివేళల్లో అధిక శబ్దాల కారణంగా వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర




ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను ఉల్లంఘిస్తూ డీజేలు నిర్వహిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు అతిక్రమించి డీజే సౌండ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసే నిర్వాహకులపై కేసులు నమోదు చేయడంతో పాటు, ఆయా సౌండ్ సిస్టమ్‌లను వెంటనే జప్తు చేయాలని ఖాదర్ పాషా డిమాండ్ చేశారు. సంస్కృతి, సంప్రదాయాల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలిగించే స్థాయిలో శబ్ద కాలుష్యాన్ని సృష్టించడం సమంజసం కాదన్నారు. ప్రజా ఆరోగ్యం, ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని మైక్ సెట్లు, సాంప్రదాయ వాయిద్యాల వినియోగాన్ని కూడా చట్టబద్ధమైన శబ్ద పరిమితులకు లోబడి అనుమతించాలని ఆయన సూచించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం తక్షణమే స్పందించి శబ్ద కాలుష్యంపై కఠిన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఖాదర్ పాషా హెచ్చరించారు.

# కాంగ్రెస్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం
### చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు..

**అమరచింత, (సింగిడి):** మక్తల్ నియోజ కవర్గ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజకీయ ప్రత్యర్థులపై విధానపరమైన విమర్శలు చేయడంలో అభ్యంతరం లేదని, అయితే వ్యక్తిగత దూషణలకు దిగడం, నాయకుల గౌరవాన్ని కించప రిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు తమ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లా డుతూ.. చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రజల మధ్య ఉంటూ నియోజకవర్గ సమస్యలపై తన గళాన్ని వినిపిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి, ఎన్నికల హామీల అమలు వంటి అంశాలపై ప్రశ్నలు లేవనెత్తిన పుడు వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత పాలకప క్షంపై ఉందన్నారు. అయితే సమస్యలపై సమాధానం ఇవ్వకుండా ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత విమర్శలకు



దిగడం రాజకీయ అసహనానికి నిదర్శనమని విమర్శించారు. హామీల అమలుపై సమాధానం చెప్పాలిప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీల అమలు, నియోజకవర్గ అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రతిపక్షాలు ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రజా సమస్యలపై నిలదీసే గొంతులను అణచివేసే ప్రయత్నాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. వ్యక్తిగత విమర్శలతో అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించలేరని అన్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థులను విమర్శించేటప్పుడు హుందాతనం, సంయమనం పాటించాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. నాయకుల వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం రాజకీయ సంస్కృతికి మంచిది కాదని హితవు పలికారు. భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రజా సమస్యలు, విధానాలు, పాలనా వైఫల్యాలపైనే చర్చ జరగాలని వారు కోరారు.

చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు వెంటనే వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే ప్రజాస్వామ్య పద్ధతిలో కాంగ్రెస్ నాయకుల తీరును ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు. అవసరమైతే ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ శంకరమ్మ బాలరాజు, మాజీ వైస్ ఎంపీపీ కోటేష్, మాజీ కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్ల రామకృష్ణ, మాజీ కోఆప్షన్ సభ్యులు రియాజ్ అలీ, గోపాన్‌పేట్ మాజీ సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు గోపాల్‌రెడ్డి, శేఖర్, కర్రె శ్రీను, రాజ్ కిరణ్, రవి, మాసుమ్, తోట రవి, సాదిక్, అశోక్, ఖజా, దావీద్, పాండు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
### ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలతో సన్మానం

**రాజేంద్రనగర్, (సింగిడి):** రాజేంద్రనగర్ మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి, జిల్లా మండల స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి దుర్గా కన్వెన్షన్ హాలులో ఉపాధ్యాయ దినోత్సవ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ. ఉపాధ్యా యులు సమాజానికి నిజమైన దిక్సూచి అని, వారికి సమాజంలో ఎనలేని గౌరవం ఉందని కొనియాడారు. విద్య అంటే తనకు ఎంతో ఇష్టమని, సమాజ నిర్మాణం లో ఉపాధ్యాయుల కృషి అపారమైనదని చెప్పారు. అనంతరం జిల్లా మరియు మండల ఉత్తమ ఉపాధ్యా యులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఎంఈఓ శంకర్ రాథోడ్, జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్, టీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, శ్రీనివాస్, సాగర్. ఎస్టీయూ మండల నాయకులు వెంకటయ్య, ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు జనార్దన్ చారి. తపాస్




అధ్యక్షుడు బాలకృష్ణ. ఉర్దూ మీడియం అసోసియేషన్ నాయకులు దస్తగిరి, ఖాలేద్. స్వీట్ మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి యాదగిరి, మహేష్. ప్రైవేట్ పాఠశాలల సంఘం ప్రతినిధులు ప్రభాకర్ చారి, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, బాబురావు. సుమారు 300 మంది మండల ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది భిక్షపతి, ముస్తఫా, రమేష్, శివరాజ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డిసి లక్ష్మారెడ్డి



**రాజేంద్రనగర్, (సింగిడి):** వినాయక నిమజ్జనోత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో సర్కిల్ డిసి లక్ష్మారెడ్డి బుధవారం వివిధ చెరువులు, బేబీ పాండ్స్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. నెక్నాంపూర్ బేబీ పాండ్, కొత్త చెరువు,



కోకాపేట జన్వాడ లేక్ ప్రాంతాలను సందర్శించిన ఆయన, నిమజ్జనం నిమిత్తం చేపడుతున్న పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. **నెక్నాంపూర్ బేబీ పాండ్:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన బేబీ పాండ్‌లో నీటి మట్టం, క్రేన్ల అమరిక లైటింగ్ వ్యవస్థను పరిశీలించారు. **కొత్త చెరువు , కోకాపేట:** భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఘాట్ల వద్ద బారికేడింగ్, పారిశుధ్య నిర్వహణను వేగవంతం చేయాలని ఆదేశించారు. **జన్వాడ లేక్:** విగ్రహాల నిమజ్జనం సజావుగా సాగేందుకు అవసరమైన రక్షణ చర్యలు, ఈతగాళ్ల ఏర్పాటుపై అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరా, తాగునీరు, ప్రాథమిక వైద్య సదుపాయాలు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు నిరంతరం అందుబా టులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని డిసి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇ సంజయ్ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు విజ్ఞాన కేంద్రానికి భూమి పూజ

**నారాయణపేట ప్రతినిధి, (సింగిడి):** :నారాయణపేట మండలం లింగంపల్లి గ్రామ శివారులో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ప్రియాంక, ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, గ్రామ సర్పంచి భాగ్యతో కలిసి బుధవారం భూమి పూజ నిర్వహించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యాన పంటల సాగు, అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కుంభం శివ కుమార్ రెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డా. ఎం. యాకాద్రి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, మార్కెట్



### నూతన ఏసీపీ రవీందర్ రెడ్డికి
## ఘన సన్మానం
### పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించిన చిలుక ఉపేందర్ రెడ్డి



**ఎల్‌బీనగర్, (సింగిడి):** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన రవీందర్ రెడ్డిని రంగారెడ్డి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుర ఉపేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ రవీందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎల్‌బీనగర్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగస్వామి గౌడ్, అక్బర్, దుబ్బాక శేఖర్, కిరణ్, మహమ్మద్, ఎల్లన్న, నబీ, సురేందర్, సుదర్శన్, షఫీ, శ్రీశైలం, పటేల్, రాజు, విప్లవ్, రఘునందన్, లక్ష్మణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు అండగా పాపిశెట్టి రాము



**కల్వకుర్తి (సింగిడి):** వెల్దండ మండలం రాఘయపల్లి గ్రామానికి చెందిన సామ రాములు ప్రమాదవ శాత్తు గాయపడడం జరిగింది. గ్రామ ఉప సర్పంచ్ కొండల్ యాదవ్ ద్వారా విషయాన్ని తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు పాపిశెట్టి రామన్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారి కుటుంబానికి భరోసాని కల్పించడం జరిగింది. ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటానని ధైర్యాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్ బి లక్ష్మీపతి గ్రామస్తులు రాములు సామ ఈదన్న సామరాజు తదితరులు పాల్గొన్నారు

### రాజేంద్రనగర్ గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై
## అధికారుల పర్యవేక్షణ



**రాజేంద్రనగర్, (సింగిడి):** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హనుమాన్ నగర్ పత్తికుంట వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను బుధవారం జీహెచ్ఎంసీ అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు సంయుక్తంగా పరిశీలించారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ నరేందర్ గౌడ్, డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఎస్ ఈ సత్యనారాయణ రెడ్డి, డిఈ యాదయ్య తదితర అధికారులు నిమజ్జన ఘాట్ వద్ద జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తికుంట వద్ద చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తయిన టెండర్ల పురోగతిని అధికారులు సమీక్షించారు. భక్తులకు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ దీపాలు, రక్షణ చర్యలు, తాత్కాలిక రహదారుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్ బ్రహ్మంకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వై. శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి. బాబురావు, ఈ. వేణుగోపాల్ పలువురు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌పై
## ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు గందరగోళం
### సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆగ్రహం

**నారాయణ పేట ప్రతినిధి (సింగిడి):** గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకురావాలని భావిస్తున్న కొత్త నిబంధనలు సర్పంచులను మరింత ఇబ్బందులకు గురిచేసే విధంగా ఉన్నాయని సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గవినోళ్ల శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేయకుండా, సర్పంచ్ సంతకం చేసిన తర్వాత వారం రోజుల్లోపు ఉప సర్పంచ్ తప్పనిసరిగా సంతకం చేయాలని, అలా చేయని పక్షంలో సర్పంచ్ జిల్లా కలెక్టర్ ద్వారా ప్రొసీడింగ్స్ తీసుకొని నిధులు డ్రా చేసుకునే విధానం తీసుకురావాలని ప్రభు త్వం యోచిస్తున్నట్లు తెలుస్తోందని ఆయన అన్నారు. ఇది సమ స్యకు పరిష్కారం కాదని, సర్పంచులను మరింత ఇబ్బందులకు గురిచేసే చర్య మాత్రమేనని గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు. ప్రజ లు ఎన్నుకున్న సర్పంచ్ ఒక చెక్కు కోసం వారం రోజుల పాటు ఉప సర్పంచ్‌ను అడుక్కోవాలా? వారం రోజుల తర్వాత జిల్లా కలెక్టర్‌ను అడుక్కోవాలా? ఇదేనా సర్పంచ్‌ల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవం?" అని ఆయన ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాల్సిన సర్పంచ్‌లకు ప్రతి విషయంలోనూ అడ్డంకులు సృష్టించడం వల్ల గ్రామ పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన అన్నారు. ప్రజలు ఎన్నుకున్న స్థానిక ప్రజాప్రతినిధులకు నిధుల వినియోగంలో స్పష్టమైన అధికారాలు, బాధ్యతలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ విషయంలో సమస్యలు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తే, సర్పంచ్‌లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్పష్టమైన, శాశ్వతమైన పరిష్కారం చూపాలని గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కొత్త నిబంధనల పేరుతో సర్పంచ్‌లను అధికారుల చుట్టూ తిప్పే విధానాన్ని తీసుకురావద్దని ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచ్ అంటే ప్రజలు ఎన్నుకున్న గ్రామ నాయకుడు. గ్రామ అభివృద్ధికి బాధ్యత వహించే సర్పంచ్‌ను ప్రతి చిన్న పనికీ ఇతరుల అనుమతి కోసం తిరిగే పరిస్థితిలోకి నెట్టడం సరికాదన్నారు. గ్రామ పంచాయతీల్లో పరిపాలన సజావుగా సాగేందుకు ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని రూపొందించాలి అని గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం ఉప సర్పం చ్‌ల చెక్ పవర్ విషయంలో సర్పంచ్‌లకు ఇబ్బంది కలగకుండా, గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి ఆటంకం లేకుండా తక్షణమే తగిన నిర్ణయం తీసుకోవాలని సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గవినోళ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.



సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం
10-9-2026

## దళిత స్పీకర్‌ను అవమానించడం హేయమైన చర్య

### ప్రజా సంఘాల ఖండన



**అమరచింత,(సింగిడి):** దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కులం పేరుతో దూషిస్తూ, వారి తల్లిని అవమానించడం, మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించడం హేయమైన చర్యని బుధవారం అమరచింతలో ప్రజా సంఘాల నాయకులు ఖండించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు ఎస్. అజయ్, ఎం పి ఎస్ మండల అధ్యక్షులు అజ్జపాగు ప్రశాంత్ కుమార్, కెవిపిఎస్ మండల నాయకులు ఏ. నేపోల్ మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీలో దళిత స్పీకర్ ను బండ బూతులు తిట్టిన ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్ రెడ్డిలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓ దళితుడు అత్యున్నతమైన స్పీకర్ పదవిని అధిష్టించడం జీర్ణించుకోలేని అగ్రకుల పెత్తందారీ అహంకారంతోనే వారు కులం పేరుతో దూషించారని విమర్శించారు. అసెంబ్లీ సెషన్ వరకు మాత్రమే సస్పెండ్ చేయడం కాకుండా వారి ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరారు. తెలంగాణ అసెంబ్లీ ప్రజా సమస్యలపై చర్చించేందుకు కాకుండా తిట్టుకోవడానికి వేదికగా మారిందని, అధికార, ప్రతిపక్షాలు బూతులు మాట్లాడడం పక్కనపెట్టి అభివృద్ధిపై చర్చ చేపట్టి ప్రజా సమస్యలు పరిష్కరించాలని హితవు పలికారు. తాత మధు, నవీన్ రెడ్డిల సభ్యత్వం పూర్తిగా రద్దు చేసే వరకు ప్రజా సంఘాలుగా పోరాటాలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసు ప్రవర్తనపై విచారణ జరిపి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అమరచింత మండల కార్యదర్శి ఆర్.ఎన్. నాగరాజు, దైవలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా పాలనలో ప్రజలను

## నిర్బంధించడం అన్యాయం

### సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.ఎన్. రమేష్




**అమరచింత,(సింగిడి):** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగితే అరెస్టు చేస్తారా అని, ప్రజా పాలనలో ప్రజలను నిర్బంధించడం అన్యాయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.ఎన్. రమేష్ ప్రభుత్వాన్ని విమర్శించారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ధర్నా సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్లను, సిఐటియు నేతలను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేయడాన్ని ఖండిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్త నిరసనకు పిలుపునిచ్చారు. అందులో భాగంగా అమరచింత మండల కేంద్రంలో బుధవారం అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రూ. 18,000 ఫిక్స్డ్ వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరు నెలల పీఆర్సీ ఏరియర్స్, లెప్రసీ సర్వే, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, ఎన్సిడి ఆన్‌లైన్, స్పూటం డబ్బాల మోత, ఏఎంసి, పిఎంసి టార్గెట్స్ రద్దు చేయాలని, ఆదివారం, పండుగ సెలవులు, ఏడాదికి 20 క్యాజువల్ సెలవులు, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు, ఏఎన్ఎం జిఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్స్ కల్పించాలని ఆగస్టు 14న ప్రజావాణిలో ఇచ్చిన వినతిపత్రంలోని డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే హామీలు అమలు చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా, కార్మిక ఉద్యమాలను కలుపుకొని హక్కులు సాధించే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బుచ్చన్న, ఆశా జిల్లా నాయకురాలు సంధ్య, సుజాత, జయరాణి, సునీత, మేరీ, సుశీల, రషీదా, నర్మదా, ఐలినా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

### కాళోజీ సేవలను స్మరించుకున్న ఆమనగల్లు డిగ్రీ కళాశాల



**ఆమనగల్లు,(సింగిడి):** ఆమనగల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఆచార్య శ్రీపాద శార్వాణి అధ్యక్షతన తెలుగు విభాగం ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూల మాలలు వేసి తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకు న్నారు. ప్రజా కవి కాళోజీ సేవలు చిరస్మరణీయమని, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆయన గళం విప్పారని ప్రిన్సిపాల్ కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు శ్రీవాణి , అధ్యాపకులు గోపాల్, రాజు, నవనీత, హరీష్, శివయ్య, వికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

### కడ్తాల సాయిబాబా ఆలయంలో

## లలితా పరాశక్తి మాత లక్ష పుష్పార్చన



**ఆమనగల్లు,(సింగిడి):** రంగారెడ్డి జిల్లా కడ్తాల పట్టణంలోని సాయిబాబా ఆలయంలో శ్రీ శ్రీ శ్రీ లలితా పరాశక్తి మాత రెండవ వార్షికోత్సవం సందర్భంగా లక్ష పుష్పార్చన మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగింది. వేద మంత్రోచ్చారణల నడుమ పండితులు లక్ష పుష్పాలతో అమ్మవారిని అర్చించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, లీలా లక్ష్మారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంప వెంకటేష్ గుప్తా గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వచ్చిన భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమంలో స్త్రీ శక్తి లలిత ఆధ్యాత్మిక బృందం నిర్వాహకురాలు జ్ఞాన ప్రసూన శర్మ, సభ్యులు పరమేశ్వరి, విజయ, శ్రీదేవి, చాట్ల విజయమ్మ, బాచిరెడ్డి విజయమ్మ, భారతి, గంప అండాలు, వరలక్ష్మి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు అమృతం పాండు, నార్ల కంటి మహేష్, ఆదివాసి సంఘం అధ్యక్షుడు శ్రీశైలం ఆదివాసి, పెద్ద ఎత్తున భక్తులు, గ్రామ ప్రజలు పూజలో పాల్గొన్నారు.

# పెబ్బేరు బీఆర్‌ఎస్‌లో అంతర్గత విభేదాలు!




**పెబ్బేరు,(సింగిడి):** పెబ్బేరు మండలంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షుల పదవుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. పట్టణ పార్టీ అధ్యక్షుడిగా దిలీప్‌కుమార్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడిగా వనం రాములు కొనసాగుతున్నారని ఒక్క వర్గం పేర్కొంటుండగా వారి పదవీకాలం ఇప్పటికే ముగిసిపోయిందని మరో వర్గం వాదిస్తోంది. దీంతో పార్టీ పదవులపై స్పష్టత కొరవడిన పరిస్థితి నెలకొంది. పట్టణ పార్టీ అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తాము ఇప్పటికీ అదే హోదాల్లో కొనసాగుతున్నామని తెలిపారు. పార్టీ కార్యక్రమాలను పట్టణ, మండల అధ్యక్షుల ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సూచనల మేరకు తాము తమ హోదాల్లో కొనసాగుతూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు సంబంధించిన వార్తల్లోనూ తమను అదే హోదాలతో పేర్కొనాలని మీడియా ప్రతినిధులను కోరారు. ఈ విషయంలో ఎవరికైనా సందేహాలు ఉంటే మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అయితే దీనికి భిన్నంగా పార్టీలోని కొందరు నాయకులు వాదిస్తున్నారు. పట్టణ, మండల పార్టీ అధ్యక్షుల పదవీకాలం ఎప్పుడో ముగిసిపోయిందని వారు పేర్కొంటున్నారు. పదవీకాలం పూర్తయినప్పటికీ అదే హోదాలను పయోగించుకోవడం సముచితం కాదని అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని పలువురు పార్టీ నాయకులు ప్రస్తుత పరిస్థితుల్లో తమను పార్టీ నాయకులుగానే పేర్కొంటున్నారని, పెబ్బేరు మండలంలో మాత్రం పదవీకాలం పూర్తయిన హోదాలను కొనసాగిస్తున్నట్లు చెప్పడం, వాటినే వార్తల్లో ప్రస్తావించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షుల పదవులు ప్రస్తుతం అధికారికంగా కొనసాగుతున్నాయా లేదా వారి పదవీకాలం ముగిసిందా అనే అంశంపై పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వార్తా కథనం ప్రచురణకు సంబంధించి పట్టణ పార్టీ అధ్యక్షుడు మీడియా ప్రతినిధులను ఫోన్‌లో సంప్రదించి తమ పదవులు కొనసాగుతున్నాయని స్పష్టం చేసినట్లు సమాచారం. పార్టీ పదవులకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు, నియామక ప్రకటనలు లేదా పార్టీ అధిష్ఠానం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడితేనే ఈ వ్యవహారంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు ఇరువర్గాల వాదనలు కొనసాగుతుండటంతో పెబ్బేరు బీఆర్ఎస్ వర్గాల్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

## మురికి కాలువలు లేక.. రోడ్డుపై మురికినీటి ప్రవాహం



**శ్రీరంగాపూర్,(సింగిడి):** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని పసుల కాలనీలో, శ్రీ రంగనాయక యాదవ్ కమిటీ హాల్ పరిసర ప్రాంతాల్లో మురికి కాలువలు లేక మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో కాలినడకన వెళ్లే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువల నిర్మాణం చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.





# కేసీఆర్‌ను టచ్ చేస్తే ఊరుకునేది లేదు.

### వీర్లపల్లి శంకర్‌పై కేసు నమోదు చేయాలి : తొగుట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బి ఆర్ ఎస్ శ్రేణులు



**తొగుట (సింగిడి):** కేసీఆర్ మరణాన్ని కోరుకునే విధంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ తొగుట మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి తీవ్రంగా ఖం డించారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతో కలిసి తొగుట ఎస్ఐ వి. నవీన్‌ను కలిసి ఫిర్యాదు చేసి, ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ విమర్శలు చేయడం వేరు. ఒక నాయకుడి మరణాన్ని కోరుకోవడం వేరని ఆయన అన్నారు. ప్రజా ప్రతినిధిగా ఉన్న ఎమ్మెల్యే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తీవ్ర బాధ్య తారాహిత్యమని మండిపడ్డారు. తెలంగాణ కోసం పోరాడిన కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తించే అవకాశం ఉందని పేర్కొన్నారు. సంబంధిత వీడియోలు, సోషల్ మీడియా పోస్టులను పోలీసులు పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు. ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి, వర్తించే చట్టాల ప్రకారం వీర్లపల్లి శంకర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత దూషణలకు దిగడం చేతగానితనానికి నిదర్శనమని సొసైటీ చైర్మన్ కే హరికృష్ణా రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్‌ను అవమానించే ప్రయత్నాలను బీఆర్ఎస్ శ్రేణులు ప్రజాస్వామ్య పద్ధతిలో గట్టిగా ప్రతిఘటిస్తాయని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్సీ ల మీద చర్యలు తీసుకున్న స్పీకర్, మరి ఎమ్మెల్యే మీద ఎందుకు చర్యలు తీసుకోవ డం లేదని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు చిలువేరి మల్లారెడ్డి, సర్పంచ్‌లు బక్క కనకయ్య, పన్యాల ప్రవీణ్ రెడ్డి, కోల వెంకటస్వామి గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, నాయకులు సుతారి రమేష్, ఐలయ్య, నర్సోట్టి మల్లేశం, అరుణ్ కుమార్, రాజిరెడ్డి, బండారు స్వామి గౌడ్, కర్ణాకర్ తదితరులు ఉన్నారు.

## పట్టుగూళ్ళకు మంచి డిమాండ్ ఉంది

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి : రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ లత





**తొగుట (సింగిడి):** ప్రస్తుతం పట్టుగూళ్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మల్బరి సాగు చేయాలని రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ లత చెప్పారు. నా పట్టు నా అభిమానం 2.0 కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ సిల్క్ బోర్డు ఆధ్వర్యంలో బుధవారం తొగుట మండలం పెద్ద మాసాన్ పల్లి గ్రామ రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ రంగంలో రైతులు ఆర్థికంగా ఎదగడానికి మల్బరీ సాగు ఇప్పుడు మంచి లాభదాయకమైన పంట అని చెప్పారు. దీన్ని మించిన పంట మరొకటి లేదన్నారు. పట్టుపురుగుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఉన్నందు వల్ల రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని తెలిపారు. శాస్త్రవేత్తలు మల్లికార్జున్, రాఘవేంద్ర, జిల్లా నోడల్ ఆఫీసర్ తిరుపం రెడ్డి , జిల్లా అధికారి సామల ఐలయ్యలు మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ రంగంలో పట్టు సాగు లాభాల పంట అని చెప్పారు. ఆకు నాణ్యత, షెడ్డు క్లీనింగ్, రోగనిరోధక చర్యలు, సేంద్రీయ ఎరువులతో మల్బరీ సాగు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తొగుట మండలంతో పాటు జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

## మార్చాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తలసాని వెంకట చల్మారెడ్డి





**కల్వకుర్తి,(సింగిడి):** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్య క్షుడు బెక్కెర బాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజర య్యారు. మాజీ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శేషి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తలసాని వెంకట చల్మ రెడ్డిని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు చల్మ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మ కంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులు, కార్యక ర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ నిజా ముద్దీన్, తలసాని లక్ష్మారెడ్డి, సుధాకర్ రెడ్డి, వార్డు సభ్యులు సందడి పర్వత్ రెడ్డి, మొహమ్మద్ సికిందర్,ఆదిరాల యాద య్య,అనురాధ జంగయ్య గౌడ్,ఆవ తిరుపతయ్య, మార్చా ల శ్రీశైలం, దున్న భాస్కర్, దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు మార్గాల రవి, మాజీ వార్డు సభ్యులు ఆదిరాల వెం కటయ్య, తాండ్ర వెంకటయ్య, బాలకృష్ణయ్య గౌడ్, దున్న రామానుజన్ , మేకల పాండు, పోలే రవి, మేకల స్వామి, కురుమయ్య, రామస్వామి, ఆనంద్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు వెంకటయ్య గౌడ్, రామచంద్ర య్య గౌడ్, ఇర్ఫాన్ సిద్ధిఖీ, ప్రేమ్ కుమార్, మధు కల్యాణ్, మోటపురం సందీప్, ఓర్సా శశిధర్, కొత్తోళ్ల చెన్నయ్యా, బర్రె కృష్ణయ్య, అవ రవి, బర్రె యాదయ్య,రామ్ రెడ్డి,ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, మోటపురం రవి, వట్టేపు రమేష్, ఓబులేష్, దేవదానం పాల్గొన్నారు.

## కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల ఛలో హైదరాబాద్‌కు తరలిరండి

### వేతనాల పెంపు.. నైట్ డ్యూటీల రద్దు.. వీక్లీ ఆఫ్ అమలు చేయాలి



**అమరచింత,(సింగిడి):** కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్ల వేతనాలు పెంచాలని, జాబ్ చార్ట్‌కు భిన్నంగా కేటాయించిన నైట్ డ్యూటీలను రద్దు చేయాలని, వారానికి ఒక రోజు సెలవు (వీక్లీ ఆఫ్) అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11న ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధ్యక్షులు సి. రాజు తెలిపారు. ఈ సందర్భంగా అమరచింత, ఆత్మకూర్, మదనపూర్ కేజీబీవీ హాస్టళ్లలో కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్రంలో 495 కేజీబీవీలు కొనసాగుతుండగా, వాటిలో 403 కేజీబీవీలు ఇంటర్ వరకు పొడిగించబడ్డాయని రాజు తెలిపారు. కేజీబీవీల్లో వంట మనుషులు, స్కావెంజర్లు, స్వీపర్లు, వాచ్ ఉమెన్లు, అటెండర్లు జాబ్ చార్ట్‌కు మించి విధులు నిర్వహిస్తున్నప్పటికీ వీక్లీ ఆఫ్ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంప్యూటర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లను పార్ట్‌టైం పేరుతో నియమించి ఫుల్‌టైం పని చేయిస్తున్నారని, వారికి ఫుల్‌టైం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కూల్, కాలేజీ కేజీబీవీల్లో ఏఎన్ఎంలపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించి, కాలేజీ ఉన్న కేజీబీవీల్లో అదనంగా మరో ఏఎన్ఎంను నియమించాలని కోరారు. ఇప్పటికే అధిక పనిభారం ఉన్న అకౌంటెంట్లు, వర్కర్లకు నైట్ డ్యూటీలు కేటాయించడం అన్యాయమని, వాటిని వెంటనే రద్దు చేయాలని అన్నారు.

**వేతనాల్లో భారీ వ్యత్యాసం**

తెలంగాణలో కేజీబీవీ అకౌంటెంట్లు, ఏఎన్ఎంలకు నెలకు రూ. 14,300, ఇతర నాన్ టీచింగ్ సిబ్బందికి రూ. 7,800 నుంచి రూ. 9,750 వరకు మాత్రమే వేతనాలు అందుతున్నాయని రాజు తెలిపారు. అదే ఆంధ్రప్రదేశ్‌లో అకౌంటెంట్, ఏఎన్ఎంలకు రూ. 17,755, ఇతర సిబ్బందికి రూ. 14,203 వరకు వేతనాలు అందుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ గురుకులాల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ. 15,600 నుంచి రూ. 24,000 వరకు వేతనాలు అందుతున్నాయని, కేజీబీవీ సిబ్బందికి మాత్రం తక్కువ వేతనాలు ఇవ్వడం వివక్షకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జీవో నెం. 14, జీవో నెం. 60తో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోవడంతో ఇక పోరాటాన్ని తీవ్రతరం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలోని అన్ని కేజీబీవీల నాన్ టీచింగ్ సిబ్బంది, వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సెప్టెంబర్ 11న జరిగే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సి. రాజు పిలుపునిచ్చారు.

## స్పీకర్‌కు ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి సంఘీభావం



**ఆమనగల్లు, (సింగిడి):** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అసెంబ్లీలో నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవితో కలిసి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనమండలి సభ్యుడు తాతా మధు స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ స్పీకర్కు సంఘీభావం తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసినవ్యాఖ్యలు అభ్యంతరకరమని సభ్యులు సభ మర్యాదలు,సాంప్రదాయాలు పాటించాల్సిన అవసరం ఉందనిచెప్పారు. శాసనసభ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక అని సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలుతీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబుకు విజ్ఞప్తి చేశారు.

## ముగిసిన బోనాల ఉత్సవాలు..



**ఆమనగల్లు,(సింగిడి):** కడ్తాల మండలంలో బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా, విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు, ప్రజల సహకారంతో వేడుకలు ప్రశాం తంగా సాగాయన్నారు. ఉత్స వాల విజయానికి కృషి చేసిన గ్రామ పెద్దలు, మీడియా ప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, యువకులు, పోలీసు సిబ్బంది, పంచాయతీ సిబ్బందికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## డివైఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా పిప్పళ్ళ శివశంకర్ ఏకగ్రీవ ఎన్నిక




**ఆమనగల్లు,(సింగిడి):** రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కేంద్రంలో నిర్వహించిన భారత ప్రజాతం త్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా 18వ మహాసభల్లో డివైఎఫ్ఐ నూతన అధ్యక్షునిగా ఆమనగల్లు ప్రాంతా నికి చెందిన పిప్పళ్ళ శివశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మహా సభల్లో నిరుద్యోగ యువత సమస్యలపై చర్చించి, ప్రభుత్వాల వ్యతిరేక విధానా లపై పోరాటాలు కొనసాగించాలని తీర్మానించారు. శివశంకర్ ఎన్నిక పట్ల పవన్, ప్రవీణ్, రాజు, మల్లేష్, వినోద్ సహా పలు ప్రజా సంఘాల నాయకులు కానుగుల వెంకటయ్య హర్షం వ్యక్తం చేశారు.

## నిమజ్జన ఏర్పాట్లపై ముందస్తు పరిశీలన





**ఆమనగలు, (సింగిడి):** ఆమనగల్లు మున్సిపా లిటీ పరిధిలోని సురసముద్రం చెరువు దగ్గర వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ముందస్తు పరిశీలన నిర్వహించారు. మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గీత ఆచారి కలిసి నిమజ్జన ప్రాంతాలను పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మోక్తాల వెంకటయ్య, ఎనుమల రమేష్, ఎర్రవోలు మహేష్, అనూష శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్, ధోని, శివ తదితరులు పాల్గొన్నారు.

### స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే

## సహించేది లేదు

### ఎమ్మెల్సీల దిష్టిబొమ్మ దహనం



**ఆమనగల్లు, (సింగిడి):** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆమనగల్లులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఎమ్మెల్సీల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. దళిత వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ పదవికి అవమానకరమన్నారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని సూచించారు. రాజకీయ విభేదాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో విమర్శలు చేయాలే తప్ప వ్యక్తిగ తంగా, కులపరంగా అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికా దన్నారు. ఎమ్మెల్సీలు తమ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, జిల్లా నాయకులు వస్పుల మానయ్య, సీనియర్ నాయకులు దావా ధనుంజయ, కాలే మల్లయ్య, ఖాదర్ ఖాద్రి, శ్రీధర్ రెడ్డి, రాగ్య నాయక్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, గాజుల సురేష్, అబ్దుల్ అలీమ్, వగ్గు మహేష్, కండె సాయి, సురేష్ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, శ్రీను నాయక్, దేవరశెట్టి మహేష్ , నాజర్, కుమార్ గౌడ్, రఫీ, ఫిరోజ్, శివ, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



**శ్రీరంగాపూర్, (సింగిడి):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించు కుని శ్రీ-రంగాపూర్ మండల పరిధిలోని ఏడుగురు ఉపాధ్యాయులను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి, బుధవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. మండల విద్యాధికారి హనుమంతు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాధికారి హనుమంతు మాట్లాడుతూ కృత్రిమ మేధ అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఉపాధ్యాయుల స్థానాన్ని అది పూర్తిగా భర్తీ చేయలేదని అన్నారు. విద్యార్థులకు జ్ఞానంతో పాటు సంస్కారం, నైతిక విలువలను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించే మార్గదర్శకులు ఉపాధ్యాయులేనన్నారు.

**పురస్కార గ్రహీతలు..**

బసన్న – గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, జెడ్పీ హెచ్ఎస్ నాగసానిపల్లి
బి. వెంకటేష్ – స్కూల్ అసిస్టెంట్ (గణితం), జెడ్పీ హెచ్ఎస్ శ్రీరంగాపూర్
అరుణ – స్కూల్ అసిస్టెంట్ (భౌతిక శాస్త్రం),
జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల శ్రీరంగాపూర్
వాణి – స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ శ్రీరంగాపూర్
మాధవిలత –ఎస్జీటీ, ప్రాథమికోన్నత పాఠశాల కంబాలాపూర్
బి. నరసింహ – ఎస్జీటీ, కంబాలాపూర్ తాండ
ఈశ్వరయ్య – ఎస్జీటీ, నాగరాల కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామంలో డ్రైనేజీలు నిర్మించకుంటే శాశ్వతంగా ప్రజలకు అవస్థలే

### ఇంకుడు గుంతల నిర్మాణం తాత్కాలిక ఉపశమనమే
### అధికారులు స్పందించాలే.. గ్రామస్తుల సమస్య పరిష్కరించాలే





**గోపాల్ పేట, (సింగిడి):** గోపాల్ పేట మండలంలోని లక్ష్మీదేవి పల్లి గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. గ్రామంలో పలు వీధుల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టిన ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టలేదు. దీంతో మురుగు నీరు అంత రోడ్లపైకి వచ్చేది. ఇటీవల గ్రామస్తులు ఇండ్ల ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్నారు. కానీ అవి శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వవు. ఇంకుడు గుంతల్లో చెత్తాచెదారం నిండితే మురుగు నీరు అంత రోడ్లపైకి వచ్చే ప్రమాదం ఉంది. డ్రైనేజీలు నిర్మిస్తే ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు, వర్షపు నీరు డ్రైనేజీ కాలువలో వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. లేదంటే రోడ్లపైకి చేరుతోంది. దీంతో పలు ప్రాంతాల్లో



మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లే అవకాశం ఉంటుందని గ్రామస్తుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంకుడు గుంతలు పూడ్కోపోతే మురుగునీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని, రోడ్లపై నీరు పారి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై పడ్డ వర్షంతో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. గ్రామంలో డ్రైనేజీ కాలువలు నిర్మించి మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే గ్రామాన్ని పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

## జడ్చర్లలో హరిత పర్యాటక హోటల్ ఏర్పాటు చేయాలి

### 4.12 ఎకరాల ప్రభుత్వ స్థలంలో హోటల్ నిర్మాణానికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రతిపాదన
### పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు విజ్ఞప్తి



**జడ్చర్ల, (సింగిడి):** జడ్చర్ల నియో జకవర్గంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయ డంతో పాటు ప్రయాణికులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో జడ్చర్లలో హరిత పర్యాటక హోటల్ ఏర్పాటు చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి లేఖ రాశారు. జడ్చర్ల గ్రామం, మండల పరిధిలోని సర్వే నంబర్ 445లో 4.12 ఎకరా ల ప్రభుత్వ భూమిని పర్యాటక శాఖకు కేటా యించినట్లు లేఖలో పేర్కొన్నారు. ఈ స్థలంలో హరిత పర్యాటక హోటల్ ఏర్పాటు చేస్తే జడ్చర్ల ప్రాంతంలో పర్యాటక కార్యకలాపాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. జడ్చర్ల వ్యూహాత్మకంగా అనుకూల మైన ప్రాంతంలో ఉన్నందున ప్రయాణికులు, పర్యాటకులకు నాణ్యమైన వసతి, భోజన సదుపా యాలు అందించేందుకు హరిత హోటల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హోటల్ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకా శాలు కూడా లభిస్తాయని తెలిపారు. ఇప్పటికే పర్యాటక శాఖకు కేటా యించిన సర్వే నంబర్ 445లోని 4.12 ఎకరాల స్థలంలో హరిత పర్యాటక హోటల్ నిర్మాణానికి త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి, అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి జూపల్లి కృష్ణారావును ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కోరారు. జడ్చర్ల అభివృద్ధిలో పర్యాటక రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును సాకారం చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

## అభివృద్ధి పనులు.. సంక్షేమ పథకాల అమలుపై అధికారులు దృష్టి పెట్టాలి

### మండల ప్రత్యేక అధికారి నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో సమావేశం



**అమరచింత, (సింగిడి):** ఆత్మకూరు మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో మండల సర్వస భ్య సమావేశం మండల ప్రత్యేక అధి కారి నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చిం చారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షిస్తూ, ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, ఎదురవుతున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయో జనాలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచిం చారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లో చేపడుతున్న కార్యక్రమా లపై సభ్యులు చర్చించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలు చొరవ చూపాలని సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను కూడా సమావేశంలో ప్రస్తావిస్తూ, పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయో జనం అందేలా చూడాలని సమావేశంలో సూచించారు. ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొ న్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీ లించి పరిష్కరిం చేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి నరేంద్ర కుమార్ సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచు కొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపైనా ఉందని పేర్కొ న్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీరామ్ రెడ్డి, రేచింతల పిఏసిఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, ఎంపీఓ రాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పం చులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మోడల్ స్కూల్‌లో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు



**దుబ్బాక, (సింగిడి):** కాళోజీ నారాయణ రావు 112వ జయంతిని పుర స్క రించుకుని లచ్చ పేట తెలంగాణ ఆదర్శ పాఠశా లలో తెలంగాణ భాషా దినో త్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రారంభమైన కార్యక్ర మాల్లో భాగంగా తెలంగాణకు చెందిన ప్రముఖ కవులు, రచయితల చిత్రపటాల ప్రదర్శన నిర్వ హించారు. పాఠ శాల గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న సుమారు 400 తెలుగు పుస్తకాలను ప్రదర్శనకు ఉంచారు. అనంతరం విద్యార్థుల ఆధ్వర్యంలో వివిధ సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాష, తెలంగాణ సాహి త్యం, సంస్కృతి తదితర అంశాల పై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేలా 12 అంశాల్లో భాషా సంబం ధిత పోటీలు నిర్వహించారు. మొత్తం 42 మంది విద్యార్థులు తెలంగాణ కవులు, రచయి తలు, ఉద్యమ వీరులు, ప్రముఖులు, తెలంగాణ కళలు, సంస్కృతి, భాష, తెలంగాణ ఉద్యమం తదితర అంశాలపై చక్కగా ప్రసంగించి ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి ప్రభుదాస్ మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరుగు తున్న పాఠశాలలో కూడా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహిం చడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బుచ్చిబాబు, తెలుగు ఉపాధ్యాయులు నరేష్, భవాని, రమేష్ కలిసి గత సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో తెలుగులో 99 మార్కులు సాధించిన 16 మంది విద్యార్థులకు, అలాగే పదో తరగతి తెలుగులో 100కు 100 మార్కులు సాధించిన విద్యార్థినికి బహుమ తులు అందజేశారు. వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచి, పాల్గొని అలరించిన విద్యార్థులకు ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమం విద్యార్థుల్లో తెలుగు భాష, తెలంగాణసాహిత్యం, సంస్కృతి పట్ల మరింత ఆసక్తిని పెంపొందించేలా సాగింది.

## రాజీతోనే.. కేసులకు చరమగీతం...

### 12న జాతీయ మెగా లోక్ అదాలత్
### జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్.



**నాగర్‌కర్నూల్, (సింగిడి):** ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాజీతోనే కేసులకు చరమగీతం పాడవచ్చునని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ సూచించారు. ఈ నెల 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో కోర్టు పరిధిలో ఉన్న వివిధ కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన, తక్కువ ఖర్చుతో పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ఈ జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. జిల్లాలో నమోదైన డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ (ఐఐ) కేసులు, ఈ–పెట్టీ కేసులు, చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ డిస్ప్యూట్లు వంటి వివాదాలను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకునే వీలుంటుందని తెలిపారు. అంతేకాకుండా, లోక్ అదాలత్ ఒక శాంతియుత పరిష్కార విధానం కావడంతో ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో తమ సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించుకుని, ఈ అవకాశాన్ని ప్రతి కక్షిదారుడు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## డిగ్రీ కళాశాలలో కాళోజీ జయంతి వేడుకలు






**దుబ్బాక, (సింగిడి):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుబ్బాకలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని గారి ఆధ్వర్యంలో, తెలుగు శాఖ ఉపన్యాసకులు డాక్టర్ వి. వెంకటేష్ నిర్వహణలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సాహిత్య, సాంస్కృతిక ప్రతిభను వెలికితీయ డంతో పాటు, విద్యా రంగంలో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించడం కళాశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాళోజీ నారాయణరావు సాహిత్యం, సామాజిక స్పృహ, తెలంగాణ భాషా వైశిష్ట్యాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలుగు శాఖ ఉపన్యాసకులు డాక్టర్ వి. వెంకటేష్ మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల జీవితాలను, వారి భాషను, బాధ లను, ఆశయాలను తన సాహిత్యంలో ప్రతిబింబిం చిన ప్రజాకవి అని పేర్కొన్నారు. 'నా గొడవ' వంటి రచనల ద్వారా సమాజంలోని అసమానతలను ప్రశ్ని స్తూ ప్రజల్లో చైతన్యాన్ని కలిగించారని తెలిపారు. తెలంగాణ మాండలిక భాషకు సాహిత్య గౌరవాన్ని తీసుకురావడంలో కాళోజీ పాత్ర ఎంతో విశిష్టమైన దని అన్నారు. విద్యార్థులు కాళోజీ సాహిత్యాన్ని చదివి, ఆయనలోని మానవతా దృక్పథాన్ని, సామాజిక బాధ్యతను, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చు కోవాలని సూచించారు. కేవలం జయంతి వేడుకలకు పరిమితం కాకుండా కాళోజీ ఆశయాలను ఆచరణ లో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నా రు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాసం, కవి త్వం, పాటల పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీలో ప్రథమ బహుమతిని శ్రీవేద ప్రియ (MP CS, ప్రథమ సంవత్సరం), కవిత్వ పోటీలో ప్రథమ బహుమతిని వైష్ణవి (B.Com, ద్వితీయ సంవత్సరం) సాధించారు. పాటల పోటీలో భార్గవి, సంగీత, శ్రావణి (BZC, తృతీయ సంవత్సరం) ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. అనంతరం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని చేతుల మీదుగా తెలుగు, కం ప్యూటర్ సైన్స్ విభాగాల విద్యార్థులకు జిజ్ఞాస విద్యార్థి అధ్యయన ప్రాజెక్టుల సర్టిఫికెట్లు అందజేశారు. అదేవిధంగా కంప్యూటర్ సైన్స్ విభాగంలో O గ్రేడ్ సాధించిన తృతీయ సంవత్సరం విద్యార్థిని మహ మ్మద్ ఆయేషా సిద్దికాకు నీరడి ఆంజనేయులు అంద జేసిన రూ. 2,000 నగదు బహుమతిని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులకు కళాశాల ప్రిన్సి పల్ ప్రొఫెసర్ కె. భవాని తెలుగు శాఖ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన

### ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనంపై తీర్మానం చేయాలి



**దుబ్బాక, (సింగిడి):** ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిద్ధిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో ఆశా కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కె. భారతమ్మ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న ఆశా వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలు, అణచివేత చర్యలు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లిన ఆశా కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళా కార్యకర్తలను కూడా చూడకుండా పోలీసులు వారి ఇళ్ల వద్దకు వెళ్లి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. చలో అసెంబ్లీకి వెళు తున్న ఆశా కార్యకర్తలను మార్గమధ్యంలో బస్సులు, రైళ్ల నుంచి బలవంతంగా దింపారని, అడ్డంకులను అధిగమించి హైదరాబాద్‌కు చేరుకున్న వారిని సైతం అక్రమంగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లలో రాత్రి వరకు నిర్బంధించారని ఆరోపించారు. ఆశా కార్యకర్తలు కొత్త డిమాండ్లు ఏమీ కోరడం లేదని, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయా లని కోరుతున్నామని భారతమ్మ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రజాస్వామిక హక్కులను గౌరవించాలని, అణచివేత విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ. 18,000 ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని, అదనపు పని భారాన్ని తగ్గించాలని, ఆశా కార్యకర్తలకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత ఉధృతమైన ఉద్యమానికి సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు సంతోషి, లత, అనిత, మమత, రజిత, భాగ్యలక్ష్మి, దేవేంద్ర, రమ్య, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఎలుకల మందు తాగి...



**శ్రీరంగాపూర్, (సింగిడి):** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని బస్టాండ్‌లో కొంతకాలంగా నివాసం ఉంటున్న ఎల్లప్ప (19) కుటుంబ కలహాల నేపథ్యంలో బుధ వారం రాత్రి ఎలుకల మందు సేవించినట్లు సమాచారం. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం బాధితుడిని చికిత్స నిమిత్తం వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## అక్రమ మద్యం తయారీ రవాణా సరఫరాలపై నిరంతరం నిఘా ఉంచాలి

### మద్యం డిపోలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
### నకిలీ మద్యం నియంత్రణపై అధికారులను ఆరా తీసీన కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





**తిమ్మాజిపేట (సింగిడి):** తిమ్మాజీపేట మండల పరిధిలోని తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొ రేషన్ లిమిటెడ్ (TSBCL) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అధికారిక ఇండియన్ మేడ్ లిక్కర్ (IML) డిపోను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ బుధవారం సాయంత్రం సందర్శించి నిలువలను పరిశీలించారు. డిపోలో మద్యం నిల్వలు, సరఫరా విధానం, భద్రతా చర్యలను క్షేత్రస్థాయి లో పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... డిపోకు వివిధ ప్రాంతాల నుంచి మద్యం ఏ విధంగా సరఫరా అవుతోంది, ఇక్కడి నుంచి ఏయే జిల్లాలు, ప్రాంతాలకు మద్యం సరఫరా జరుగుతోంది అనే అంశాలపై అధికా రులను అడిగి తెలుసుకున్నారు. మద్యం సరఫరా వ్యవ స్థలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబం ధనల ప్రకారం కార్యకలాపాలు నిర్వహించాలని సూచిం చారు. అలాగే నకిలీ మద్యం సరఫరాను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. నకిలీ మద్యం వల్ల ప్రజల ఆరోగ్యా నికి తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నందున, అక్రమ మద్యం తయారీ, రవాణా, సరఫరాపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అనుమానాస్పద కదలి కలు, అక్రమ సరఫరా గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. డిపోలోని ప్రస్తుతం ఉన్న మద్యం స్టాక్ పాయింట్, నిల్వల పరిమాణం, వివిధ రకాల మద్యం నిల్వలు, రోజువారీ సరఫరా వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లు, సరఫరా రికార్డులు తదితరాలను సక్రమంగా నిర్వహించాలని, నిల్వలుసరఫరా వివరాల్లో పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు. డిపోలో మద్యం నిల్వలు భద్రంగా ఉండేలా అవసరమైన భద్రతా ప్రమాణాలను పాటించాలని, అగ్నిప్రమాదాలు తదితర ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డిపోలో 75 వేల బీర్ కాటన్లు, సుమారు 62 వేల లిక్కర్ కాటన్ల మద్యం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. నాగర్ కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, మహబూబ్ నగర్ షాద్ నగర్ కోస్గి కొడంగల్ ప్రాంతాల మద్యం దుకాణాలకు సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్కు అధికారులు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంట ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, డిపో మేనేజర్ మల్లికార్జున్, స్టోర్ ఆఫీసర్ మధు, తహసీల్దార్ జయంతి, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రంగనాయక స్వామి ఆలయానికి కమిషనర్ ఆకస్మిక రాక



**శ్రీరంగాపూర్ (సింగిడి):** గతంలోతాను చేసిన విజ్ఞప్తికి స్పందించి బుధవారం రంగనాయక స్వామి ఆలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరంగాపూర్ ప్రాంతాన్ని భవిష్యత్‌లో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గతంలో విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో కమిషనర్ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రంగనాయక స్వామి ఆలయంతో పాటు పరిసర ప్రాంతంలోని పలు దేవాలయాల అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. ఆలయాల అభివృద్ధి, పర్యాటక వసతుల కల్పనకు అవసరమైన చర్యలపై సమీక్షించారు.




## సన్న వడ్ల ఆన్‌లైన్ నమోదుకు నేడే చివరి తేదీ

**బల్మూరు, (సింగిడి):** సన్న రకాల వరి సాగు చేస్తున్న రైతులు ప్రభుత్వం అందించే క్వింటాల్‌కు రూ. 500 బోనస్ పొందేందుకు తమ పంట వివరాలను విత్తన డీలర్ వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని, సన్న వడ్ల ఆన్‌లైన్ నమోదుకు నేడే 10సెప్టెంబర్ చివరి తేదీ కావున అర్హులైన రైతులు గడువు ముగిసేలోపు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని బల్మూరు మండల వ్యవసాయ అధికారి కావేటి నరేష్ తెలిపారు అలాగే ప్రతి రైతు తాను సాగు చేస్తున్న పంట వివరాలను సంబంధిత ఐజూ వాలంటీర్ల వద్ద పంట నమోదు చేయించుకోవాలి. ఐజూ వాలంటీర్లు పొలాలకు వచ్చినప్పుడు రైతులు పొలంలో అందుబాటులో ఉండి, తాము సాగు చేస్తున్న పంట వివరాలను అప్‌డేట్ చేయించుకోవాలి. పంట నమోదు చేయించుకోని రైతులు ధాన్యం Procurementతో పాటు, ప్రభుత్వం అందించే ఇతర పథకాలు , ప్రయోజనాలను కూడా కోల్పోయే అవకాశం ఉంది. కావున రైతులందరూ సంబంధిత విత్తన డీలర్లు మరియు ఐజూ వాలంటీర్లకు సహకరించి, తమ పంట వివరాలను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని బల్మూర్ మండల వ్యవసాయ అధికారి కావేటి నరేష్ తెలిపారు.

# భన్సాలీతో కలిసి పనిచేయబోతున్నారా?

బాలీవుడ్ నటి కరీనా కపూర్ మరియు ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ మధ్య 25 సంవత్సరాల తర్వాత ఒక కొత్త ప్రాజెక్ట్ పై చర్చలు జరుగుతున్నాయా? ఇటీవల కరీనా భన్సాలీ కార్యాలయానికి వెళ్లినప్పుడు ఈ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇది నిజమైతే, కరీనా మరియు భన్సాలీ మధ్య 25 సంవత్సరాల తర్వాత జరిగే మొదటి సహకారం అవుతుంది, ఎందుకంటే వారు 'దేవదాస్' సినిమా సమ యంలో ఒక గొడవకు గురయ్యారు. సెప్టెంబర్ 8న కరీనా భన్సాలీ కార్యాలయానికి వెళ్లినప్పుడు పాస్టెల్ బ్లూ సూట్ ధరించి కనిపించింది. ఆమె పాపారాజ్జీకి ఫోటోలకు నిలబ డలేదు. సంజయ్ లీలా భన్సాలీ తన తదుపరి చిత్రంలో మహిళా నాయ కత్వ పాత్ర కోసం కరీనాను సంప్ర దించి నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమె తమిళ నటుడు ధనుష్‌తో కలిసి నటించ నుంది, అయితే అన్ని విషయాలు బాగా జరిగితేనే. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు ఆమెకు ముఖ్యమైన పాత్ర ఉండబోతుంది. కరీనా ఈ చిత్రానికి ఆసక్తి చూపించినప్పటికీ, ఆమె ఇంకా సంతకం చేయలేదు. ఆమె తేదీలు, ఫీజులు మరియు ఇతర వివరాల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రం ఒక పౌరాణిక సాహస కథగా ఉంటుందని సమాచారం, ఇది అటవీ ప్రాంతంలో జరుగుతుంది. కథ అధికారికంగా వెల్లడించబడలేదు, కానీ ఈ చిత్రంలో ఒక ఏనుగు ముఖ్యమైన పాత్ర పోషించనుందని నివేదికలు సూచిస్తున్నాయి. భన్సాలీ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు, కాగా పి. ఎస్. మిత్రన్ దీనిని దర్శకత్వం వహించనున్నారు. ప్రాజెక్ట్ ప్రస్తుతం రచనలో ఉంది, ప్రీ-ప్రొడక్షన్ ఈ సంవత్సరం చివర్లో ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. షూటింగ్ 2027 జనవరిలో ప్రారంభమవుతుందని సమాచారం. కరీనా ఈ ప్రాజెక్ట్‌కు సంతకం చేస్తే, ఇది ఆమె మరియు భన్సాలీ మధ్య ఉన్న బాలీవుడ్‌లోని అత్యంత చర్చించబడిన వృత్తి గొడవను ముగించగలదు. కరీనా కపూర్ మరియు సంజయ్ లీలా భన్సాలీ మధ్య గొడవ 2000ల ప్రారంభంలో ప్రారంభమైంది, ఆ సమయంలో కరీనా 'దేవదాస్' చిత్రంలో పారో పాత్ర కోసం పరిశీలనలో ఉన్నది. కరీనా ఈ పాత్ర కోసం స్క్రీన్ టెస్ట్ చేసింది మరియు సంతకం చేసిన మొత్తాన్ని కూడా పొందింది. అయితే, ఈ పాత్ర చివరకు ఐశ్వర్య రాయ్ బచ్చన్‌కు వెళ్లింది, ఆమె 2002లో షారుక్ ఖాన్‌తో కలిసి నటించింది. కరీనా ఈ సంఘటనపై ఎంత బాధపడిందో గురించి మాట్లాడింది. ఒక పాత ఫిల్మ్‌ఫేర్ ఇంటర్వ్యూలో, ఆమె భన్సాలీతో పని చేయనని చెప్పింది. "నేను ఎప్పుడూ చేయను. ఆయన నాకు చేసినది తప్పు. ఆయన నాకు 'దేవదాస్' కోసం స్క్రీన్ టెస్ట్ ఇచ్చారు, సంతకం చేసిన మొత్తాన్ని ఇచ్చారు, తరువాత మరొకరిని తీసుకున్నారు. అది తప్పు, ఇది నాకు బాధ కలిగించింది, ఎందుకంటే నేను నా కెరీర్ ప్రారంభంలో ఉన్నాను. అది సరే, ఎందుకంటే ఆయన నన్ను విడిచిపెట్టిన రోజు నేను 'యాదెయిన్'కి సంతకం చేశాను. సంజయ్ నన్ను బాధపెట్టాడు. నేను పని లేకపోయినా, ఆయనతో పని చేయను" అని కరీనా చెప్పింది.





# నా మానసిక ధైర్యాన్ని దెబ్బతీశాయి

singidinews@gmail.com


సినిమా సింగిడి Cinma Singidi

గురువారం
10-9-2026

సినీ పరిశ్రమలో విజయాలు ఎంత గుర్తింపు తీసుకొస్తాయో... పరాజయాలు అంతకంటే ఎక్కువ ఒత్తిడిని మోసుకొస్తాయి. ముఖ్యంగా సోషల్ మీడియా హవా నడుస్తున్న నేటికాలంలో సినిమా ఫలితం తేడా కొడితే నటీనటులపై వచ్చే ట్రోలింగ్ వారిని తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తుంది. ఇలాగే హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను తాజా ఇంటర్వ్యూలో చెబుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా అభిలాష్ జోషి దర్శకత్వంలో సుమారు రూ. 50 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ' కింగ్ ఆఫ్ కోథా ' ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ సినిమా పరాజయం తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంపై చూపిన ప్రతికూల ప్రభావం గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. 2023లో భారీ హైప్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కింగ్ ఆఫ్ కోథా' బాక్సాఫీస్ వద్ద చతికిలబడటంతో పాటు, నెట్టింట తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంది. చిత్ర బృందంతో పాటు తనపై వచ్చిన ట్రోలింగ్ తనను తీవ్రంగా కలచివేసిందని ఐశ్వర్య తెలిపారు. సినిమాలో తన నటన, సంభాషణలు పలికే తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని, కొన్ని సందర్భాల్లో ప్రేక్షకుల విమర్శలు నిజమేనేమో అని తానూ భావించినట్లు చెప్పారు. ముఖ్యంగా దుల్కర్ పాత్రను ఉద్దేశించి తాను పలికిన 'రాజువెట్టా' అనే సంభాషణ నెట్టింట దారుణంగా ట్రోలింగ్‌కు గురైందని గుర్తుచేసుకున్నారు. ఈ నెగెటివిటీ అక్కడితో ఆగకుండా షూటింగ్ లొకేషన్లకూ పాకిందని ఐశ్వర్య గుర్తు చేసుకున్నారు. 'హలో మమ్మీ' సినిమా షూటింగ్ సమయంలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్ తనను ఉద్దేశపూర్వకంగా ఆ పేరుతో పిలిచి గేలి చేయడంతో తీవ్రంగా మనస్తాపం చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సినిమా తెచ్చిన ప్రతికూల ప్రభావంతో మలయాళ చిత్ర పరిశ్రమలో దర్శకనిర్మాతలు తనకు కొత్త అవకాశాలు ఇచ్చేందుకు వెనుకాడేవారని పేర్కొన్నారు. ఈ ట్రోల్స్ తెచ్చిన భయం ఎంతవరకు వెళ్లిందంటే, ఆ తర్వాత దుల్కర్ సల్మాన్‌తో కలిసి ఒక కమర్షియల్ యాడ్‌లో నటించే అవకాశం వచ్చినా ఆమె రిజెక్ట్ చేశారట. 'నేను ఆయనతో నటిస్తే మళ్లీ ట్రోలింగ్ మొదలై మీ ప్రాజెక్ట్‌కే ఇబ్బందిగా మారుతుంది' అని చెప్పి మరీ ఆ ఆఫర్‌ను వదులుకున్నానని, ఈ చేదు అనుభవం వల్ల దుల్కర్‌తో మళ్లీ కలిసి పనిచేయగలనా అనే సందేహం కలుగుతోందని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. గత చేదు జ్ఞాపకాలను అధిగమిస్తూ ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి ఇతర పరిశ్రమల్లో బలమైన ముద్ర వేస్తున్నారు. తమిళంలో ఇటీవల 'గట్ట కుస్తీ-2'తో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె, తెలుగులో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా ఎదుగుతున్నారు. సాయి దుర్గా తేజ్ సరసన ఆమె నటిస్తున్న భారీ చిత్రం 'సంబరాల ఏటి గట్టు' షూటింగ్ చివరి దశకు చేరుకుని, వచ్చే సంక్రాంతి బరిలో దిగేందుకు సిద్ధమవుతోంది.

## 'రణబాలి'లో యోధుడిగా విజయ్

విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'రణబాలి'. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 1854-1878ల నాటి బ్రిటిష్ ఇండియా నేపథ్యంలో, రాయలసీమ ప్రాంతంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందిస్తున్నారు. ఇందులో విజయ్ పవర్‌ఫుల్ యోధుడిగా కనిపిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామా అక్టోబర్ 16న దసరా కానుకగా విడుదల కానుంది. వారు ఆ కథను పాతిపెట్టారు.. వారు ఆ పేరును చెరిపివేశారు. వారు తమ పాపాలను తుడిచిపెట్టారు. కానీ అతని రౌద్రాగ్నిని మాత్రం ఎప్పటికీ పాతిపెట్టలేకపోయారు. జానపద గాథలు, చరిత్ర అతన్ని ఎప్పటికీ మరువవు. రణబాలి.. ఆ యోధుడి ప్రతిజ్ఞ" అని మేకర్స్ పేర్కొన్నారు. "అతిథులుగా వచ్చి, అణచివేతదారులుగా మిగిలిపోయిన వారిని. రక్తం చిందించాలని నిర్ణయించుకున్న మన గ్రామాల్లోని ఆ మనుషులను.. ఎప్పటికీ మర్చిపోవద్దు" అని విజయ్ దేవరకొండ పోస్ట్ పెట్టారు. 1854 - 1878 మధ్య కాలంలో బ్రిటిష్ ఇండియాలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా 'రణబాలి' చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో రణబాలి అనే వీరుడిగా విజయ్ దేవరకొండ కనిపిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రను రష్మిక పోషించారు. అజయ్ - అతుల్ సంగీతం సమకూర్చగా.. నీరవ్ షా, జిష్ణు భట్టాచార్జీ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. 'రణబాలి' చిత్రాన్ని టీ-సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని & వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్ - రష్మిక కలిసి నటిస్తున్న సినిమా ఇది. భార్యాభర్తలుగా మారిన తర్వాత విరోష్ నుంచి రాబోయే తొలి సినిమా కావడంతో అభిమానులు ఎగ్జైటెడ్ గా ఉన్నారు.





## నేడు ప్రేక్షకుల ముందుకు రానున్న 'మండాడి'

సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా 'మండాడి' నేడు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మహిమా నంబియార్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ కీలక పాత్రలు పోషించారు. తెలుగు రాష్ట్రాల్లో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి ఈ సినిమాను అత్యంత భారీ ఎత్తున విడుదల చేస్తోంది. తాజాగా ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డ్ ఈ సినిమాకి యూ/ఎ సర్టిఫికెట్ జారీ చేసింది. మూవీ చూసిన సెన్సార్ టీం సభ్యులు అద్భుతంగా వచ్చిందని అభినందించారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737